TARAJYOTHI TELUGU DAILY
# తారాజ్యోతి
తెలుగుదిన పత్రిక
చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్
ఆదివారం, మార్చి 22, 2026 | సంపుటి - 20 | సంచిక 190 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం




ఇరాన్‌పై యుద్ధంలో తుది దశకు చేరుకున్నాం

- సైనిక చర్యలను తగ్గించే విషయం పరిశీలిస్తున్నాం
- ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్
- ఇరాన్ చమురు అమ్మకాలపై ఆంక్షలు ఎత్తివేత

వాషింగ్టన్ : యుద్ధంపై ప్రపంచ వ్యాప్తంగా వ్యతిరేకత మొదలయ్యింది. ఆయిల్ , గ్యాస్ నిల్వలు తగ్గడం, రవాణా ఆగిపోవడంతో ప్రపంచ దేశాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తరువాయి 2లో



## ఎఐ ద్వారా దర్శనం సులువు చేసే చర్యలు

- శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం
- ఘనంగా స్వాగతించి, వేదాశీర్వచనం చేసిన పండితులు
- వెంగమాంబ అన్నసత్రంలో భక్తులకు ఆహారం వడ్డింపు
- భక్తులను నేరుగా కలుసుకుని చర్చించి చంద్రబాబు

తిరుమల : సీఎం చంద్రబాబు కుటుంబం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా శ్రీవారి సేవలో చంద్రబాబు కుటుంబం పాల్గొంది. ఆలయ మహాద్వారం వద్ద వారికి ఈవో, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు వేదాశీర్వచనాలు ఇచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు చంద్రబాబు కుటుంబం స్వయంగా వడ్డించింది. దేవాన్ష్ పేరుతో ఒక్క రోజు అన్నదాన వితరణకు రూ.44 లక్షల విరాళం అందించారు. వెంగమాంబ సత్రం నుంచి పద్మావతి వసతిగృహానికి వెళ్తూ సీఎం మధ్యలో ఆగారు. లేపాక్షి కూడలిలో భక్తులతో మాట్లాడారు. ఓ చిన్నారిని ఎత్తుకుని ముద్దాడారు. 2లో



## ఫుడ్ సేఫ్టీలో అత్యాధునిక పరిశోధన శాల

అక్రిడిటేషన్ వచ్చాక పూర్తిస్థాయి పరీక్షలు

వెల్లడించిన ఏపీ మంత్రి సత్యకుమార్

తిరుమల : కొద్దికాలం వ్యవధిలోనే తిరుమలలో ఫుడ్ సేఫ్టీ పరిశోధన శాలను ప్రారంభించామని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ పరిశోధన శాలలో అనేక పరీక్షలు చేసే యంత్రాలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. పాలు, నెయ్యి, నూనెతో పాటు ముడి సరుకుల నాణ్యతను పరీక్షించవచ్చని చెప్పుకొచ్చారు. తిరుమలలో ప్రతిష్టాత్మకంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ల్యాబ్‌ని సీఎం చంద్రబాబు ప్రారంభించారని వ్యాఖ్యానించారు. గతంలో జరిగిన దురదృష్టకరమైన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని 2024లో ఎఫ్ఎస్ఎస్ఏఐతో ఏపీ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుందని తెలిపారు. తరువాయి 2లో

## పశు పోషకులకు ఊరట



రుసుములపై సడలింపులు జారీ

మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

అమరావతి : పశుసంవర్ధక రంగానికి ఏపీ సర్కార్ భారీ ఊరట కల్పించింది. పట్టణాల్లో పశుపోషకులకు అభివృద్ధి ఛార్జీల నుంచి మినహాయింపునిచ్చింది. భవన అనుమతుల రుసుములో సడలింపులు చేసింది. ఈ సందర్భంగా అమరావతి లోని సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం మాట్లాడారు. రాష్ట్రంలో పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేస్తూ పశుపోషకులు, చిన్నరైతులకు పెద్దఎత్తున ఊరటనిచ్చేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఏపీలోని పట్టణ స్థానిక సంస్థలు, పట్టణ అభివృద్ధి సంస్థల పరిధిలో డెయిరీ ఫారాలు, గొర్రెలు పెంపకం కేంద్రాలు, పందుల పెంపకం యూనిట్లు, ఇతర పశుసంవర్ధక ఫారాలకు బెటర్‌మెంట్, డెవలప్‌మెంట్ ఛార్జీలు మినహాయింపు నిచ్చినట్లు మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. తరువాయి 2లో



## తీవ్రరూపం దాలుస్తోన్న ఇరాన్ యుద్ధం

- దాడులను తీవ్రతరం చేసిన ఇరాన్
- యూఎస్, యూకేల సంయుక్త సైనిక స్థావరమే లక్ష్యంగా దాడులు
- హిందూ మహాసముద్రం పైకి బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం

టెహ్రాన్ : రోజురోజుకూ ఇరాన్ యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. ఈ క్రమంలోనే హిందూ మహాసముద్రం పైకి ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణు లను ప్రయోగిం చింది. ఇలా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసినట్టు తెలుస్తోంది. 2లో



## నేడు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి సిఎం రేవంత్ ప్రారంభం

భారీగా ఏర్పాట్లు చేసిన వ్యవసాయాధికారులు

రైతుబంధు నిధులను కూడా విడుదల చేయనున్న సిఎం

సిఎం రాకతో నర్మెట్టలో భారీగా బందోబస్తు..ఏర్పాట్లు

*సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద నిర్మించిన ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ప్రారంభం తెలంగాణ వ్యవసాయ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవబోతోంది. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు కొత్త ఊపును ఇవ్వనుంది. మార్చి 22న ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభం కానుంది. అదే రోజు రాష్ట్ర రైతులకు రైతు భరోసా నిధుల విడుదల కూడా జరగనుంది. ఈ రెండు కార్యక్రమాలు ఒకే వేదికపై జరగడం తెలంగాణ రైతాంగానికి శుభసూచకంగా భావించాలి. ఈ సందర్భంగా నర్మెటలో భారీ ఏర్పాట్లు చేశారు.*



సిద్దిపేట : సిఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల, పొన్నం తదితరులు పాల్గొంటారు. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులకు దీర్ఘకాలిక ఆదాయం కల్పించే పంటగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఈ నేపథ్యంలో నర్మెట్టలో అత్యాధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించారు. సుమారు 62 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ ఆధునిక సాంకేతికతతో రూపొందించారు. ప్రారంభంలో గంటకు 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేసే ఈ మిల్లు భవిష్యత్తులో 120 మెట్రిక్ టన్నుల వరకు విస్తరించేలా రూపకల్పన చేశారు. తరువాయి 2లో



## శ్రమ ఫలితం మాది... శిలాఫలకాలు మీవా?

నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మా శ్రమ ఫలితం

- కాళేశ్వరంతో వ్యవసాయాన్ని పండగ చేశాం
- సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి మేం నిర్మించాం
- ఒక్కటంటే ఒక్క పనిచేయని రేవంత్
- ప్రారంభోత్సవాలకు రావడం.. రిబ్బన్ కట్ చేయడం మీ వంతా
- మీడియా సమావేశంలో మండిపడ్డ ఎమ్మెల్యే హరీష్ రావు

## దాడులతో దద్దరిల్లుతో పశ్చిమాసియా

**ఇరాన్ అణు కేంద్రంపై వైమానిక దాడులు**

**నష్టం లేదని తెలిపిన ఇరాన్**

**అంతర్జాతీయ ఉల్లంఘనేనని ఆరోపణ**

టెహ్రాన్ : దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా దద్దరిల్లు తోంది. తాజాగా ఇరాన్‌లోని నతాంజ్ అణు శుద్ధి కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ మరోసారి దాడులకు పాల్పడినట్టు స్థానిక మీడియా సంస్థ తస్నీమ్ తెలిపింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత నతాంజ్ అణు క్షేత్రంపై దాడులు చేయడం ఇది రెండోసారి. 3లో



## గో సంరక్షకుడు చంద్రశేఖర్ మృతి

ప్రమాదంలో చనిపోయాడన్న పోలీసులు

హత్య చేశారంటూ స్థానికుల ఆందోళన

జాతీయ రహదారి దిగ్బంధనం...ఉద్రిక్తత

## తమిళనాడు, కేరళను ఆనుకుని ఉపరిత ఆవర్తనం

24 వరకు ఉరుములు, మెరుపులతో వర్షం

వాతావరణ కేంద్రం వెల్లడి



చెన్నై : మన్నార్ గల్ఫ్ నుంచి దక్షిణ కర్ణాటక అంతర్గత ప్రాంతాలు, తమిళనాడు, పరిసరాల్లో కేరళ ఆనుకొని ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 24 వరకు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశముంది. 2

## ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ అమలు లేదు



వాటికి చట్టబద్ధత కల్పించాలని ప్రైవేట్ బిల్లు పెడతాం

మీడియా సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్ : ఆరు గ్యారంటీలకు చట్ట బద్ధత కోసం అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వెల్లడించారు. 2లో

## జీవన్‌రెడ్డితో మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి చర్చలు



**పార్టీ మారే ఆలోచన విరమించుకోవాలని వినతి**

**పార్టీలో అవమానం జరుగుతుంటే ఎలా అని జీవన్ నిలదీత**

**భవిష్యత్ కార్యాచరణను నేడు చెబుతానన్న జీవన్ రెడ్డి**

జగిత్యాల : పార్టీ మారతానన్న కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డిని బుజ్జగించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, లక్ష్మణ్, ఎమ్మెల్యే సత్యం భేటీ అయ్యారు. గంటకుపైగా సమావేశమయ్యారు. 2లో

# యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం

ఈ క్రమంలో యుద్ధం ఆగాలని అంతా కోరుకుంటున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధ జ్వాలలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అయితే, కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని పేర్కొనడం గమనార్హం.ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై మా లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. మా సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ దేశ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగినవిధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. 'ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నాం' అని రాసుకొచ్చారు. ఈ సందర్భంగా హర్ముజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా రక్షణ కల్పించదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ సాయం కోరితే.. సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇరాన్ ముప్పు తొలగిపోయిన తర్వాత ఆ అవసరం ఉండదన్నారు. ఇకపోతే యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించ డానికి మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని స్పష్టంచేశారు. అమెరికా మినహాయింపులపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు ముడి చమురు లేదని టెహ్రాన్ తెలిపింది. ఈ మేరకు ఇరాన్ ఇంధన మంత్రిత్వశాఖ ప్రతినిధి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకే యూఎస్ ఇలాంటి ప్రకటన చేసిందన్నారు.

### ఏఐ ద్వారా దర్శనం సులువు చేసే చర్యలు

భక్తుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అనంతరం తిరుమలలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. తితిదే ఆలయాలను అత్యంత ఆధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా.. ముందస్తుగా గుర్తించి వెంటనే పరిష్కారం చూపే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి.. శ్రీవారి దర్శనం పూర్తి చేసి తిరుగు ప్రయాణం అయ్యే వరకు.. వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమలలో సామాన్య భక్తుడిలా మారిపోయారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆయన తన కాన్వాయ్‌ను పక్కన పెట్టి, తిరుమల వీధుల్లో కాలినడకన తిరుగుతూ భక్తులతో ముఖాముఖి మాట్లాడారు. భక్తుల కష్టసుఖాలను, టీటీడీ అందిస్తున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తిరుమల ప్రసాదం విశిష్టతను కాపాడటమే తమ ప్రధాన ప్రాధాన్యతని భక్తులతో అన్నారు. గతంతో పోలిస్తే లడ్డూ నాణ్యత, రుచి చాలా బాగుందని భక్తులు ముఖ్యమంత్రికి వివరించారు. దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని మరింత తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు ఈ సందర్భంగా సీఎంను కోరారు. భక్తుల విజ్ఞప్తిపై స్పందించిన చంద్రబాబు, శ్రీవారి దర్శనాన్ని మరింత సులభతరం చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించబోతున్నామని వెల్లడించారు. టెక్నాలజీ సాయంతో క్యూ లైన్ల నిర్వహణను క్రమబద్ధీకరించి, భక్తులకు తక్కువ సమయంలోనే స్వామివారి దర్శనం కలిగేలా టీటీడీ చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. మరోవైపు.. తిరుమల పర్యటనను ముగించుకొని రోడ్డు మార్గాన మంత్రి లోకేష్, భువనేశ్వరి, దేవాన్ష్ రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరారు.

# ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ అమలు లేదు

పార్టీలో గౌరవం దక్కడం లేదని ఈ సందర్భంగా మంత్రుల ముందు జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సమస్య ఉంటే అధిష్ఠానంతో మాట్లాడుదామని, పార్టీ మారే ఆలోచన మంచిది కాదని సూచించారు. దీనికి జీవన్ రెడ్డి పెద్దగా స్పందించలేదు. ఈ భేటీ అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. జీవన్‌రెడ్డి 4 దశాబ్దాలుగా పార్టీలో ఉన్నారని అన్నారు. ఆయనతో అనేక అంశాలు చర్చించినట్లు తెలిపారు. ఆయన ఆవేదనను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ భేటీ అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడారు. తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదన్నారు. పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తానని చెప్పారు. కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తితో ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి పార్టీ మారుతున్నారు ప్రచారంతో ఇద్దరు మంత్రులను కాంగ్రెస్ రంగంలోకి దింపింది. పార్టీ వీడకుండా ఉండేందుకు ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ సంప్రదింపులు మొదలుపెట్టారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ.. అసలు కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేయడంపై జీవన్ రెడ్డి కొంతకాలంగా బహిరంగంగానే అసమ్మతి తెలుపు తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కూడా ఆయన అధిష్ఠానాన్ని కోరారు. కానీ హైకమాండ్ పట్టించుకోకపోవడంతో పార్టీని వీడేం దుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో సమావేశానికి రావాలని రాష్ట్ర పీసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆహ్వానించారు. కానీ మీనాక్షి నటరాజన్‌తో జరగాల్సిన మీటింగ్‌కు జీవన్ రెడ్డి గైర్హాజరయ్యారు. ఈ క్రమంలోనే జీవన్ రెడ్డి ఇంటికి ఉదయం మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వెళ్లారు. జీవన్ రెడ్డితో అల్పాహారం చేస్తూ ముచ్చటిస్తున్నారు. కాగా, రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఇవాళ కాంగ్రెస్ పార్టీ లేదని జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సమయంలో మీడియాను లోపలికి అనుమతించకుండా రహస్యంగా చర్చించారు. ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా చేస్తున్నారని సమాచారం.

# తమిళనాడు, కేరళను అనుకుని ఉపరితల ఆవర్తనం

ఈ మేరకు వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో తిరుచ్చి, పెరంబలూరు, అరియలూరు జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఈ నెల 24వ తేది వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి భారీవర్షం కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.



## నేడు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి

# సీఎం రేవంత్ ప్రారంభం

ఈ ప్రాజెక్టు వేగంగా పూర్తికావడంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. ఆయన తరచుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని సమీక్షించారు. అదే విధంగా జంగా రాఘవరెడ్డి నాయకత్వంలో ఆయిల్ ఫెడ్ అధికారులు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని రికార్డు సమయంలో పూర్తి చేశారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా మార్చి 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహిస్తున్నారు. ఇందులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, ఆయిల్ పామ్ సాగులోని మెలకువలపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది. మొదటి విడతగా నర్మెట్టలో జరిగే కార్యక్రమంలో 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,590 కోట్లు నేరుగా జమ చేయనున్నారు. అనంతరం మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోగా మిగిలిన రైతులకు కూడా నిధులు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మొత్తంగా రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి సుమారు రూ.9,000 కోట్లు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. రైతులు వ్యవసాయరంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి .. ఆదాయం బాటలో నడవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు మహోత్సవ మేళా కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నిర్వహిస్తోంది. ఈ మేళాలో వ్యవసాయం, ఉద్యానం, పట్టుపరిశ్రమ, మత్స్యశాఖ, మార్క్‌ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థ, చేనేత జౌళి శాఖలతోపాటు విజయడైరీ, సాగు యంత్రాలతో 150 స్టాళను ఏర్పాటు చేశారు. సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జనగామ, కరీంనగర్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మెదక్, వరంగల్, కామారెడ్డి జిల్లాల నుంచి 50 వేల మందికి పైగా పాల్గొంటున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారిణి స్వరూపరాణి తెలిపారు. సోలార్ సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ యాప్ ద్వారా పొలానికి నీరు అందించే పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. 'ఆటోపామ్' సంస్థ వారు ఫోన్‌ను వాడుతూ పంటకు నీరు అందించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. బిందు సేద్యంలో పంటకు మందులను సైతం పంపవచ్చు. ఒకసారి ఏర్పాటు చేసుకుంటే పదేళ్ల పాటు వినియోగించుకోవచ్చని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆవిష్కరించిన సమీకృత వ్యవసాయ ప్రదర్శన ఇది. చిన్న, సన్నకారు రైతులకు ఎంతో లాభదాయకం. 2-3 ఎకరాలు భూమి ఉన్న రైతులు ఒకే పంట కాకుండా వరి, కందులు, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు, పశుగ్రాసం, కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ, చేపలు, గొర్రెలు, మేకల పెంపకం చేపట్టవచ్చు. రోజూ ఆదాయం పొందవచ్చని విద్యార్థిని శివాని తెలిపారు. సంప్రదాయ పంటలను సాగు చేసి నష్టాలు చవిచూసిన రైతులకు అధిక దిడుబడులు సాధించే దిశగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవిష్కరించిన నూతన వంగడాలు ఇవి. వరి రకాలు తెలంగాణ సోనా, కె.యన్.ఎమ్ 1638, కంది డబ్ల్యూఆర్జీ 255, పెసర ఎం.జి.జి. 385, వేరుశనగ జేసీజీ 2141, ఆముదం పీసీఎస్ 262, తెలంగాణ జొన్న, పాలెం రాగి వంటి సంకర జాతి విత్తనాలను ప్రదర్శించారు.

## శ్రమ ఫలితం మాది...

# శిలాఫలకాలు మీవా?

సిద్దిపేట : సిద్దిపేట నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల రద్దుపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ఇచ్చిందని లేదని.. అవన్నీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించుకున్నవే అని తెలిపారు. శ్రమ ఫలితం మాది, శిలాఫలకాలు మీవా? అంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఘాటు విమర్శలు చేశారు. సీఎం రేవంత్ ఆదివారం సిద్దిపేట పర్యటన నేపథ్యంలో పలు ప్రశ్నలు సంధించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మేం అసెంబ్లీలో చేసిన ఒత్తిడితోనే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చిందని హరీశ్ రావు తెలిపారు. మా పోరాటం ఫలితంగానే ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.సిద్దిపేట జిల్లా నర్మెట్టలో 365 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి రేపు ప్రారంభించే ఆయిల్ ఫ్యాక్టరీ 2021లోనే ప్రారంభించాం. ఈ ఆయిల్ ఫామ్‌కి ప్రాణాధారం కాళేశ్వరం ప్రాజెక్టు. కాళేశ్వరాన్ని కూలేశ్వరం అన్న రేవంత్ రెడ్డి తన వైఖరి మార్చుకోవాలి. కాళేశ్వరాన్ని అడ్డుకోవడానికి ఆయన అనేక ప్రయత్నాలు చేశారు. మొక్కవోని దీక్షతో పూర్తి చేసింది మేము. ఇప్పటికైనా కాళేశ్వరంపై చిల్లర మాటలు మానుకో అని హితవు చెప్పారు. ఆ ప్రాజెక్టు పూర్తి చేయడంలో అనేక విధాలుగా శ్రమ పడ్డాం. 20 కోట్ల లీటర్ల నీటి నిలువ సామర్థ్యం కలిగిన పాండ్ నిర్మించాం. మలేషియా టెక్నాలజీతో ఇండియాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాం అన్నారు. బీఆర్ఎస్ కృషి ఫలితమే ఆయిల్ ఫ్యాక్టరీ. దాన్ని ఈరోజు రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి, రెండు పీహెచ్‌సీలు నేను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండగా మంజూరు చేసి పూర్తి చేసినవి. వీటికి మీరు శిలాఫలకం వేసుకుని ప్రారంభిస్తున్నారు. ఇందులో మీరు చేసిందేమీ లేదు. మేము ఆలయాలు, విద్యాలయాలు, రిజర్వాయర్లు, జైళ్లు నిర్మించాం. రూ.78కోట్లతో 30 ఎకరాల్లో జిల్లా జైలు నిర్మించాం. కట్టించింది మేము, శిలాఫలకం మీరు వేసుకున్నారు. చేసుకో నాకేమీ ఈర్ష్య లేదు. కానీ శ్రమ ఎవరిది, శిలాఫలకం ఎవరిది?. కనపడిన ప్రతి దేవుడు మీద ఒట్టుపెట్టి రుణమాఫీ అన్నారు.. అది ఇప్పటికీ కాలేదు. సిద్దిపేట జిల్లాలో 22వేల మంది రైతులకు రూ.300కోట్ల రుణమాఫీ పెండింగ్‌లో ఉంది. ఒక నర్మెట్టలోనే 350మంది రైతులకు రుణమాఫీ కాలేదు. మా నియోజకవర్గంలో రుణమాఫీ అయ్యింది 48 శాతం, కానిది 52 శాతం. మూడు పంటలకు రైతు బంధు ఎగ్గొట్టారు. రేపు ఏ రైతు బంధు ఇస్తున్నారో రేవంత్ తెలపాలని డిమాండ్ చేశారు. పంటల బీమా రెండున్నర ఏళ్లుగా చేయలేదు. నష్టపోయిన రైతులకి ఒక్క రూపాయీ పరిహారం ఇవ్వలేదు. వడగళ్ల బాధిత రైతులకు నిధులు విడుదల చేయాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క పనీ సిద్దిపేటకు ఇవ్వలేదు. సిద్దిపేటలో జరుగుతున్న రూ.1071 కోట్ల పనులనూ అర్ధాంతరంగా రద్దు చేశారు. ఆ నిధులు వెంటనే పునరుద్ధరించాలి. ప్రభుత్వ వెటర్నరీ కాలేజీ, రంగనాయకసాగర్ టూరిజం, శిల్పారామం, స్పోర్ట్స్ స్టేడియం ఇలా అనేక పనులు రద్దు చేశారు. వీటిలో కొన్నిటిని కొడంగల్?కు రేవంత్ ఎత్తుకుపోయారు. ఇది ఒక ముఖ్యమంత్రి చేయాల్సిన పనేనా?. ఏ ముఖం పెట్టుకుని సిద్దిపేటకు వస్తున్నారు. మీరు రద్దు చేసిన గొప్పలు చెప్పుకోవడానికి వస్తున్నావా?' అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారని హరీశ్‌రావు తెలిపారు. క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధర ఉంటే.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో నిన్నటిదాకా రైతులు బయట దళారులకు రూ. 1600-1700లకే అమ్ముకుని తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందే ఈ కేంద్రాలను ప్రారంభించి ఉంటే రైతులందరికీ మేలు జరిగేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే 20 నుంచి 25 శాతం మొక్కజొన్న దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందని చెప్పారు. ఇప్పటికైనా రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. మన ప్రాంతంలో సన్‌ఫ్లవర్ కూడా బాగా సాగు చేస్తున్నారని.. దానికి కూడా ఈరోజు కొనుగోలు కేంద్రం ప్రారంభించామని హరీశ్‌రావు తెలిపారు. సన్‌ఫ్లవర్‌కు క్వింటాల్‌కు రూ. 7721 మద్దతు ధర ఉందని.. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఆదాయం పొందాలని సూచించారు. సన్‌ఫ్లవర్ తక్కువ కాలంలో పూర్తయ్యే పంట.. దీనివల్ల అధిక ఆదాయంతో పాటు మంచి దిగుబడి కూడా వస్తుందని అన్నారు. పంట మార్పిడికి కూడా ఇది ఎంతో ఉపయోగకరమని అన్నారు. రాబోయే రోజుల్లో దీన్ని ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ యాసంగిలో మన సిద్దిపేట ప్రాంతంలో ఇంత మంచి దిగుబడి వస్తుందంటే, ఈ స్థాయిలో పంటలు పండుతున్నాయంటే దానికి ఏకైక కారణం కాళేశ్వరం ప్రాజెక్టే అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఒకప్పుడు సిద్దిపేట నియోజకవర్గంలో యాసంగి సాగు కేవలం 8 వేల ఎకరాలు మాత్రమే ఉండేది. కానీ ఇవాళ కాళేశ్వరం జలాల పుణ్యమా అని అది పదింతలు పెరిగి ఏకంగా 80 వేల ఎకరాల్లో యాసంగి సాగు జరుగుతోందని తెలిపారు. 2005వ సంవత్సరంలో కరువు వచ్చిన పరిస్థితులు నాకు ఇంకా బాగా గుర్తున్నాయన్నారు. తాగడానికి నీళ్లు లేక, పశు వులకు గడ్డి లేక అల్లాడిపోయామని పేర్కొన్నారు. పశువులను బతికించుకోవడానికి చిన్నకోడూరు, రాజగోపాల్‌పేట, నంగునూరులో పశుగ్రాస కేంద్రాలు పెట్టి ఆంధ్రా నుంచి 40 లక్షల మెట్రిక్ టన్నుల గడ్డి తెచ్చి రైతులకు సప్లై చేశామని గుర్తుచేశారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చాక సిద్దిపేట దరిదాపుల్లో కరువు అనే మాటే లేదని తెలిపారు. వానలు పడినా, పడకపోయినా కాలంతో సంబంధం లేకుండా రైతులు రెండు పంటలు పండిస్తూ బంగారం లాంటి దిగుబడులు సాధిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఒకప్పుడు కరువుతో అల్లాడిన మన ప్రాంతానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఒక వరంలా మారిందని హరీశ్‌రావు తెలిపారు. ఈ ప్రాజెక్టు మన ప్రాంత రూపురేఖలను మార్చేసి, వ్యవసాయానికి కొత్త దిశానిర్దేశర చేసిందని పేర్కొన్నారు. రైతులు ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల ద్వారానే తమ పంటను అమ్ముకుని ప్రభుత్వ మద్దతు ధరను పూర్తిస్థాయిలో పొందాలని సూచించారు

## ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ అమలు లేదు

ఈ విషయంలో అసెంబ్లీ స్పీకర్, శాసనమండలి చైర్మన్‌ను కలుస్తామని తెలిపారు. ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు కాలేదన్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల బిల్లుకు మద్దతు కోసం అన్నిపార్టీలకు లేఖలు రాస్తామని చెప్పుకొచ్చారు. 840 రోజులు అయినా ఆరు గ్యారంటీలు ఎందుకు అమలు చేయట్లేదని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు పెద్ద ఫ్రాడ్ అని ఎద్దేవా చేశారు. సీఎం సంతకం చేసిన ÷ల్ ఎందుకు దొరకడం లేదని నిలదీశారు. ఈ ఫైల్ ఢిల్లీ విమాన ప్రయాణంలో పోయిందా..?, ఎఫ్ఎస్ఎల్ అగ్నిప్రమాదంలో కాలిపోయిందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ సర్కార్ ఇంకా ఒక బ్జడెట్ మాత్రమే ప్రవేశపెట్టాల్సి ఉందని.. ఆరు గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు చట్టమైతే అన్నివర్గాలకు లాభం కలుగుతుందని చెప్పుకొచ్చారు. ప్రజల తరఫున ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడుతున్నామని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టిన చరిత్ర అసెంబ్లీకి ఉందని ప్రస్తావించారు.ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. బీజేపీ ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టిందని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును బీజేపీ వ్యతిరేకించినా ఇబ్బంది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం కోటి మోసాలు చేసిందని ధ్వజమెత్తారు. ప్రజల నుంచి ఓట్లు రాబట్టడానికి అడ్డగోలు హామీలు ఇచ్చిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల హామీల అమలు చట్టం ÷ల్‌పై సంతకం చేశారని ఉభయ సభల్లో గత గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తన ప్రసంగంలో చెప్పారని ప్రస్తావించారు.

## గో సంరక్షకుడు చంద్రశేఖర్ మృతి

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని మథురలో శనివారంనాడు తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. గో సంరక్షకుడు చంద్రశేఖర్ మృతిని ఖండిస్తూ స్థానికులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. గోవుల స్మగ్లింగ్‌ను అనుమానించి ఒక ట్రక్కును వెంబడిస్తుండగా అది ఆయన బైకును ఢీకొట్టిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో ఫర్సా వాలే బాబాగా పేరున్న చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో కోసి కలాన్ ఏరియాలో జాతీయ రహదారిని గో సంరక్షకులు దిగ్బంధించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ-ఆగ్రా రహదారిపై ఆందోళనలు చోటుచేసుకోవడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అక్కడకు చేరుకున్న పోలీసులు, వారి వాహనాలపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. అయినప్పటికీ ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఆందోళనకారుల్ని పోలీసులు చెదరగొట్టే ప్రయత్నం చేశారు. అయితే నిరసకారులు తిరగబడడంతో.. ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటన జరిగిన ప్రాంతంలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు భారీగా మోహరించారు .ఘటనపై మథుర ఎస్ఎస్‌పీ మాట్లాడుతూ, గోవులను స్మగ్లింగ్ చేస్తున్నారనే అనుమానంతో కంటైనర్ ట్రక్కును బాబా అడ్డుకున్నారని, దట్టమైన మంచు కారణంగా ఆయన బైక్‌ను ట్రక్కు ఢీకొందని తెలిపారు. ట్రక్కులో వైర్లు, రేషన్ సరుకులు ఉన్నాయని, డ్రైవర్, హెల్పర్‌ను ప్రశ్నిస్తున్నామని చెప్పారు. గోవుల స్మగ్లింగ్‌తో ఈ ఘటనకు సంబంధం ఉన్నట్టు అనిపించడం లేదని, రోడ్డు ప్రమాదంగానే కనిపిస్తోందని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరుపుతున్నామని చెప్పారు. ఫార్సా వాలే బాబా మృతికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర సంతాపం తెలిపారు. తక్షణం ఘటనా స్థలికి వెళ్లి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 'నేరస్థుల ప్రమేయం ఏమాత్రం ఉన్నా క్షమించి విడిచిపెట్టేది లేదు' అని సీఎంఓ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

# తీవ్ర రూపం దాలుస్తోన్న ఇరాన్ యుద్ధం

ఏకంగా 4 వేల కిలోమీటర్ల దూరంలోని యూఎస్, యూకేల సంయుక్త సైనిక స్థావరమే లక్ష్యంగా రెండు బాలిస్టిక్ క్షిపణుల ను ప్రయోగించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హిందూ మహాసముద్రంలోని డియేగో గార్సియా దీవిలోగల సైనిక స్థావరంపై ఇరాన్ ఈ మిసైల్స్‌ను ప్రయోగించిందని సమాచారం.చాగోస్ ద్వీపసముదాయంలో ఇదొక భాగం. మీడియా కథనాల ప్రకారం, ఇరాన్ ప్రయోగించిన తొలి మిసైల్ మార్గమధ్యంలోనే విఫలమైంది. మరో మిసైల్‌పై ఒక అమెరికా యుద్ధ నౌక క్షిపణి విధ్వంసక రాకెట్‌ను ప్రయోగించింది. ఈ దాడిలో రెండో మిసైల్ ధ్వంసమైందా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ వార్తలపై అమెరికా ఇంకా స్పందించ లేదు. ఇప్పటివరకూ ఇరాన్ మిసైల్ దాడులు పశ్చిమాసియాకే పరిమితమయ్యాయి. తాజాగా హిందూ మహాసముద్రంలోని దీవిని ఇరాన్ చేసిందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. ఇదే నిజమైతే ఐరోపా ఖండంలోని పలు యూఎస్ సైనిక స్థావరాలు ఇరాన్ దాడుల పరిధిలోకి వచ్చినట్టు అవుతుందని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. ఇటీవల శ్రీలంకకు దక్షిణాన హిందూ మహాసముద్ర జలాల్లో ఒక ఇరాన్ యుద్ధ నౌకను అమెరికా సబ్‌మెరైన్ ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. టార్పిడో ప్రయోగంతో తీవ్రంగా దెబ్బతిన్న ఇరాన్ నౌక నీట మునిగిపోయింది. ఈ ఘటనలో సుమారు 85 మంది మరణించారు. భారత్‌లో జరిగిన మిలన్-2026 నావికాదళ విన్యాసాల్లో పాల్గొన్న ఇరాన్ నౌక తిరిగి వెళుతున్న సమయంలో అమెరికా దాడి చేసింది. ఇరాన్ నావికా దళాన్ని నిర్వీర్యం చేయడం తమ ప్రాథమిక లక్ష్యాల్లో ఒకటని అమెరికా అప్పట్లో పేర్కొంది. అయితే ఈ క్షిపణులను ఎప్పుడు ప్రయోగించారన్న దానిపై స్పష్టత లేదు. డిగో గార్సియా హిందూ మహాసముద్రంలో యూఎస్-యూకేకు ఉన్న వ్యూహాత్మక సైనిక స్థావరం. హిందూ మహాసముద్రంలో 60 దీవుల సముదాయం చాగోస్. అందులో అతిపెద్దదే డిగో గార్సియా. ఆఫ్రికా, పశ్చిమాసియాలోని కార్యకలాపాల కోసం అమెరికా దీనిని ప్రధానంగా వినియోగిస్తోంది. ఇదిలాఉంటే.. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు, ఇరాన్‌కు చెందిన ఖర్గ్ ఐలాండ్‌ను ఆక్రమించే అవకాశాలను అమెరికా పరిశీలిస్తోందని వార్తలు వస్తున్నాయి. ఆ క్రమంలోనే పశ్చిమాసియాలో మరో మూడు యుద్ధనౌకలను మోహరించేందుకు అమెరికా సిద్ధమైంది. యూఎస్ఎస్ బాక్సర్, మరో రెండు యుద్ధనౌకలు దాదాపు 2,500 మంది నౌకాదళ సిబ్బందితో పశ్చిమాసియా దిశగా వెళ్తున్నట్లు అమెరికా అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించిన సంగతి తెలిసిందే. అగ్రరాజ్యానికి చెందిన యాంఫిబియస్ అసాల్ట్ షిప్ యూఎస్ఎస్ ట్రిపోలీ పశ్చిమాసియా వైపు కదులుతున్నట్లు తెలుస్తోంది.ఈ పరిణామాల వేళ..ఈ క్షిపణుల ప్రయోగం గురించి వెలుగులోకి వచ్చింది. తమవద్ద క్షిపణుల పరిధి 2000 కి.మీ. వరకు ఉంటుందని ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి వెల్లడించారు. కానీ చెప్పిన దానికంటే ఇరాన్ వద్ద ఉన్న మిస్సైళ్ల పరిధి చాలా ఎక్కువే ఉండొచ్చని తాజా ఘటన వెల్లడి చేస్తోంది.

## ఫుడ్ సేఫ్టీలో అత్యాధునిక పరిశోధన శాల

విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో స్టేట్ ఫుడ్ ల్యాబ్‌కి అదనంగా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ప్రస్తావించారు. శనివారం తిరుమలలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.25 కోట్లతో నిర్మించిన ఈ పరిశోధన శాలలో అత్యాధునిక పరికరాలు ఉన్నాయని వెల్లడించారు. ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో ఈ పరిశోధన శాల పని చేస్తోందని వివరించారు. అప్పటి వరకు అనాలిసిస్ జరుగుతునే ఉంటుందని తెలిపారు. మూడు నెలల్లో గుంటూరు, వైజాగ్‌లో పరిశోధన శాలలను ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఏపీలో వివిధ ప్రాంతాల్లో 11 స్టేట్ ఫుడ్ ల్యాబ్‌లను ఆధునికీకరించామని అన్నారు. నాణ్యతలో ఎక్కడ రాజీపడ బోమని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

## పశు పోషకులకు ఊరట

ఈ ఫారాలకు భవన అనుమతి/లైసెన్స్ రుసుమును గ్రామ పంచాయతీల్లో వసూలు చేసే రుసుముకు సమానంగా నిర్ణయించినట్లు తెలిపారు. నిర్ణయం ద్వారా పట్టణ ప్రాంతాల్లో పశుపోషణపై ఆధారపడిన రైతులు, చిన్న వ్యవసాయదారులకు ఆర్థిక భారం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని మంత్రి చెప్పుకొచ్చారు. ఈ నిర్ణయంతో మరింత మందికి స్వయం ఉపాధి, సమృద్ధి లభిస్తుందని వెల్లడించారు. గత జూన్‌లో జరిగిన సీఎం కాంక్లేవ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# దాడులతో దద్దరిల్లుతో పశ్చిమాసియా

నతాంజ్ అణు క్షేత్రంపై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడ్డాయని, అయితే రేడియోధార్మిక పదార్థాల లీకేజీ జరగలేదని, పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి సమస్యా లేదని తెలిపింది. నతాంజ్ క్షేత్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం, ఇతర అణు భద్రత నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంది. నేరపూరిత చర్యల్లో భాగంగానే నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలోనే నతాంజ్ అణు కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగిన సంగతి తెలిసిందే .తాము జరిపిన దాడుల్లో ఇరాన్‌కు భారీ నష్టం వాటిల్లిందని, ఇక ఆ దేశానికి యురేనియం శుద్ధి, బాలిస్టిక్ క్షిపణుల తయారీ సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ప్రకటించారు. నెతన్యాహు ప్రకటించిన కొద్ది గంటల్లోనే నతాంజ్ అణు కేంద్రంపై దాడులు జరగడం గమనార్హం. నతాంజ్ అణు కేంద్రం టెహ్రాన్‌కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉంది.

# యుఎన్ఐ ఆఫస్ స్వాధీనం

### జర్నలిస్టులను బయటకు పంపిన పోలీసులు

### హైకోర్టు ఆదేశాలతో కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ,మార్చి21 : దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా వార్తా ఏజెన్సీ యుఎన్ఐ ఆఫీసును శుక్రవారం రాత్రి మూసివేశారు. పారామిలిటరీ దళాలు, ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా ఆ ఆఫీసుపై దాడి చేశాయి. సుమారు 50 మంది జర్నలిస్టులను ఆ ఆఫీసు నుంచి బయటకు గెంటివేశారు. భూ వివాదం నేపథ్యంలో కోర్టు ఆదేశాల ప్రకారం రఫీ మార్గ్‌లో ఉన్న యూఎన్ఐ ఆఫీసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం లాండ్ అండ్ డెవలప్మెంట్ ఆఫీసర్లకు రక్షణ కల్పించేందుకు యూఎన్ఐ సిబ్బందిని ఖాళీ చేయించినట్లు డిప్యూటీ కమిషనర్ సచిన్ శర్మ తెలిపారు. అయితే తమకు ఎటువంటి నోటీసు ఇవ్వలేదని యూఎన్ఐ తన ప్రకటనలో తెలిపింది. బలవంతంగా ఆఫీసును ఖాళీ చేయించినట్లు ఆ సంస్థ ఆరోపించింది. కొందరు ఉద్యోగులను ఈడ్చుకెళ్లారని యూఎన్ఐ పేర్కొన్నది. న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన భూకేటాయింపును రద్దు చేయడంతో శుక్రవారం రాత్రి పోలీసుల యూఎన్ఐ ఆఫీసును సీజ్ చేశారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో యూఎన్ఐ ఆఫీసును అధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ చర్య పత్రికా స్వేచ్ఛపై దాడిగా యూఎన్ఐ పేర్కొన్నది. నాలుగు దశాబ్దాల క్రితం కేటాయించిన భూమిపై ఏజెన్సీ ఇంత వరకు నిర్మాణం చేపట్టలేదని హైకోర్టు తన తీర్పులో పేర్కొన్నది. 1979 భూ కేటాయింపు చట్టం ప్రకారం భూమి తీసుకున్న రెండేళ్లలోనే నిర్మాణాన్ని చేపట్టాలి, కానీ యూఎన్ఐ ఆ పనిచేయలేదని హైకోర్టు వెల్లడించింది.

# మొన్న భార్య ... నేడు భర్త ఆత్మహత్య

### కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ బలవన్మరణం

కరీంనగర్ : కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 18వ తేదీన చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన చంద్రశేఖర్.. ఇల్లంతకుంట మండలం సీతంపేటలోని అత్తగారింట్లో ఉరివేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సీతంపేటకు చెందిన దివ్య(30)కు 2016లో దేసు చంద్రశేఖర్‌తో వివాహమైంది. ప్రస్తుతం వీరు కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌లో ఉంటుండగా.. చంద్రశేఖర్ టూటౌన్‌లో ఎస్సైగా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కొడుకులు. చంద్రశేఖర్ రోజుమాదిరిగా మంగళవారం ఇద్దరు పిల్లలను పాఠశాలలో వదిలి డ్యూటీకి వెళ్లాడు. కాగా దివ్య కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆమె గన్నేరుపూలు, ఆకులు మిక్సీ చేసుకొని తాగింది. విషయాన్ని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పింది. సమాచారం తెలిసిన భర్త దివ్యను హైదరాబాద్‌లోని హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, దివ్య మృతికి చంద్రశేఖర్ కారణమని.. ఆమె అంత్యక్రియల సందర్భంగా ఎస్సైపై సీతంపేట గ్రామస్తులు దాడి చేశారు. ఆ సమయంలో ఆ దాడిని దివ్య తండ్రి అడ్డుకోవడం గమనార్హం. ఈ క్రమంలో భార్య మృతిని తట్టుకోలేని చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో మంటలు

### డ్రైవర్ అప్రమత్తతో ప్రయాణికులు క్షేమం


విజయనగరం,మార్చి21 : జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాదానికి గురైంది. రామభద్రాపురం మండలం తారాపురం వద్ద బస్సులో నుంచి మంటలు చెలరేగాయి. దీంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. భువనేశ్వర్ నుంచి మల్కాన్‌గిరి వెళ్తుండగా వెనుక టైర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. బస్సు వెనుక టైర్ పేలి మంటలు అంటుకోవడంతో అప్రమత్తమైన డ్రైవర్.. వెంటనే ప్రయాణికులను దించేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఘటన సమయంలో బస్సులో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉండగా.. ఎవరికీ ఏ గాయం కాలేదు. అయితే బస్సు మాత్రం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో ఒడిశాకు చెందిన ఒక ఎమ్మెల్యే కూడా ప్రయాణం చేస్తున్నట్లు సమాచారం. కాగా, బస్సు ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ÷ర్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఇక పోలీసులు కూడా ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రయాణికులను ప్రత్యామ్నాయ మార్గాల్లో గమ్యస్థానాలకు పంపించేశారు.

# మరో భారీ సైబర్ మోసం

### మోసపోయిన మాజీ డిజిపి మనవరాలు

### నకిలీ వాట్సాప్ మెసేజ్‌తో టోకరా

### ఖాతా నుంచి 1.20 కోట్లు మాయం




హైదరాబాద్ : టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. పెద్ద పెద్ద కంపెనీల యజమానుల పేర్లతో అకౌంటెంట్లను, ఉద్యోగులను మోసం చేయడం ఇప్పుడు నేరగాళ్లకు పరిపాటిగా మారింది. తాజాగా హైదరాబాద్‌లో ఒక ఉన్నత స్థాయి మహిళా వ్యాపారవేత్త మాజీ డీజీపీ మనుమరాలుని భారీగా మోసగించారు. ఈ ఘటన మరోసారి సైబర్ నేరగాళ్ల చాకచక్యాన్ని బయటపెట్టింది. ఈ ఘటనపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహిళా వ్యాపారవేత్త, మాజీ డీజీపీ మనవరాలికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. దివ్యారెడ్డి 18 కంపెనీలకు డైరెక్టర్‌గా ఉన్నారు. సైబర్ నేరగాళ్లు ఆమెతో పాటు అకౌంటెంట్‌ను మోసం చేశారు. ఈ నెల 13న దివ్యారెడ్డి పేరు, ఫొటోతో ఉన్న వాట్సప్ ఖాతా నుంచి అకౌంటెంట్‌కు మెసేజ్ వచ్చింది. తాను మీటింగ్‌లో ఉన్నానని.. చెప్పిన ఖాతాకు రూ.1.20 కోట్లు పంపాలని అందులో ఉంది. దీంతో అకౌంటెంట్ ఆ డబ్బును పంపారు. ఈ నెల 17న మరోసారి డబ్బు పంపాలంటూ వాట్సప్ మెసేజ్ వచ్చింది. ఈ క్రమంలో డబ్బులు పంపేందుకు చెక్ అప్రూవల్ కోసం డైరెక్టర్‌ను అకౌంటెంట్ సంప్రదించారు. గతంలో చేసిన రూ.1.20 కోట్ల లావాదేవి వివరాలను అకౌంటెంట్ చెప్పారు. తాను ఎవరికీ డబ్బు పంపమని చెప్పలేదని దివ్యారెడ్డి స్పష్టతనిచ్చారు. వెంటనే బాధితులు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ ఘటనలో సైబర్ నేరగాళ్లు అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. ఈ నెల 13న మహిళా వ్యాపారవేత్త పేరు, ఫొటోతో ఒక ఫేక్ వాట్సాప్ అకౌంట్ సృష్టించారు. ఆ అకౌంట్ నుంచి ఆమె సంస్థలో పనిచేసే అకౌంటెంట్‌కు మెసేజ్ పంపించారు. 'మీటింగ్‌లో ఉన్నానని.. వెంటనే ఈ ఖాతాకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయండి' అంటూ తెలిపారు. ఆ సందేశాన్ని నిజమని నమ్మిన అకౌంటెంట్ ఎలాంటి అనుమానం లేకుండా ఒకే ట్రాన్సాక్షన్‌లో రూ.1.20 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ మోసం వెంటనే బయటపడలేదు. ఈ నెల 17వ తేదీన అదేవిధంగా మరోసారి మెసేజ్ వచ్చింది. ఈసారి డబ్బులు పంపేముందు అకౌంటెంట్ చెక్ అప్రూవల్ కోసం మహిళా వ్యాపారవేత్తను సంప్రదించారు. అప్పుడే అసలు విషయం బయటపడింది. 'నేను ఎలాంటి డబ్బు పంపమని చెప్పలేదు' అని ఆమె చెప్పడంతో ముందే జరిగిన ట్రాన్సాక్షన్ గురించి తెలుసుకుని ఆ మహిళా షాక్‌కు గురయ్యారు. మోసం తెలిసిన వెంటనే బాధితురాలు 1930 నంబర్ ద్వారా సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు అధికారికంగా కంప్లైంట్ ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ విచారణలో భాగంగా కేరళకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. ఈ ఘటన నేపథ్యంలో పోలీసులు ప్రజలకు కొన్ని కీలక సూచనలు చేశారు. ఒక చిన్న నిర్లక్ష్యం వల్ల రూ.1.20 కోట్ల భారీ నష్టం జరిగిందని.. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటం అత్యంత అవసరమని సైబర్ క్రైం పోలీసులు సూచించారు. డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయమని మెసేజ్ వస్తే తప్పనిసరిగా కాల్ చేసి నిర్ధారించాలని సూచించారు. వాట్సాప్ మెసేజ్‌లను నమ్మకూడదని, ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలని అన్నారు. పెద్ద మొత్తాల లావాదేవీలకు డబుల్ వెరిఫికేషన్ తప్పనిసరి అని తెలిపారు. అనుమానం వస్తే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

# కుళ్లిపోయిన పదార్థాలతో సమోసాలు

### కుళ్లిన గుడ్లతో ఎగ్‌ఫఫ్స్ తయారీ

### పాతపబస్తీ కుల్సుంపురాలో అధికారుల దాడి

### అక్రమంగా నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్,మార్చి21 : హైదరాబాద్ లోని కుల్సుంపురా ప్రాంతంలో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. కుళ్లిపోయిన పదార్థాలతో సమోసాలు, పఫ్స్ తయారు చేసి నగరంలోని ప్రముఖ హోటళ్లకు సరఫరా చేస్తున్న నిందితుడిని అధికారులు అరెస్ట్ చేశారు. అబ్దుల్ అనే వ్యక్తి అపరిశుభ్ర వాతావరణంలో నాసిరకం పదార్థాలతో ఆహారం తయారు చేస్తున్నట్లు దర్యాప్తులో బయటపడింది. ముఖ్యంగా కుళ్లిపోయిన గుడ్లతో ఎగ్ పఫ్స్ తయారు చేసి హోటళ్లకు పంపిస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయం తెలిసిన వెంటనే అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పెద్ద మొత్తంలో పాడైన, నాసిరకం ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఊఈం÷ు అధికారులు కేసు నమోదు చేసి అబ్దుల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనతో కుల్సుంపురా ప్రాంతంలో తయారవుతున్న ఫుడ్ ఐటమ్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండలని అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోను హైదరాబాద్ పోలీసులు సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారవుతున్న ఆహారం కనపడుతుంది. హైదరాబాద్ ఫుడ్ అడల్టేష్రన్ సర్వేలెన్స్ టీం, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, కులసుంపుర పోలీస్ సమన్వయంతో ఈ దాడి చేపట్టారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా నిర్వహించిన ఈ దాడిలో 73 ఏళ్ల అబ్దుల్ రషీద్ అనే వ్యక్తి ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా సమోసాల తయారీ యూనిట్ నిర్వహిస్తున్నట్లు బయటపడింది. అతనికి ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్, ÷ర్ సేఫ్టీ క్లియరెన్స్ ఏదీ లేకపోవడం గమనార్హం. దర్యాప్తులో భాగంగా కుళ్లిపోయిన గుడ్లు, పలుమార్లు వాడిన వంటనూనె వంటి నాసిరకం పదార్థాలతో ఆహారం తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ యూనిట్‌లో అపరిశుభ్ర పరిస్థితుల్లో సమోసాలు, ఇతర ఫుడ్ ఐటమ్స్ తయారు చేసి నగరంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తేలింది. దాడి సమయంలో సుమారు రూ.5 లక్షల విలువైన నాసిరకం ఆహార పదార్థాలు, ముడి సరుకులు, యంత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో వివిధ రకాల సమోసాలు, మైదా, స్వీట్ కార్న్ వంటి ముడి పదార్థాలు కూడా ఉన్నాయి. నిందితుడు అబ్దుల్ రషీద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేశారు. హైదరాబాద్ సిటీ పోలీసులు ఆహార కల్తీపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని సూచించారు. హోటళ్లకు సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యతపై కఠినంగా పర్యవేక్షణ కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# మరింత దిగిన బంగారం ధరలు

### 24 క్యారెట్ పై 2,940 రూపాయలు తగ్గుదల

న్యూఢిల్లీ,మార్చి21 : అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితుల కారణంగా భారత దేశంలో బంగారం ధరలు రోజురోజుకు భారీగా తగ్గుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. మార్చ్ 20న హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,910 రూపాయలు.. 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,36,550 రూపాయలు ఉండింది. అయితే శనివారం బంగారం ధరలు భారీగా తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ బంగారంపై 2,940 రూపాయలు.. 22 క్యారెట్ బంగారంపై 2,750 రూపాయలు తగ్గింది. ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,970 రూపాయల దగ్గర.. 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,33,800 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. బంగారం మాదిరిగానే వెండి ధరలు కూడా భారీగా పతనం అయ్యాయి. నిన్న కిలో వెండి 2,60,000 రూపాయల దగ్గర.. 100 గ్రాముల వెండి 26,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు కిలోపై 10 వేల రూపాయలు.. 100 గ్రాములపై వెయ్యి రూపాయలు తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి 2,50,000 రూపాయల దగ్గర, 100 గ్రాముల వెండి 25 వేల రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

# మియాపూర్‌లో దారుణ ఘటన

### తను కోరుకున్న యువతి మరొకరితో పెళ్లి

### కోపంతో యువతిపై కత్తితో దాడి

హైదరాబాద్,మార్చి21 : మియాపూర్‌లో దారుణం చోటుచేసుకుంది. తనని కాదని వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుందన్న కోపంతో ఓ యువకుడు మహిళపై కత్తితో దాడి చేశాడు. తండ్రి, స్నేహితుడితో మహిళ ఇంటికి వెళ్లి మరీ ఈ ఘోరానికి ఒడిగట్టాడు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. కాకినాడకు చెందిన 25 ఏళ్ల నూకరత్నం అనే మహిళ కొన్నేళ్ల క్రితం భర్తను కోల్పోయింది. ప్రస్తుతం తన ఇద్దరు కూతుళ్లతో కలిసి మియాపూర్‌లోని రెడ్డి కాలనీలో నివసిస్తోంది. స్థానికంగా హౌస్ కీపింగ్ పని చేస్తూ జీవిస్తోంది. కొంత కాలం క్రితం ఆమెకు ప్రసాద్ అనే వ్యక్తితో పరిచయం అయింది. ఇద్దరూ ఫిబ్రవరి 20వ తేదీన పెళ్లి చేసుకున్నారు. అయితే, వీరి పెళ్లి ఆలీషా అలియాస్ పాండు అనే యువకుడికి నచ్చలేదు. నూకరత్నం హౌస్ కీపింగ్ చేస్తున్న చోట పాండు వంటవాడిగా పని చేస్తున్నాడు. అతడు నూకరత్నంను ఇష్టపడ్డాడు. పెళ్లి కూడా చేసుకోవాలని అనుకున్నాడు. ఇంతలోనే నూకరత్నం.. ప్రసాద్‌ను పెళ్లి చేసుకుంది. దీంతో పాండు తట్టుకోలేకపోయాడు. ఈ నెల 19వ తేదీన తండ్రి లాలూ, స్నేహితుడు జాన్‌లతో కలిసి నూకరత్నం ఇంటికి వెళ్లాడు. ఆమెను తనతో పాటు రమ్మని అడిగాడు. ఇందుకు నూకరత్నం ఒప్పుకోలేదు. మె తన మాట వినకపోవటంతో పాండు ఆగ్రహానికి గురయ్యాడు. వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు.

# ఎమ్మెల్యే దానంకు క్లీన్ చిట్‌పై బిజెపి ఆగ్రహం

### స్పీకర్ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్,మార్చి21 : తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి న్యాయస్థానం చేరింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సంబంధించి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన క్లీన్ చిట్ రాజ్యాంగ విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. గత సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున ఖైరతాబాద్ నుంచి గెలుపొందిన దానం నాగేందర్, ఆ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కండువా కప్పుకోవడమే కాకుండా, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీ ఎన్నికల్లో కూడా పోటీ చేశారు. బీఆర్ఎస్ బీ-ఫామ్ ద్వారా గెలిచి మరో పార్టీలోకి వెళ్లినందున ఆయనపై అనర్హత వేటు వేయాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ జరిపిన స్పీకర్, దానం నాగేందర్ అసలు పార్టీ మారలేదని, ఆయనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని క్లీన్ చిట్ ఇచ్చారు. అయితే, బహిరంగంగానే పార్టీ మారిన వ్యక్తికి స్పీకర్ ఇలాంటి తీర్పు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లో అసెంబ్లీ స్పీకర్‌ను , దానం నాగేందర్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఈ కీలక పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సోమవారం విచారణ జరపనుంది. స్పీకర్ నిర్ణయంపై కోర్టు ఏ రకమైన స్పందన తెలియజేస్తుందోనని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ విచారణలో పిటిషనర్ తరపున, స్పీకర్ తరపున , దానం నాగేందర్ తరపు న్యాయవాదులు తమ వాదనలను వినిపించనున్నారు.

# పేద ముస్లిం కుటుంబానికి లోకేశ్ హామీ

గుంటూరు,మార్చి21 : గతేడాది పవిత్ర రంజాన్ సందర్భంగా పేద ముస్లీం మైనార్టీ సోదరుడికి ఇచ్చిన హామీని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారు. రంజాన్ వేళ మంగళగిరి బస్టాండ్ సమీపంలో ఉండే షేక్ షహెన్నా ఇంటిని మంత్రి ఆకస్మికంగా సందర్శించారు. అతడి కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి లోకేశ్ ఇఫ్తార్ విందు స్వీకరించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇఫ్తార్ విందు సందర్భంగా షహెన్నా నివసిస్తున్న ఇంటిని మంత్రి పరిశీలించి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమ పూర్వీకులు నిర్మించిన రేకుల ఇంటి స్థానంలో నూతన ఇల్లు నిర్మించి తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు మంత్రి లోకేశ్‌ను కోరారు. షహెన్నా కుటుంబ బాధ్యత తాను తీసుకుంటానని, నూతన గృహం నిర్మించి ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దీంతో ఏడాది తిరగకముందే నూతన ఇంటిని నిర్మించి షేక్ షహెన్నా కుటుంబసభ్యులకు అప్పగించారు.

# ఖమ్మం జిల్లాలో రెండు అగ్నిప్రమాదాలు

### భారీగా ఆస్తినష్టం ..సకాంలో స్పందించిన అధికారులు

ఖమ్మం,మార్చి21 : ఖమ్మం జిల్లాలో రెండు వేర్వేరు అగ్నిప్రమాద ఘటనలు జరిగాయి. ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఖమ్మం నగరంలోని రోటరీ నగర్ ప్రాంతంలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మరో ఘటనలో మధిర మండలం ఆత్కూర్ వద్ద శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీలో అగ్నిప్రమాదం జరిగింది. ఖమ్మం నగరంలోని రోటరీనగర్ ప్రాంతంలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. షోరూమ్‌లో ఉన్న పలు ఎలక్ట్రిక్ బైకులు మంటలకు ఆహుతయ్యాయి. బైకుల బ్యాటరీల కారణంగా మంటలు వేగంగా వ్యాపించడంతో దట్టమైన పొగ అలుముకుంది. ఈ ఘటనపై పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు స్థానికులు సమాచారం అందజేశారు. ఫైర్ సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. చార్జింగ్ పెట్టిన సమయంలో లేదా షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని మధిర మండలం, ఆత్కూర్ సమీప ప్రాంతంలో గల శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచిన మిర్చి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు మంటల్లో చిక్కుకున్నాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. స్థానికుల సమాచారంతో ÷ర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. కోల్డ్ స్టోరేజీలో ఉండే ఇన్సులేషన్ మెటీరియల్ కారణంగా మంటలను ఆర్పడం సిబ్బందికి సవాలుగా మారింది. ఖమ్మం జిల్లాలో జరిగిన ఈ రెండు అగ్నిప్రమాదాలు భారీ ఆస్తి నష్టాన్ని మిగిల్చినట్లు తెలుస్తోంది. విద్యుత్ ఉపకరణాల వినియోగంలో అజాగ్రత్త వహించవద్దని అధికారులు సూచించారు. ఈ రెండు ఘటనల్లో ప్రాణనష్టం సంభవించకపోయినా, భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. ఈ రెండు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# గ్యాస్ కొరత నివారణకు కేంద్రం చర్యలు

### 20శాతం అదనపు కమర్షియల్ గ్యాస్ సరఫరా

న్యూఢిల్లీ,మార్చి21 : వాణిజ్య గ్యాస్ కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టిన కేంద్రం.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాణిజ్య ఎల్పీజీలో అదనంగా 20శాతం కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. తాజా చర్యతో సంక్షోభ కాలానికి ముందున్న కేటాయింపుల్లో 50శాతానికి చేరినట్లయ్యిందని పేర్కొంది. అయితే, వీటిలో హోటళ్లు, రెస్టరంట్లు, దాబాలు, పారిశ్రామిక క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కమ్యూనిటీ కిచెన్‌లు, సబ్సిడీల్లో ఆహారం అందించే కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది. చమురు కంపెనీల వద్ద రిజిస్టరైన వాణిజ్య సంస్థలతోపాటు పీఎన్‌జీ (పైపు ద్వారా గ్యాస్ పంపిణీ) కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వాటికే ఈ అదనపు కేటాయింపు వర్తిస్తుందని కేంద్రం పేర్కొంది. మార్చి 23 నుంచి నుంచి ఈ అదనపు కేటాయింపులు సరఫరా చేస్తామని తెలిపింది. దీంతోపాటు వలస కూలీలకు ఐదు కిలోల గ్యాస్ సిలిండర్లు అందజేయాలని సూచించింది. సిలిండర్లు పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని ఆదేశించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పెట్రోలియంశాఖ కార్యదర్శి లేఖ రాశారు.

TARAJYOTHI TELUGU DAILY తారాజ్యోతి

# సోదర భావానికి ప్రతీక రంజాన్ పర్వదినం

## ● మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి







**పెద్దపల్లి ప్రతినిధి:** రంజాన్ పర్వదినం సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని ఈద్గ వద్ద ముస్లిం సోదరులకు ఆలింగనం (అలాయ్ బలై) చేసుకుంటూ మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, రంజాన్ పర్వదినం సోదరభావం, సహనం, దాతృత్వం, శాంతి సందేశాన్ని ప్రపంచానికి తెలియజేస్తుందని అన్నారు. ఉపవాస దీక్ష ద్వారా మనసును శుద్ధి చేసుకోవడం, పేదలకు సహాయం చేయడం ఈ పర్వదినం యొక్క ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ పవిత్ర సందర్భంలో పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజకుమార్, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, మాజీ కౌన్సిలర్ మోబిన్, పెంచల శ్రీధర్, నాంసాన్ని సరేష్ బాబు, పూదరి చంద్రశేఖర్, ఫహీం,జావేద్, బిఆర్ఎస్ నాయకులు ముఖిమ్, లవన్, కాశీపక వాసు, ఖాదర్, నుగిళ్ళ వీరేశం,పల్లె మధు, కుక్క మనోజ్, ప్రేమ సాగర్, కిషోర్, గాజుల అరుణ్, మైనార్టీ సోదరులు బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సరస్వతి కాలనీ ఇంటి యజమానుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం





**కరీంనగర్ టౌన్, మార్చ్ 21:** నగరంలోని మంకమ్మతోట, సరస్వతి కాలనీలోని ఎం.ఆర్. వైశ్య భవన్‌లో సరస్వతి కాలనీ ఇంటి యజమానుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కరీంనగర్ నగరపాలక సంస్థ ప్రజాప్రతినిధులకు అభినందన సభ ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరయ్యారు. వారితో పాటు వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పెద్దపల్లి శ్రీలేఖ–జితేందర్ (62వ డివిజన్), దేశ శిల్ప–వేదం (63వ డివిజన్), గాజ రమ–శివరామ్ (47వ డివిజన్), గుగ్గిళ్ళ జయశ్రీ–శ్రీనివాస్ (45వ డివిజన్), మల్లిఖార్జున రాజేందర్ (46వ డివిజన్), పరాల నర్సింగం (21వ డివిజన్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లను శాలువాలతో కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ నగరాభివృద్ధిలో కాలనీ వాసుల భాగస్వామ్యం కీలకమని, సరస్వతి కాలనీలోని సమస్యల పరిష్కారానికి మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సరస్వతి కాలనీవాసులు, సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# తొర్రూరులో ఘనంగా రంజాన్ వేడుకలు







**తొర్రూరు,:** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలోని స్థానిక వెంకటాపురం రోడ్డు ఈద్గాలో రంజాన్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ , వైస్ చైర్మన్ సోమ రజిని శేఖర్ 16 వార్డు కౌన్సిలర్ జాటోతు బద్రు నాయక్ పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలపడం జరిగింది. వారు మాట్లాడుతూ సంయుక్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలుపుతూ గత ప్రభుత్వాలు ముస్లింల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లింల అభివృద్ధి కొరకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు. అదేవిధంగా మసీద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ అలీమ్ మాట్లాడుతూ రంజాన్ పండుగను పురస్కరించుకొని వెంకటాపురం రోడ్డుకు వెళ్లే మార్గంలో ఉన్నటువంటి ఈద్గాలో 9–30 సమయంలో ఏర్పాటు చేసిన ఈద్–ఉల్–ఫితర్ పవిత్ర నమాజ్ కు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు 8 గంటల ప్రాంతంలో ఈద్గాకు చేరుకొని కమిటీ ఏర్పాటు చేసిన సమయానికి నమాజును చేయడం జరిగిందని తెలుపుతూ ఈ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులందరూ ఒక నెల ఉపవాసాలను పాటిస్తూ భక్తిశ్రద్ధలతో ప్రతిరోజు ఐదు పూటలు మసీదులో నమాజులను చదవడం జరిగిందని తదనంతరం ఈద్–ఉల్–ఫిదర్ పండుగ నమాజును ఎంతో నిష్టతో ప్రార్ధనను చేసుకోవడం జరిగిందని, నమాజ్ తర్వాత ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలపడం జరిగిందని ప్రశాంత వాతావరణంలో ప్రార్థనలు చేసుకోవడానికి సహకరించిన మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ కౌన్సిలర్లకు, మున్సిపల్ శాఖ కమిషనర్ శ్యాంసుందర్,స్థానిక పోలీస్ సిబ్బందికి,మున్సిపల్ సిబ్బందికి పేరుపేరునా కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జమా మజీద్ ఉపాధ్యక్షులు మహమ్మద్ మౌలానా పాషా, మహమ్మద్ షబ్బీర్ అలీ, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అమీర్, సహాయ కార్యదర్శులు మమ్మద్ యాకుబ్ పాషా, సయ్యద్ చాంద్ పాషా, కోశాధికారి మహమ్మద్ గౌస్ మైనోద్దీన్ కమిటీ సభ్యులు మహమ్మద్ అమినుల్ ఇస్లాం, మహమ్మద్ సలాం పాషా, మహమ్మద్ ఇజాస్, మహమ్మద్ అబ్దుల్ గని, మాజీ కోఆప్షన్ మెంబర్ మహమ్మద్ అబ్దుల్ జలీల్, ముస్లిం మత పెద్దలు మహమ్మద్ జలీల్, మహమ్మద్ నదీమ్ పాషా, మహమ్మద్ యూసుఫ్ అలీ, మహమ్మద్ అబ్దుల్ రషీద్ వీరితోపాటు వివిధ గ్రామాలకు చెందిన ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 23న కలెక్టరేట్ ముందు గొర్లకాపరుల గొంగడి ధర్నా.....




**పెద్దపల్లి, ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లాలోని గొర్రె కాపరుల హక్కులు, ఆత్మగౌరవం, మార్కెట్ స్థలాల రక్షణ కోసం ఈ నెల 23న పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ముందు గొంగడి ధర్నా నిర్వహించనున్నట్లు గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం నాయకులు ప్రకటించారు. పెద్దపల్లిలోని సంఘ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, జిల్లా అధ్యక్షులు సలేంద్ర రాములు యాదవ్, ప్రధాన కార్యదర్శి మేకల నర్సయ్య యాదవ్ మాట్లాడుతూ తమ జీవనోపాధిని, మార్కెట్ స్థలాలను కాపాడుకోవడానికి ఇది ఒక చారిత్రాత్మక పోరాటమని అన్నారు. హక్కుల కోసం నిశ్శబ్దంగా ఉంటే భవిష్యత్తు అంధకారమవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గొంగడి ధర్నాకు జిల్లాలోని ప్రతి గ్రామం నుండి యాదవులు, కురుమలు, గొర్రె కాపరులు తమ సాంప్రదాయ గొంగడి ధరించి తరలి వచ్చి తమ ఐక్యతను, శక్తిని ప్రభుత్వానికి చాటిచెప్పాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గొంగడి ధర్నా ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నర్ల అంజయ్య యాదవ్, దాడి చంద్రమౌళి యాదవ్, బత్తిని లక్ష్మణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# కొంపల్లిలో ఘనంగా రంజాన్ వేడుకలు





**నల్గొండ :** తిరుమలగిరి సాగర్ మండల పరిధిలోని కొంపల్లి గ్రామంలో ముస్లిం సోదరులు రంజాన్ (ఈదుల్ ఫితర్) పండుగను శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించుకున్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు పూర్తి చేసుకున్న ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ అమీర్ సబ్ షేక్ షఫీ మాట్లాడుతూ, రంజాన్ పండుగ క్రమశిక్షణ, సహనం, దాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ముస్లిం సోదరులకు పండుగ ప్రాముఖ్యతను వివరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ వాస్తవ్యులు షేక్ సయ్యద్ పాషా ఆధ్వర్యంలో గ్రామ ప్రజలందరికీ సేమియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ నాగూర్ అలీ (సివిల్ కానిస్టేబుల్), షేక్ అజ్రత్ అలీ (=వ్రూ), షేక్ అఫ్జల్, షేక్ అలిపాష, షేక్ అబ్దుల్ కరీం, షేక్ మీరవలి, షేక్ అన్వర్, మహమ్మద్ మాజ్ తదితరులు, ముస్లిం పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీలకు న్యాయం చేయని బడ్జెట్

**- రూ.3 లక్షల కోట్ల బడ్జెట్లో బీసీలకు న్యాయం ఎక్కడ..? - బీసీల అభివృద్ధి లేకుండా రాష్ట్ర అభివృద్ధి ఎలా సాధ్యం - జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్**



**పెద్దపల్లి ప్రతినిధి :** రాష్ట్ర జనాభాలో మెజారిటీ అయిన బీసీలకు బడ్జెట్లో తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని, ఈ బడ్జెట్ బీసీలను తీవ్రంగా నిరాశ పరిచందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ అన్నారు. ప్రభుత్వ కుల సర్వే ప్రకారం తెలంగాణలో బీసీలు సుమారు 56% జనాభా ఉన్నప్పటికీ, బడ్జెట్లో వారి అభివృద్ధికి కేటాయించిన నిధులు రూ. 12,511 కోట్లు మాత్రమేనని మండిపడ్డారు. రూ. 3.24 లక్షల కోట్ల బడ్జెట్లో బీసీలకు కేవలం 3% మాత్రమే నిధులు కేటాయించారన్నారు. బడ్జెట్లో బీసీ సబ్ ప్లాన్ లేకపోవడం, కుల గణన ఆధారంగా ప్రత్యేక కేటాయింపులు లేకపోవడం బీసీలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతున్నాయని అన్నారు. రాష్ట్ర జనాభాలో మెజారిటీ ఉన్న బీసీలకు తగిన వాటా ఇవ్వకపో వడం సామాజిక న్యాయానికి విరుద్ధమని ఆయన విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రతిసంవత్సరం బీసీల అభివృద్ధికి రూ. 20,000 కో ట్లు ఖర్చు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, గత రెండు సంవత్సరాల్లో కలిపి రూ. 5,000 కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు. రాష్ట్రంలో బీసీ సమాజ సమగ్ర అభివృద్ధి కోసం రూ. 30 వేల కోట్లు బడ్జెట్ లో కేటాయించి బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలి అని డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్లను బలోపేతం చేసి యువతకు సబ్సిడీ రుణాలు, వ్యాపార ప్రోత్సా హకాలు, నైపుణ్యాభివృద్ధి పథకాలు అమలు చేయాలని ఆయన సూచించారు. బీసీలు మేల్కొని ఐక్యంగా పోరాడకపోతే ఈ అన్యాయం ఎప్పటికీ ఆగదని ఓ పత్రిక ప్రకటనలో హెచ్చరించారు.

# పెద్దపల్లి కార్మిక శాఖ అధికారినిపై మంత్రికి ఫిర్యాదు



**పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి కార్మిక అధికారిని హేమలత భవన నిర్మాణ కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ శనివారం చెన్నూర్ నియోజవర్గంక్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక వెంకటస్వామికి దళిత బహుజన లేబర్‌అసోసియేషన్ అధ్యక్షుడు బొంకూరి కైలాసం వినతిపత్రం అందజేశారు. అనంతరం కైలాసం మాట్లాడుతూ పెద్దపల్లి కార్మిక అధికారి హేమలత ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన ఆర్థిక సహాయాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన బెనిఫిట్ బిల్లులను వరుసగా తిరస్కరిస్తూ అనవసరపు కొర్రీలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఈ అంశంపై గతంలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేయగా వారు మందలించినా సదరు అధికారిణి తీరులో మార్పురాలేదని పేర్కొన్నారు.? కార్మికుల హక్కులను కాలరాస్తున్న కార్మిక అధికారిని తక్షణమే బదిలీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ప్రయోజనాలను కార్మికులకు అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట దార మధు ఉన్నారు.

## బీర్ తాగితే ఒంటికి చలువ చేస్తుందా..? కిడ్నీలో రాళ్లు కరుగుతాయా?

ఎండాకాలం వస్తే మద్యం ప్రియులు బీర్లు తెగ సేవిస్తారు. అదెంటి అంటే.. బీర్ తాగితే ఒంటికి చలవు చేస్తుందని చెబుతారు. కానీ ఇది ఎంతమాత్రం కరెక్ట్ కాదంటున్నారు డాక్టర్లు. అందుకు ఎలాంటి శాస్త్రీయమైన ఆధారాలు లేవంటున్నారు. అంతేకాదు బీర్ తాగితే గుండెకు మంచిదనే ప్రచారాన్ని కూడా కొట్టి పారేస్తున్నారు. ఇక కొందరు బీర్ తాగడం వల్ల కిడ్నీల్లో రాళ్లు తగ్గుతాయని చాలామంది నమ్ముతారు. ఇది నిజం కాదని నెఫ్రోలాజిస్ట్‌లు నొక్కి చెబుతున్నారు. ఈ క్రమంలో బీర్ అధికంగా సేవిస్తే బరువు పెరుగుతారు. ఇక బీర్‌ను తలకు పట్టిస్తే.. షాంపులా వాడితే జుట్టు పెరుగుతుందన్నది మరికొందరి వాదన. జుట్టు కుదుళ్ల నుంచే బలంగా ఉండాలి. జుట్టుకు ఏదైనా రాసుకుంటే పెరుగుతుందనే దాన్ని సైన్స్ విశ్వసించదు అంటున్నారు డాక్టర్లు. ఆల్కాహాల్ కొద్ది మొత్తంలో తీసుకుంటే మంచిదని గతంలో పరిశోధనల్లో తేలింది. అయితే బీర్ కాకుండా ఇతర రకాల ఆల్కాహాల్ తీసుకునే వారికి లివర్ 5 ఏళ్లలో దెబ్బతింటే, బీర్ తాగే వారికి 10 సంవత్సరాల్లో దెబ్బతింటుందని కొందరు డాక్టర్స్ చెబుతున్నారు.

TARAJYOTHI TELUGU DAILY తారాజ్యోతి

# పవిత్ర రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు...

● ముస్లిం సోదరులు అల్లా దీవెనలు నిండుగా అందుకోవాలి ● స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు





**పెద్దపల్లి ప్రతినిధి :** రంజాన్ ఉపవాస దీక్షలు ప్రేమ, దయ, సోదర భావం ఐక్యతను పెంపొదిస్తాయని స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే ముస్లిం సోదర సోదరిమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లి వద్ద గల ఈద్గా సమీపంలో ముస్లిం సోదరులకు రంజాన్ పండుగను పురస్కరించుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన అనంతరం నెలరోజుల కఠిన ఉపవాస దీక్షల అనంతరం జరుపుకునే రంజాన్ పండుగను ముస్లిం సోదరులు తమ కుటుంబ సభ్యులు బంధుమిత్రులతో సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ముస్లిం సోదరులు అల్లా దీవెనలు నిండుగా అందుకోవాలని ఎమ్మెల్యే విజయ రమణ రావు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణ రావు మాట్లాడుతూ మతసామరస్యానికి తెలంగాణ రాష్ట్రం నిలువెత్తు నిదర్శనం అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా నెలరోజుల కఠిన ఉపవాస దీక్షతో క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, దాతృత్వం, ప్రేమ, దయ, సోదర భావం ఐక్యతను పెంపొదిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, మైనారిటీ సోదరులు, మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం.. ఉచిత సబ్సిడీల మీద నే బ్రతకడమా?

● బీసీలను సాధికారులుగా, స్వావలంబనగా ఎప్పుడు పొందే వారిగా చేస్తారు...! ● బడ్జెట్ పై బీసీ నాయకుల విమర్శలు..

**జగిత్యాల, ప్రతినిధి :** శాసనసభలో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన ?3,24,234 కోట్ల బడ్జెట్ బీసీలను పూర్తిగా నిరాశపరిచింది. తెలంగాణలో బీసీలు 64%జనాభా - అయినా ఈ బడ్జెట్‌లో వారి అభివృద్ధికి కేటాయింపులు చాలా తక్కువ! బీసీ శాఖకు కేటాయింపు: ?12,511 కోట్లు మాత్రమే?? మొత్తం బడ్జెట్‌లో కేవలం 3.85% మాత్రమే!?(గత ఏడాది ?11,405 కోట్లు --- ఇప్పుడు కొంచెం పెరిగినా, జనాభా ప్రాతిపదికంగా ఇది ఏమాత్రం సరిపోదు. పోనీ ఆ కేటాయింపులనైనా పూర్తిగా ఖర్చు చేస్తారా? అది కూడా లేదు! గత రెండేళ్ల ఖర్చు చూస్తే: 2024-25: కేటాయింపు ?9,200 కోట్లు ? ఖర్చు ?2,080 కోట్లు మాత్రమే 2025-26: కేటాయింపు ?11,400 కోట్లు ? ఖర్చు సుమారు ?3,000 కోట్లు మాత్రమే ఈ ఏడాది కూడా అదే కథ పునరావృతమవుతుందేమో! బీసీ సబ్-ప్లాన్ లేదు, జనాభా ప్రాతిపదికంగా వాటా లేదు, కుల గణన ఆధారంగా ప్రత్యేక కేటాయింపులు లేవు. ఇది సామాజిక న్యాయమా? బీసీలను పట్టించుకోకుండా బడ్జెట్ తయారు చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ --- హామీనా? లేక ఎన్నికల మోసమా? ప్రతి ఏడాది ?20,000 కోట్లు బీసీల కోసం ఖర్చు చేస్తామని చెప్పారు. కానీ రెండేళ్లలో ?5,000 కోట్లు కూడా ఖర్చు చేయలేదు! ఇది అమలు లోపమా? లేక బీసీలంటే లెక్క లేని తనమా? సంక్షేమం అంటున్నారు --- ఫ్రీ బస్సులు, గ్యాస్, కరెంట్, పెన్షన్లు నిజమే. కానీ ఒక ప్రశ్న: ఎంతకాలం సబ్సిడీల మీదే బతకాలి? ఎప్పుడు బీసీలను సాధికారులుగా, స్వావలంబన పొందేవారిగా చేస్తారు? అగ్రవర్గాలు, కార్పొరేట్‌ల కోసమే! బీసీలకు ఇండస్ట్రీలో వాటా లేదు, వ్యాపారంలో స్థానం లేదు, భూమి లేదు, ఆస్తి లేదు. ప్రభుత్వ ఉచితాల మీద ఆధారపడి బ్రతకడం తప్ప మరేమీ లేదు. కుల వృత్తులు సంచార జాతుల వారు కన్పించర ? కౌలు రైతులు, చిన్న రైతులు ఎక్కువగా బీసీలే. కానీ పాలసీలో "అందరూ రైతులే ఒకటే" అని చెప్పి, భూమి ఎక్కువ ఉన్న అగ్ర కులాల వారికి ఎక్కువ సబ్సిడీలు ఇస్తున్నారు. సంపదను వారికి దోచి పెడుతున్నారు కానీ ఎలాంటి భూమి లేని 50 లక్షల నిరుపేద బీసీ కుటుంబాలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు విద్య, ఉద్యోగాలు --- మాటల్లోనే బీసీ విద్యార్థులకు స్పెషల్ సపోర్ట్ లేదు. స్కాలర్‌షిప్ బకాయిలు (సుమారు ?15,000 కోట్లు అని చెబుతున్నారు) చెల్లించలేదు. వేరే రాష్ట్రాల్లో చదివితే ట్యూషన్ ఫీ చెల్లింపు లేదు. ఉద్యోగ రిక్రూట్‌మెంట్‌లో 42% రిజర్వేషన్ అమలు లేదు. స్వయం ఉపాధికి కార్పొరేషన్లకు తగిన కేటాయింపులు లేవు విద్య లేకుండా, ఉద్యోగం లేకుండా, ఆర్థిక సహాయం లేకుండా బీసీలు ఎలా ఎదుగుతారు? నిజమేమిటంటే: మాటల్లో అంబేద్కర్... చేతల్లో బీసీలు కనిపించరు! 78 ఏళ్లుగా కేంద్రం, రాష్ట్రాలు బీసీలకు మోసం చేస్తున్నాయి. గుర్తుంచుకోండి: బీసీలు మేల్కొని, ఐక్యంగా పోరాడకపోతే ఈ మోసాలు ఎప్పటికీ ఆగవు! ఈ బడ్జెట్ బీసీ మెజారిటీ ప్రజల అభివృద్ధిని పట్టించుకోలేదు --- ఇది కొందరికి మాత్రమే అవకాశాలు ఇచ్చే బడ్జెట్! అని ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, తెలంగాణ వంజరి సంఘం జాయింట్ సెక్రెటరీ ఆరె శంకర్, బీసీ సంఘం నాయకులు సాల్వేర్ రాజేశం, పాపంక శ్రీనివాస్, పిండేరు శ్రావణ్, మరియు దాత్రిక శ్రీనివాస్, తాడూరి శ్రీనివాసచారి ఉపేంద్ర అశోక్, తిరుపతి ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు...

# పాత్రికేయుల సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వం ....

● తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం ● తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ నేషనల్ కౌన్సిల్ సభ్యులు అంకరి ప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తగరపు శంకర్





**పెద్దపల్లి ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమ నిధికి ప్రత్యేక కేటాయింపులు చేయకుండా ప్రభుత్వం అన్యాయం చేసిందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ నేషనల్ కౌన్సిల్ సభ్యులు అంకరి ప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తగరపు శంకర్ లు విమర్శించారు. జర్నలిస్టుల సంక్షేమ విషయంలో రేవంత్ రెడ్డి సర్కార్ మానవతా దృక్పథంతో వెన్నుదన్నుగా నిలుస్తోందని ఆశపడితే నిరాశే ఎదురైందని అన్నారు. జర్నలిస్టుల పట్ల, జర్నలిస్టుల సంక్షేమం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేనట్లు కనిపిస్తుంది అన్నారు. పాత్రికేయులకు సంబంధించి సంక్షేమ నిధిపై బడ్జెట్ లో పొందుపరచకపోవడం సరైనది కాదన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నామని చెబుతూ వచ్చిన తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టులను విస్మరించడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల మ్యానిఫెస్టోలో అదనంగా జర్నలిస్టుల కోసం 100 కోట్లు సంక్షేమ నిధిని కేటాయిస్థాని చెప్పి ప్రస్తుతం బడ్జెట్లో ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం మోసపూరితమన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న పాత్రికేయుల రంగం పట్ల వివక్షతను పెంచుకోవడం మానుకోవాలన్నారు. అదేవిధంగా చాలాకాలంగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంపై కూడా ప్రభుత్వం ఎలాంటి ప్రస్తావన చేయకపోవడంపై విచారకరమన్నారు. బడ్జెట్లో జర్నలిస్టులకు ఎలాంటి సంక్షేమ నిధి కోసం కేటాయింపులు చేయకుండా కల్లబొల్లి ప్రకటనలు చేస్తూ పాత్రికేయులను తెలంగాణ ప్రభుత్వం మోసం చేస్తుందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని జర్నలిస్టుల సంఘాల నాయకులు పలుమార్లు కోరినా హెల్త్ కార్డు సంబంధించిన అంశమే బడ్జెట్ ప్రసంగంలో లేక పోవడం విడ్డూరంగా ఉందని వారు పేర్కొన్నారు.. దీనిని బట్టి చూస్తే జర్నలిస్టులకు ఆరోగ్య భద్రతను అందించే జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ను ప్రభుత్వం శాశ్వతంగా రద్దు చేసే ఆలోచనలో ఉన్నట్లు అనుమానం కలుగుతుందన్నారు. ఇది తెలంగాణ జర్నలిస్టులకు పూర్తిగా అన్యాయం చేసిన బడ్జెట్ గా భావిస్తున్నట్లు టి యు డబ్ల్యూ జే నాయకులు అంకరి ప్రకాష్, తగరపు శంకర్ లు అభిప్రాయపడ్డారు. పాత్రికేయుల సంక్షేమ పట్ల ప్రభుత్వ వైఖరి వ్యతిరేకంగా ఉందని స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి మౌనంగా వ్యవహరించడం వెనక ఆంతర్యం ఏంటి అని ప్రశ్నించారు. జర్నలిస్టుల హక్కులను కాపాడుకోవడం కోసం అల్లం నారాయణ నాయకత్వంలో తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ చూస్తూ ఊరుకోదని, రాష్ట్రవ్యాప్తంగా పోరుబాట చేస్తామని వారు హెచ్చరించారు.

# ఈసారైనా రైతు భరోసా నవ్విస్తుందా?

● మూడు నెలలుగా ఎదురుచూపులు ● టింగ్ టింగ్ కోసం ఉత్కంఠ. ● కోతల వరకైనా పూర్తవుతుందా? ● నవ్విస్తుందా నవ్వుల పాలు చేస్తుందా? ● రైతు భరోసా పై అందిస్తున్న ప్రత్యేక కథనం...

**బ్యూరో,(తారజ్యోతి):** రైతుల కళ్ళల్లో ఆనందం చూడడమే మా రైతు ప్రభుత్వ లక్ష్యం అంటూ.. ఇది రైతు సంక్షేమ రాజ్యం అంటూ బెల్లం లేకుండానే పానకం పట్టిన పెద్దలు ముందుగా ఇన్నాళ్లు రైతు భరోసా ఎందుకు ఆగిందో సమాధానం చెప్పాలంటున్నారు రైతులు. పంట మొదలయ్యే సమయానికి రావలసిన పెట్టుబడి సాయం.. కోతలు కోసే సమయం దగ్గర పడుతున్నా ఎందుకు రాలేదో చెప్పే నాధుడు ఎవరు? అయినా అన్నదాతలు ఆనందంగా ఉన్నారట. అది నిజమే కావచ్చు. ఈ వ్యవస్థ మీద ఉన్న నిస్సహాయత వల్ల వచ్చిన నవ్వు అయి ఉండొచ్చు. ఇప్పుడు అన్నదాతలు ముక్తకంఠంతో అడుగుతున్న ప్రశ్న ఒక్కటే... రైతు భరోసా మమ్మల్ని నవ్విస్తుందా అని. మార్చి 22 కోసం కళ్ళల్లో వత్తులు వేసుకుని రైతులు ఎదురుచూస్తున్నారు. రైతు చేతిలో మొబైల్... కళ్ళల్లో ఆశ... గుండెల్లో అనుమానం.. ఈరోజు పడుతుందట కదా అనే మాటతో ఎదురుచూపు. టింగ్ టింగ్ కోసం అంతా ఉత్కంఠ. కానీ అసలు ప్రశ్న ఏంటంటే డబ్బు పడిన వాళ్ళకి పండగ మిగతా వాళ్లకు ఇది నిరీక్షణ దినం కాదా? ఎందుకంటే ఇప్పుడు ఇచ్చేది కేవలం 3500 కోట్లు మాత్రమే... అంటే మూడో వంతు రైతులకు మాత్రమే ఆనందం. మరి మిగతా వాళ్ల సంగతి ఏమిటి? ఇంతకుముందు లాగే ఇంతటితోనే శుభం పలుకుతారా అనే అనుమానాలు కూడా బాగానే వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా వాయిదాల మీద వాయిదాలు పడుతూ.. సంక్రాంతి పండుగను దాటుకుని, మున్సిపల్ ఎన్నికలను ముగించుకుని ముచ్చటగా మార్చి 22 కు చేరిన రైతు భరోసా ఈసారైనా అన్నదాతలకు భరోసాను ఇవ్వాలని ఆశిద్దాం.




## సోదరభావంతో మెలగడమే రంజాన్ సందేశం

- బీసీ జేసీసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష



**పెద్దపల్లి ప్రతినిధి :** సోదరభావంతో మెలగడమే రంజాన్ సందేశమని బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా ఛైర్ పర్సన్ దాసరిఉష అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం చందపల్లి ఈద్గాను సందర్శించి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు ముగించుకున్న ముస్లిం సోదరులను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పండుగ క్రమశిక్షణకు, దాతృత్వానికి, మత సామరస్యానికి గొప్ప నిదర్శనమని పేర్కొన్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టి, లోక కల్యాణం కోసం ప్రార్థనలు చేయడం అభినందనీయమన్నారు. ఆమె వెంట నాయకులు అలువాల రాజేందర్, ఎండి.మాలిక్, మురుమూరి శేఖర్, గాజుల రమేష్, మేరుగు సాగర్, ఎనగందుల నిరంజన్, ఆముదాల అరుణ, మచ్చ రాహుల్, కల్వల చరణ్, అజీమ్, ఖలీల్, అబ్బు, రజనీకాంత్, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

## ఎస్సై చంద్రశేఖర్ అంత్యక్రియలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ప్రణవ్ బాబు





**ఇల్లందకుంట మార్చి 21 :** ఇల్లందకుంట మండలం సీతంపేట గ్రామంలో ఉదయం బలవన్మరణానికి పాల్పడిన కరీంనగర్ పట్టణంలో 2వ టౌన్ లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై చంద్రశేఖర్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అంతిమ యాత్రలో పాల్గొన్నారు. కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు,చొప్పదండి శాసన సభ్యులు మేడిపల్లి సత్యం, హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.ఒకే కుటుంబం నుండి తక్కువ వ్యవధిలో ఇద్దరు చనిపోవడం చాలా బాధాకరమని,వారి కుటుంబం ధైర్యంగా ఉండాలని,ఈ సందర్భంగా వారికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కౌన్సిలర్ కు ఘన సన్మానం సన్మానం..






**జమ్మికుంట మార్చి 21 :** మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంట లో గల జామే మస్జిద్ ఈద్గానందు రంజాన్ పర్వదినం సందర్భంగా స్థానిక కౌన్సిలర్ ఎగిత సుజాత అశోక్ ల ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముస్లిం కుల పెద్దలు మాట్లాడుతూ ఈద్గా యొక్క గద్దె కూలిపోయే దశలో ఉండగా దానిపై తక్షణమే స్పందించి మా యొక్క కౌన్సిలర్ తన సొంత ఖర్చులతో నూతన గద్దెను నిర్మించిన తనను మేము ఎప్పటికీ మర్చిపోమని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజులో ఎగిత సుజాత అశోక్ దంపతులు మరిన్ని అత్యున్నత పదవులు అవరోధించారని ముస్లిం కులస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పరస్పరం అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మత గురువు మతిన్, యూసఫ్, మహబూబా అలీ, అన్వర్, అంజత్, అఫ్జల్, గౌస్ ఖాన్, యాకూబ్ లతో పాటు ఆబాది జమ్మికుంటకు చెందిన ముస్లిం సోదరులు అందరూ పాల్గొన్నారు.

TARAJYOTHI TELUGU DAILY తారాజ్యోతి

# తక్కువ క్రెడిట్ స్కోర్‌తో బోలెడు సమస్యలు..

## ఈ టిప్స్ పాటిస్తే సమస్యలు ఫసక్..!

భారతదేశంలో ఇటీవల కాలంలో పెరిగిన టెక్నాలజీ కారణంగా బ్యాంకింగ్ రంగంలో కీలక మార్పులు వచ్చాయి. ముఖ్యంగా లోన్ ఇవ్వడానికి బ్యాంకులు కస్టమర్ చెల్లింపు పరిస్థితిని తెలుసుకోవడానికి వివిధ మార్గాలను ఎంచుకుంటున్నాయి. పెరిగిన ఖర్చులు, అవసరాల నేపథ్యంలో లోన్ తీసుకోవడం అనేది ప్రస్తుత రోజుల్లో సర్వసాధారణమైంది. అయితే లోన్ తీసుకోవడానికి బ్యాంకుకు వెళ్లినప్పుడు లోన్ ఇవ్వడానికి బ్యాంకులు నిరాకరిస్తూ ఉంటాయి. ముఖ్యంగా బ్యాంకులు లోన్ ఇవ్వడానికి కస్టమర్ క్రెడిట్ స్కోర్‌ను పరిగణలోకి తీసుకుంటున్నాయి. అయితే క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉంటే చాలా సింపుల్‌గా రుణాన్ని రిజెక్ట్ చేస్తూ ఉంటాయి. కస్టమర్లు చేసే కొన్ని తప్పుల కారణంగా తక్కువ సిబిల్ స్కోర్ ఉంటుందని చాలా మందికి తెలియదు. ఈ నేపథ్యంలో లోన్ రిజెక్ట్ కాకుండా ఉండడానికి మెరుగైన క్రెడిట్ స్కోర్ ఎలా మెయింటెన్ చేయాలో? ఓసారి తెలుసుకుందాం. బిల్లుల చెల్లింపు మంచి క్రెడిట్ స్కోర్ మెయింటేన్ చేయాలంటే మీ




క్రెడిట్ కార్డ్ బిల్లులు, లోన్ ఈఎంఐలు, ఇతర బకాయిలను సకాలంలో చెల్లించాలని నిపుణులు చెబుతున్నారు. చెల్లింపులు ఆలస్యంగా చేయడం వల్ల క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని వివరిస్తున్నారు. క్రెడిట్ కార్డుల వినియోగం కస్టమర్లు వారి వద్ద ఉన్న క్రెడిట్ కార్డుల్లో వినియోగ పరిమితిని 30 శాతం కంటే తక్కువ ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. అధిక క్రెడిట్ వినియోగం ఆర్థిక ఇబ్బందులను సూచిస్తుందని తద్వారా క్రెడిట్ స్కోర్‌ను తగ్గిస్తుందని పేర్కొంటున్నారు. రుణాల మిశ్రమం సాధారణంగా మన అవసరానికి సంబంధించి తీసుకున్న రుణాలు మన క్రెడిట్ స్కోర్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. సెక్యూర్డ్ రుణాలు అంటే గృహ రుణాలు వంటివి, అలాగే అసురక్షిత క్రెడిట్ అంటే క్రెడిట్ కార్డ్‌ల వంటివి ఉపయోగించే సమయంలో జాగ్రత్త వహించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా క్రెడిట్ కార్డుల తీసుకునే సమయంలో మనకు అవసరమైన క్రెడిట్‌ను మాత్రమే తీసుకోవాలని పేర్కొంటున్నారు. లోన్ అప్లికేషన్ల వినియోగం మీరు లోన్ లేదా క్రెడిట్ కార్డ్ కోసం దరఖాస్తు చేసిన ప్రతిసారీ రుణదాత మీ క్రెడిట్ స్కోర్‌ను తనిఖీ చేస్తాడు. ఫలితంగా మీ రుణ అవసరాన్ని బేరీజు వేసుకుని మీ క్రెడిట్ స్కోర్ తగ్గే ప్రమాదం ఉంది. అందువల్ల లోన్ తీసుకోవాలని అనుకున్నప్పుడు 15 రోజుల వ్యవధిలోనే మీకు అవసరమైన బ్యాంకులకు వెళ్లి రుణ వడ్డీ రేట్లను కనుగొనడం ఉత్తమం. ఇలా చేయడం ద్వారా క్రెడిట్ స్కోర్ తగ్గదని నిపుణులు పేర్కొంటున్నారు. క్రెడిట్ నివేదిక లోపాలు లేదా అనధికారిక లావాదేవీలు లేవని నిర్ధారించుకోవడానికి మీ క్రెడిట్ నివేదికను కాలానుగుణంగా సమీక్షించడం ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మీరు ఏవైనా వ్యత్యాసాలను కనుగొంటే వాటిని సరిదిద్దడానికి వెంటనే సంబంధిత ఏజెన్సీకు నివేదించాలని సూచిస్తున్నారు.

# ప్రయాణికులకు శుభవార్త! ఈ అన్ని రైల్వే స్టేషన్లలో టికెట్ల కోసం డిజిటల్ చెల్లింపు సదుపాయం

రైల్వే ప్రయాణికులకు శుభవార్త. ఇప్పుడు రైల్వే స్టేషన్లలో రైలు టిక్కెట్లు కొనుగోలు చేసేటప్పుడు ప్రయాణీకులు  కోడ్ ద్వారా డిజిటల్‌గా ఛార్జీలను చెల్లించవచ్చు. పశ్చిమ రైల్వేలు గుజరాత్‌లోని రాజ్‌కోట్, భావ్‌నగర్ డివిజన్‌లలోని అన్ని స్టేషన్లలో  కోడ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇక త్వరలో అన్ని స్టేషన్‌లలో ఈ విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ కొత్త కార్యక్రమం కింద రాజ్‌కోట్ డివిజన్‌లోని రాజ్‌కోట్, జామ్‌నగర్, సురేంద్రనగర్, ద్వారక సహా అన్ని చిన్న, పెద్ద స్టేషన్‌లలోని అన్ని రిజర్వ్‌డ్, అన్‌రిజర్వ్‌డ్ టికెట్ కౌంటర్లలో క్యూఆర్ కోడ్ ద్వారా రైల్వే టిక్కెట్‌ల చెల్లింపును అంగీకరించే సౌకర్యం కల్పించామని డివిజనల్ రైల్వే ప్రతినిధి తెలిపారు. డివిజనల్ రైల్వే మేనేజర్ అశ్వనీ కుమార్, భావ్‌నగర్ డివిజనల్ రైల్వే మేనేజర్ రవీష్ కుమార్ లు క్యూఆర్ కోడ్‌ని ఉపయోగించి టికెట్ ఛార్జీలను డిజిటల్‌గా చెల్లించాలని ప్రయాణికులను అభ్యర్థించారు. భావ్‌నగర్ డివిజన్‌లోని భావ్‌నగర్ టెర్మినస్, బోటాడ్, గాంధీగ్రామ్, జునాగఢ్, పోర్ బందర్, వెరావల్‌తో సహా అన్ని చిన్న, పెద్ద స్టేషన్‌లలోని అన్ని రిజర్వ్ చేయబడిన, రిజర్వ్ చేయని టికెట్ కౌంటర్లలో  కోడ్ ద్వారా రైల్వే టిక్కెట్‌ల చెల్లింపును అంగీకరించే సౌకర్యం అందించారు. రాజ్‌కోట్, భావ్‌నగర్ డివిజన్




డిజిటల్ చెల్లింపు పద్ధతులను ఉపయోగించి నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడానికి, ప్రయాణీకులకు సాఫీగా, మరింత సమర్థవంతమైన సేవలను అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నాయి. డివిజన్‌లోని రిజర్వేషన్ కార్యాలయం, బుకింగ్ కార్యాలయం అన్ని కౌంటర్లలో  కోడ్ పరికరాలు అమర్చారు. రైల్వే ప్రయాణికులు టిక్కెట్ ఛార్జీలు చెల్లించేందుకు క్యూఆర్ కోడ్ డిజిటల్ మాధ్యమం సౌకర్యం కల్పిస్తున్నారు. రైల్వే ప్రయాణికులు ఇప్పటికే యూటీఎస్ మొబైల్ యాప్, వంటి వివిధ డిజిటల్ చెల్లింపు ఎంపికలను టిక్కెట్ ఛార్జీని చెల్లించడానికి అందుబాటులో ఉన్నాయి. ఈ రకమైన డిజిటల్ చెల్లింపు వ్యవస్థను మరింత ఉపయోగకరంగా, సాఫీగా మార్చే లక్ష్యంతో, రాజ్‌కోట్ డివిజన్ దీనిని విస్తరించింది. ఈ కొత్త డిజిటల్ చెల్లింపు విధానం ఇప్పుడు క్యూఆర్ కోడ్ ద్వారా టిక్కెట్ ఛార్జీలు చెల్లించడానికి ప్రయాణీకులకు మరింత సౌలభ్యాన్ని అందిస్తుంది. దీని ద్వారా ఏ ప్రయాణీకుడైనా తన టికెట్ ఛార్జీలను సజావుగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా చెల్లించవచ్చు.

# అద్దె ఒప్పందం 11 నెలలకే ఎందుకు చేసుకుంటారో తెలుసా.?




ఇంటి కోసం లేదా దుకాణం కోసం అద్దెకు తీసుకోవడం సర్వసాధారణమైన విషయం. దేశంలో చాలా సొంతింటిలో ఉంటున్న వారి కంటే, సొంత దుకాణాల్లో వ్యాపారాలు చేస్తున్న వారి కంటే అద్దె ఇంట్లో ఉంటున్న వారే ఎక్కువని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే అద్దెకు తీసుకునే సమయంలో రెంటల్ అగ్రిమెంట్ చేసుకుంటారని మనకు తెలిసిందే. అద్దెకు ఇచ్చే వారికి, అద్దె తీసుకునే వారి మధ్య ఈ ఒప్పందం జరుగుతుంటుంది. రెంటల్ అగ్రిమెంట్‌లో యజమాని పేరు, చిరునామా, అద్దె మొత్తం ఎంత.? ఎంత వ్యవధి కోసం అద్దె తీసుకుంటున్నారు, ఇంకా ఏమైనా ఇతర నిబంధనలు లేదా షరతులు ఉంటే వాటిని అందులో పేర్కొంటారు. అద్దె ఒప్పందం అనేది ఒక రకమై లీజు ఒప్పందం లాంటిది. వీటిని వైట్ పేపర్స్‌పై లేదా, బాండ్ పేపర్‌పై రాసి సాక్ష్యుల సమక్షంలో ఒప్పందాలు చేసుకుంటారు. అయితే చాలా వరకు రెంటల్ అగ్రిమెంట్స్ 11 నెలల వ్యవధికి మాత్రమే చేసుకుంటారు. అయితే 11 నెలలకే రెంటల్ అగ్రిమెంట్ ఎందుకు చేసుకుంటారన్న దానిపై ఎప్పుడైనా సందేహం వచ్చిందా.? దీని వెనకాల అసలు కారణం ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. 11 నెలలకు రెంటల్ అగ్రిమెంట్ చేసుకోవడానికి కారణాల్లో రిజిస్ట్రేషన్ చట్టం 108 ఒకటి. రిజిస్ట్రేషన్ చట్టం 1908లో సెక్షన్ 17 నిబంధనల ప్రకారం ఏడాది కంటే తక్కువ లీజు ఒప్పందం చేసుకోవడం కుదరదు. ఏడాదికి లీజు ఒప్పందం చేసుకుంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. ఇదంతా కాస్త వ్యయప్రయాసలతో కూడుకున్న అంశం కావడంతో చాలా మంది కేవలం 11 నెలలకే రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. తిరిగి 11వ తనెల పూర్తి కాగానే మళ్లీ, మరో 11 నెలలకు రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. ఇదండీ 11 నెలల రెంటల్ అగ్రిమెంట్ వెనకాల ఉన్న అసలు ఉద్దేశం.

# 21 ఏళ్లలో రూ. 70 లక్షలు.. నెలకు ఎంత సేవ్ చేయాలంటే..



సంపాదించిన దాంట్లో ఎంతో కొంత సేవ్ చేసుకోవాలని ప్రతీ ఒక్కరూ కోరుకుంటారు. అయితే ఇది వారి వారి ఆదాయాలకు అనుగుణంగా మారుతుంటుంది. సంపాదించే ప్రతీ ఒక్కరూ సేవింగ్స్ చేయాలని ఆర్థిక నిపుణులు సైతం చెబుతుంటారు. ఒకప్పుడు కర్చు పెట్టిన తర్వాత మిగిలిన మొత్తాన్ని సేవ్ చేసే వారు. కానీ ప్రస్తుతం పొదుపు చేసిన తర్వాత మిగిలిన మొత్తాన్నే ఖర్చు చేస్తున్నారు. ఇక పెట్టుబడి పెట్టేందుకు ఎన్నో రకాల పథకాలు అందుబాటులో ఉన్నాయి. కష్టపడి సంపాదించిన సొమ్ముకు భద్రతతో పాటు, మంచి రిటర్న్స్ రావాలని ప్రతీ ఒక్కరూ ఆశిస్తుంటారు. అలాంటి వారి కోసమే కేంద్ర ప్రభుత్వ సంస్థ పోస్టాఫీస్ పలు రకాల పథకాలను అందిస్తోంది. ఇలాంటి బెస్ట్ స్కీమ్స్‌లో సుకన్య సమృద్ధి యోజన ఒకటి. బాలికల బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో రూ. 250 నుంచి గరిష్టంగా ఏడాదికి రూ. 1.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టొచ్చు. ఈ పథకంలో మొత్తం 15 ఏళ్లు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. 21 ఏళ్ల తర్వాత మెచ్యూరిటీ లభిస్తుంది. మరి ఈ పథకంలో భాగంగా రూ. 70 లక్షలు పొందాలంటే నెలకు ఎంత ఇన్వెస్ట్ చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. మీ కూతురు పుట్టిన రోజు నుంచే సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని ప్రారంభించి ఏటా రూ. 1.5 లక్ష డిపాజిట్ చేశారనుకుందాం. ఈ లెక్కన మీరు ప్రతీ నెల రూ. 12,500 సేవ్ చేయాల్సి ఉంటుంది. ఇలా 15 ఏళ్లు పెట్టుబడి పెడితే మొత్తం రూ. 22,50,000 అవుతుంది. ప్రస్తుతం ఈ పథకానికి 8.2 శాతం వడ్డీ లభిస్తోంది. 21 ఏళ్ల తర్వాత మెచ్యూరిటీ సమయంలో ర. 46,77,578 వడ్డీగా పొందుతారు. దీంతో మీ కూతురు 21 ఏళ్ల నాటికి అసలు, వడ్డీతో కలిపి మొత్తం రూ. 69,27,578 అంటే సుమారు రూ.70 లక్షలు పొందొచ్చు.ఉదాహరణకు మీరు ఒకవేళ 2024 సెప్టెంబర్‌లో ఈ పథకంలో చేరితే మీకు 2045 నాటికి రూ.7 లక్షలు పొందొచన్నమాట.ఇక ఈ పథకంలో పెట్టుబడిఎట్టినవారికి1961లోనిసెక్షన్80%కిందపన్నుఆదాఅవకాశం కూడా లభిస్తుంది.

# వ్యాపారం

## దృష్టి లోపం ఉన్న వారికి కూడా మేలైన బ్యాంకింగ్ సేవలు..

### బ్రెయిలీ డెబిట్ కార్డు లాంచ్ ద్వారా ఆ సమస్యలు దూరం




భారతదేశంలో ఇటీవల కాలంలో బ్యాంకింగ్ సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వివిధ సంక్షేమ పథకాల లబ్ధిని బ్యాంకు ఖాతాల ద్వారానే లబ్ధిదారులకు అందిస్తున్నాయి. ముఖ్యంగా జన్-ధన్-ఖాతాలు భారతదేశంలో బ్యాంకింగ్ విప్లవాన్నే సృష్టించాయని చెప్పాలి. భారతదేశ పౌరులందరికీ జీరో బ్యాలెన్స్ అకౌంట్ల ద్వారా బ్యాంకింగ్ సేవలను అన్ని బ్యాంకులు అందించాయి. ముఖ్యంగా డెబిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు కూడా పెరిగాయి. డబ్బు విత్‌డ్రా చేసుకోవడానికి బ్యాంకులకు వెళ్లే అవసరం లేకుండా డెబిట్ కార్డులను ఉపయోగించి ఏటీఎంల ద్వారా నగదు విత్‌డ్రా చేసుకునే వారు ఇటీవల కాలంలో బాగా పెరిగారు. అయితే దృష్టి లోపం ఉన్న వారు బ్యాంకింగ్ సేవలను పొందడంలో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా వారికంటూ ప్రత్యేక చర్యలు ఏవీ లేకపోవడంతో వారు ఇంకా నగదు డిపాజిట్, విత్‌డ్రా కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో దృష్టి లోపం ఉన్న వారికి పంజాబ్ నేషనల్ బ్యాంక్ గుడ్‌న్యూస్ చెప్పింది. బ్రెయిలీ డెబిట్ కార్డులను లాంచ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో పీఎన్‌బీ తీసుకున్న చర్యలు గురించి వివరాలను తెలుసుకుందాం. ప్రభుత్వ యాజమాన్యంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ దృష్టి లోపం ఉన్న కస్టమర్ల కోసం పీఎన్‌బీ అంత: దృష్టి పేరులో బ్రెయిలీ డెబిట్ కార్డ్‌ను ప్రారంభించింది.ఈ కాంటాక్ట్‌లెస్ నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (ఎన్‌సీఎంసీ) డెబిట్ కార్డ్ రూపే నెట్‌వర్క్‌లో అందుబాటులో ఉందని పీఎన్‌బీ ఇటీవల ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త బ్రెయిలీ డెబిట్ కార్డ్‌ను ప్రవేశపెట్టడం అనేది చేరిక, ఆర్థిక సౌలభ్యంపై పీఎన్‌బీ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆ బ్యాంకు ప్రతినిధులు చెబుతున్నారు. ముఖ్యంగా దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించేందుకు పీఎన్‌బీ ఇలాంటి చర్యలను తీసుకుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇతర బ్యాంకులతో పోలిస్తే పీఎన్‌బీ దృష్టి లోపం ఉన్న కస్టమర్ల కోసం ప్రత్యేక చర్యలను తీసుకోవడం అభినందనీయమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దేశంలోని అందరికీ బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ఇలాంటి చర్యలు ఉపయోగపడతాయని వివరిస్తున్నారు.

## యూపీఐ నగదు చెల్లింపుల్లో ఆ తప్పు చేశారా..? ఈ టిప్స్ పాటిస్తే మీ సొమ్ము వాపస్




భారతదేశంలో 2016లో నోట్లను రద్దు చేశాక ఆన్‌లైన్ చెల్లింపులు ఊపందుకున్నాయి. ముఖ్యంగా ఎన్‌పీసీఐ అందుబాటులోకి తీసుకువచ్చిన యూపీఐ పేమెంట్స్ సదుపాయం ద్వారా చాలా మంది నగదును ఈజీగా బదిలీ చేస్తున్నారు. ముఖ్యంగా యూపీఐ చెల్లింపుల వల్ల దేశంలో చిల్లర సమస్యకు చెక్ పడినట్లు అయ్యింది. అలాగే వ్యక్తిగత బ్యాంకు అకౌంట్లకు నగదు బదిలీ కూడా బ్యాంకునకు వెళ్లాల్సిన అవసరం లేకుండా యూపీఐ చెల్లింపులు ద్వారా చేయడం ప్రజలకు అలవాటు అయ్యింది. అయితే యూపీఐ ద్వారా ఒక వ్యక్తికి పంపబోయి వేరే వ్యక్తికి నగదును బదిలీ చేస్తే అవి తిరిగి రావు అని చాలా మంది చెబుతూ ఉంటారు. కానీ, నిర్దిష్ట విధానాన్ని పాటించడం ద్వారా మనం పొరపాటున వేరే వ్యక్తికి బదిలీ చేసిన సొమ్మును వాపస్ పొందవచ్చని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో యూపీఐ ద్వారా వేరే వ్యక్తికి బదిలీ చేసిన సొమ్మును ఎలా వాపసు పొందవచ్చో? ఓసారి తెలుసుకుందాం. యూపీఐ ద్వారా బదిలీ చేసిన నగదు వాపసు పొందడం ఇలా మీరు ముందుగా ఏ యాప్ ద్వారా నగదు బదిలీ చేశారో? ఆ యాప్‌లో లావాదేవీ నెంబర్ ద్వారా టిక్కెట్ రైజ్ చేసి కంప్లైంట్ చేయాలి. అనంతరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌ను సందర్శించి, 'వివాద పరిష్కార యంత్రాంగం' విభాగాన్ని సెలెక్ట్ చేసి ఆన్‌లైన్ ఫారమ్‌ను పూరించాలి. లావాదేవీ ఐడీ, వర్చువల్ చెల్లింపు చిరునామా, బదిలీ చేసిన మొత్తం, లావాదేవీ తేదీ, ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌తో సహా అవసరమైన వివరాలను అందించాలి. అనంతరం అకౌంట్‌లో సొమ్ము బదిలీ జరిగినట్లు మీ బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను అప్‌లోడ్ చేయాలి. అక్కడ మీ ఫిర్యాదుకు కారణం 'మరో ఖాతాకు తప్పుగా బదిలీ చేయబడింది' ఎంచుకోవాలి. అనంతరం మీ ఫిర్యాదు పరిష్కారమవుతుంది. ఒకవేళ సమస్య పరిష్కరించకపోతే ముందుగా టీపీఏపీ, తర్వాత పీఎస్‌పీ బ్యాంక్ (చెల్లింపు సర్వీస్ ప్రొవైడర్ బ్యాంక్), అనంతరం బ్యాంకును సమస్య పరిష్కారం కోసం సంప్రదించాలి. ఒక నెల తర్వాత కూడా సమస్య పరిష్కారం కాకపోతే లేదా ప్రతిస్పందనతో మీరు అసంతృప్తి చెందితే, డిజిటల్ లావాదేవీల కోసం ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌ని సంప్రదించాలి.

## ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితి పెంపు.. ఆ బ్యాంకుల్లో ప్రత్యేక ఆఫర్లు

భారతదేశంలో పెట్టుబడిదారులు నమ్మకమైన పెట్టుబడి ఎంపికగా ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఎంచుకుంటూ ఉంటారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా బ్యాంకింగ్ రంగంలో వచ్చిన మార్పుల వల్ల ఎఫ్‌డీల కంటే మంచి పెట్టుబడి ఎంపికలు ప్రజాదరణ పొందుతున్నాయి. క్రమేపి బ్యాంకుల్లో ఎఫ్‌డీల్లో డిపాజిట్ చేసే వారి సంఖ్య క్రమేపి తగ్గుతుంది. ఈ నేపథ్యంలో కస్టమర్లను ఎఫ్‌డీల్లో పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహించడానికి చాలా బ్యాంకులు ప్రత్యేక ఎఫ్‌డీ స్కీమ్‌లను లాంచ్ చేస్తున్నాయి. సాధారణ ఎఫ్‌డీలతో పోలిస్తే ఈ ప్రత్యేక ఎఫ్‌డీలు అధిక వడ్డీను అందిస్తున్నాయి. తాజాగా ప్రముఖ బ్యాంకులు అన్నీ ప్రత్యేక ఎఫ్‌డీల కాలపరిమితిని పెంచాయి. ఈ నేపథ్యంలో ఏయే బ్యాంకులు ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితిని పెంచాయో? ఓ సారి తెలుసుకుందాం. పొడగింపులను ప్రకటించిన బ్యాంకులు ఇవే ఇండియన్ బ్యాంక్ తన ప్రత్యేక ఎఫ్‌డీల కోసం పొడిగింపును ప్రకటించింది. ఎఫ్‌డీ పెట్టుబడిదారులు సెప్టెంబర్ 30 వరకు ప్రత్యేక ఎఫ్‌డీ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. ఈ గడవు జూన్ 30తో ముగిసినా మరోసారి పెంచారు. ఐడీబీఐ బ్యాంక్‌కు సంబంధించిన ప్రత్యేక ఉత్సవ్ ఎఫ్‌డీల గడువు కూడా సెప్టెంబర్ 30, 2024 వరకు పొడిగించారు. వాస్తవానికి ఈ పథకం గడువు జూన్ 30, 2024న ముగిసినా వినియోగదారులను ఆకర్షించడానికి బ్యాంకు మరోసారి గడువును పొడగించింది. పంజాబ్ సింధ్ బ్యాంక్ లిమిటెడ్ పిరియడ్ ప్రత్యేక డిపాజిట్ల కాలపరిమితిని పెంచింది. ఈ గడువు సెప్టెంబర్ 30, 2024కి ముగుస్తుంది. ప్రముఖ బ్యాంకు ఎస్‌బీఐ కూడా ప్రత్యేక డిపాజిట్లపై కాలపరిమితిని పెంచింది. అమృత్ కలాష్ స్కీమ్, ఎస్‌బీఐ వీ కేర్ ఎఫ్‌డీల కాలపరిమితిని ఎస్‌బీఐ పెంచింది. ఎస్‌బీఐ కూడా ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితిని సెప్టెంబరు 30, 2024 వరకు పెంచింది.

TARAJYOTHI TELUGU DAILY తారాజ్యోతి

# థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్నారా.. ? రోజు ఇలాంటివి తీసుకుంటే మేలు జరుగుతుంది..!

ఈ రోజుల్లో, థైరాయిడ్ సమస్యలు మహిళల్లో చాలా సాధారణం అవుతున్నాయి. ఇది తీవ్రమైన జీవనశైలి వ్యాధి, ఇది చాలా కాలంగా సరైన ఆహారం మరియు నిశ్చల జీవనశైలిని అనుసరించడం వల్ల మహిళల్లో కనిపిస్తుంది. నిజానికి, థైరాయిడ్ అనేది మన మెడపై ఉన్న ఒక చిన్న గ్రంథి, దీని ఆకారం సీతాకోకచిలుకలా ఉంటుంది. కొన్ని ముఖ్యమైన హార్మోన్ల ఉత్పత్తిలో ఈ గ్రంథి చాలా కీలక పాత్ర పోషిస్తుంది. థైరాయిడ్ గ్రంథి సరిగ్గా పని చేయనప్పుడు, అది తగినంత హార్మోన్లను విడుదల చేయదు. దీని వలన జీవక్రియ మందగిస్తుంది. లేదా వేగవంతం అవుతుంది. శరీరంలోని ఇతర హార్మోన్ల ఉత్పత్తిలో జీవక్రియ చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. థైరాయిడ్ పనితీరు సరిగా లేకపోవడం వల్ల శరీరంలో హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. దీని కారణంగా మహిళలు క్రమం తప్పకుండా పీరియడ్స్, తీవ్రమైన నొప్పి, తిమ్మిరి, వంధ్యత్వం, అనేక ఇతర తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. అయితే, ఒక మంచి విషయం ఏమిటంటే ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిలో కొన్ని ముఖ్యమైన మార్పులతో మీరు థైరాయిడ్ పనితీరును మెరుగుపరచవచ్చు. థైరాయిడ్‌తో బాధపడే స్త్రీలు వాటిని ఆహారంలో భాగంగా చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.



థైరాయిడ్ గ్రంథి పనితీరును మెరుగుపరచడంలో సహాయపడే కొన్ని ఆహారాలను ఇక్కడ తెలుసుకుందాం.. మజ్జిగ తాగితే మంచిది.. మాంసకృత్తులు, కాల్షియం, విటమిన్ బి, అనేక ముఖ్యమైన పోషకాలతో సమృద్ధిగా ఉన్న మజ్జిగ ప్రేగులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన ప్రోబయోటిక్. ఇది ప్రేగులలో మంచి బ్యాక్టీరియాను పెంచడంలో సహాయపడుతుంది. దీన్ని తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. థైరాయిడ్ పనితీరు మెరుగుపడుతుంది. అనేక సమస్యలను దూరం చేస్తుంది. బీట్‌రూట్, క్యారెట్ జ్యూస్ తాగండి.. ఈ జ్యూస్‌లో విటమిన్ ఎ, బి, సి, ఐరన్, ఫోలిక్ యాసిడ్‌తో పాటు లైకోపీన్, ఫైటోన్యూట్రియెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఈ జ్యూస్ తాగడం వల్ల థైరాయిడ్ గ్రంధికి అవసరమైన పోషణ అందుతుంది. దాని పనితీరు మెరుగుపడుతుంది. ఆకుపచ్చ కూరగాయల జ్యూస్.. ఆకుకూరల రసంలో పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వాటిలో చాలా ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ జ్యూస్ తాగడం వల్ల శరీరంలోని రక్తహీనత తొలగిపోయి రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది. అదనంగా, అవి థైరాయిడ్ పనితీరును మెరుగుపరచడంలో, లక్షణాలను మెరుగుపరచడంలో సహాయపడతాయి. మూలికల టీ.. మిల్క్ టీకి బదులుగా, చమోమిలే టీ, గ్రీన్ టీ, అల్లం టీ, ఫెన్నెల్, జీలకర్ర, ఆకుకూరల వంటి కొన్ని హెర్బల్ టీలు తాగడం థైరాయిడ్ మహిళలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇవి శరీరంలో హార్మోన్ల సమతుల్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయి. అంతేకాకుండా, ఇది ఆరోగ్యానికి అద్భుతమైన ప్రయోజనాలను కూడా అందిస్తుంది. పసుపు పాలు.. ఇది ఆరోగ్యానికి ఆరోగ్యకరమైన, చాలా ప్రయోజనకరమైన పానీయం. ఇది ప్రతిరోజూ పసుపు తాగాలని నిపుణులు చెబుతున్నారు. యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉన్న ఈ పానీయం థైరాయిడ్ గ్రంథి వాపును తగ్గిస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల శరీరంలో హార్మోన్ల సమతుల్యత మెరుగుపడుతుంది.

# అడపాదడపా ఉపవాసం చేస్తున్నారా.? అనారోగ్యాన్ని కొనితెచ్చుకున్నట్టే.. ఇదిగో క్లారిటీ..

ఇంటర్మీటెంట్ ఫాస్టింగ్(అడపాదడపా ఉపవాసం) వల్ల గుండె జబ్బులు వస్తాయని, స్ట్రోక్ వస్తుందని గత నాలుగైదు రోజులుగా ఎన్నో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మనం ఆహారాన్ని తీసుకున్న వెంటనే నోట్లో నుంచే జీర్ణక్రియ అనేది ప్రారంభమవుతుంది. లాలాజలంలో టయలిన్ అనే ఎన్‌జైమ్ ఉంటుంది. మన జీర్ణాశయంలో 4 గంటల పాటు ఉండి అక్కడ జీర్ణాశయంలో ఉండే హైడ్రోక్లోరిక్ యాసిడ్.. కాలేయం నుంచి వచ్చే కాలేయ రసాలు బైల్ యాసిడ్స్, క్లోమం నుంచి వచ్చే ఎన్‌జైమ్‌లు అన్ని కూడా ఈ ఆహారంతో కలుస్తాయి. ఈ ప్రాసెస్ అంతా జరగడానికి జీర్ణాశయం నుంచి మన ఆహారం బయటకు వెళ్లడానికి 6 గంటల సమయం పడుతుంది. జీర్ణాశయం నుంచి ఆహారం కిందకు వెళ్తేనే మరలా మనకు ఆకలి వేసినట్టు అనిపిస్తుంది. కానీ అక్కడే మనం పప్పులో కాలేస్తాం. అసలైన జీర్ణ వ్యవస్థ.. అసలైన ఆహారం జీర్ణం కావడం 6 గంటల తర్వాతే ప్రారంభమవుతుంది. దీనిని ఇంటర్ డైజెస్టివ్ ఫేస్ అని అంటారు. ఈ ఆహారం జీర్ణకోశం నుంచి కిందకు వెళ్లిన తర్వాత దాదాపు 3 మీటర్ల పొడుగున ఉండే చిన్న ప్రేగుల ద్వారా వెళ్తూ ఉంటుంది. అప్పుడు మన ఆహారంలో ఉన్న పదార్థాల్ని గ్లూకోజ్ గానూ ప్రోటీన్ లాగానే విభజించి వాటిని చిన్న ప్రేగులలో ఉన్న విల్లై ద్వారా అబ్జార్బ్ చేసుకొని అవి మరలా బ్లడ్‌లో కలిసి లివర్‌కు వెళ్లి కొంత స్టోర్ అయ్యి మనకు శక్తిని ప్రసాదిస్తాయి. తరువాత మిగిలిన వ్యర్థ పదార్థాలు పెద్ద ప్రేగులోకి వెళ్లి వీలైనంత నీటిని పీల్చుకొని విసర్జన జరుగుతుంది. ఇలా జీర్ణం కావడానికి మొత్తం 24 గంటల సమయం పడుతుంది. మన శరీరానికి కావలసిన శక్తిని ప్రసాదించేది ఇంటర్ డైజెస్టివ్ ఫేస్ అనే 16 గంటల సమయమే.. మనం చాలామంది జీర్ణకోశంలో ఆహారం ఉంటేనే మనకి శక్తి వస్తుంది అని అనుకుంటాం అది తప్పు. మరి ఈ మధ్య కాలంలో ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేస్తే హార్ట్ స్ట్రోక్స్ వస్తాయంటూ వైరల్‌గా మారింది. దీన్ని వైద్యులు కొట్టిపారేశారు. చైనాలో ఓ 200 మందికి ఫోన్ చేసి ప్రశ్నలడిగి, అవే ప్రశ్నలు అమెరికాలో ఉండే 200 మందికి అడిగి ఇక గుండె జబ్బులు వస్తాయి అంటున్నారని.. కానీ వాస్తవానికి దీనికి ఎటువంటి శాస్త్రీయమైన ఆధారాలు జతపరచలేదని.. ఇది ఒక బేసిక్ స్టడీ మాత్రమే కానీ దీనికి ఎటువంటి ప్రామాణికత లేదంటున్నారు. బాగా గమనించినట్లయితే చాలా జంతువులు, పక్షులు అన్నీ కూడా ఒక పూటనే తింటాయని.. మనుషుల మాదిరి చాలాసార్లు తినవంటున్నారు. తక్కువసార్లు తినడం వల్ల



జీర్ణ వ్యవస్థకు కొంచెం గ్యాప్ ఇవ్వడం వల్ల పేగులలో ఆహారం బాగా జీర్ణమయ్యి ఇంకా బాగా శరీరంలోకి అబ్సార్బ్ అవుతుంది అంటున్నారు. అందుకే ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ అనేది నిజంగా ఫాస్టింగ్ కాదని మామూలుగా చేయాల్సిన పనే అంటున్నారు. అది కాకపోతే మనం ఎక్కువసార్లు తినడం అలవాటు చేసుకున్నాం. శరీర నిర్మాణంలో జీర్ణాశయం అనేది ఒక స్టోరేజ్ పాయింట్. పాత కాలంలో ఆహారం సదా దొరకదు. కాబట్టి మనకు జీర్ణాశయం అనేది పరిణామ క్రమంలో డెవలప్ అయింది. అనగా మనం ఆహారాన్ని ఒకేసారి తీసుకొని దానిని నిదానంగా కిందికి పంపిస్తూ జీర్ణం జరగడానికి అలవాటు పడిపోయాం. కానీ ఈ మారిన నవీన యుగంలో ఆహారాన్ని బయట స్టోరేజ్ చేసే పరిస్థితి వచ్చింది. కాబట్టి మనకు ఎప్పుడు పడితే అప్పుడు ఆహారం దొరుకుతుంది. అందుకని ఎక్కువసార్లు మనం తినాల్సిన అవసరం లేదంటున్నారు. మనం ఎంత తినాలి అని అనుకుంటే.. అంతా మనకు కావలసిన, మనకు నచ్చిన పదార్థం ఒక పూట తిన్నా గాని 24 గంటలకు సరిపోతుందని అంటున్నారు.

# నోరూరించే పిజ్జా..! ఒక్క ముక్క మీ జీవితాన్ని ఏం చేస్తుందో తెలుసా..?



ప్రస్తుతం అత్యంత ప్రజాదరణ పొందిన జంక్ ఫుడ్స్‌లో పిజ్జా ఒకటి. పిజ్జాని చాలా మంది తరచూ తింటూ ఉంటారు. కానీ అది జంక్ ఫుడ్. టేస్టీకి చాలా మంచిది. కానీ ఆరోగ్యం కోసం కాదు. పిజ్జాతో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. పిజ్జా అతిగా తినడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తే మొదటికే మోసం వస్తుందని హెచ్చరిస్తున్నారు. పిజ్జాలో సోడియం స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. మీరు ప్రతిరోజూ అలాంటి పిజ్జా తింటే, అది అధిక రక్తపోటుకు దారితీస్తుంది. మీరు ఒకేసారి మొత్తం పిజ్జా తింటే, మీరు మీ రోజువారీ సోడియం తీసుకోవడం అధికంగా చేస్తున్నారని అర్థం. దీనివల్ల రక్తపోటు పెరుగుతుంది. ఇది గుండె సమస్యలను కలిగిస్తుంది. పిజ్జా తినడం వల్ల వచ్చే మరో ప్రమాదకరమైన వ్యాధి గుండెపోటు. మాంసాలతో తయారు చేసిన పిజ్జా తింటే, అది ఊబకాయం, కొన్ని క్యాన్సర్, గుండె సమస్యలను కలిగిస్తుంది. ఈ ప్రాసెస్ చేసిన మాంసాలను ఎక్కువగా తినడం గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. తరచుగా పిజ్జా తినడం వల్ల వచ్చే సమస్యలలో మధుమేహం ఒకటి. పిజ్జా తినడం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ పెరిగి క్రమంగా డయాబెటిస్‌గా మారుతుంది. పిజ్జా వంటి అధిక కొవ్వు ప్రాసెస్ చేసిన ఆహారాలు తినడం వల్ల కడుపు, పెద్దప్రేగు క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. దానికి తోడు బరువు విపరీతంగా పెరిగిపోతుంది. దీంతో ఇతర సమస్యలు కూడా పెరుగుతున్నాయి. పిజ్జాతో ముందుగా వచ్చే అతి పెద్ద సమస్య మలబద్ధకం..! పిజ్జా కోసం వాడే మైదా సరిగా జీర్ణం కాదు. ఒక స్లైస్? చీజ్? పిజ్జాలో 400 కెలరీలు ఉంటాయి. ఒక్క స్లైస్‌తో ఆపలేము కదా! ఫలితంగా.. వేగంగా బరువు పెరిగిపోతారు. రిఫైన్డ్ ఫ్లోర్‌తో తయారు చేయడంతో పిజ్జా చాలా హెవీగా ఉంటుంది. ఏ పని చేయలేకపోతాము. అయితే.. పిజ్జాని అప్పుడప్పుడు తినడంలో తప్పు లేదు.కానీ దానిని ఎక్కువగా తినడమే సమస్య! అప్పుడప్పుడు క్వాంటిటీ తగ్గించి తినండి.

# బేబీ కార్న్ తింటే ఇన్ని లాభాలా..?

## తప్పకుండా తెలుసుకోవాల్సిన విషయాలు ఇవే..

బేబీ కార్న్ రుచికరమైన, పోషకమైన ఆహారం. ఇది పూర్తిగా ఆకులతో చుట్టబడినందున పురుగుమందుల ప్రభావాల ఉండదు. బేబీ కార్న్‌లో భాస్వరం పుష్కలంగా లభిస్తుంది. అంతే కాకుండా కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, కాల్షియం, ఐరన్, విటమిన్లు కూడా ఇందులో లభిస్తాయి. కొలెస్ట్రాల్ లేకుండా, ఫైబర్ పుష్కలంగా ఉండటం వలన ఇది తక్కువ కేలరీల ఆహారం. ఇది గుండె రోగులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. బేబీ కార్న్‌లో లుటీన్, జియాక్సంతిన్ వంటి అవసరమైన కెరోటినాయిడ్లు ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యాన్ని సరైన రీతిలో నిర్వహించడానికి ప్రయోజనకరంగా ఉంటాయి. బేబీ కార్న్‌లోని పొటాషియం మరియు ఫైబర్ కలయిక రక్తపోటును నియంత్రించడంలో, హృదయ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది. బేబీ కార్న్ అనేది యాంటీఆక్సిడెంట్ పవర్‌హౌస్. ఇది రోగనిరోధక వ్యవస్థకు అవసరమైన బూస్ట్‌ని ఇవ్వడం ద్వారా అనారోగ్యం నుండి శరీరం రక్షణకు మద్దతు ఇస్తుంది. బేబీ కార్న్ మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాల యొక్క గొప్ప మూలం. బేబీ కార్న్ డయాబెటిస్ ఉన్న వ్యక్తులకు రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడానికి సహాయపడుతుంది. జీర్ణక్రియ సమస్యలతో బాధపడేవారికి బేబీ కార్న్ దివ్యౌషధం. బేబీ కార్న్‌లోని అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియలో సహాయపడుతుంది. సాధారణ ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. మీరు స్థూలకాయం సమస్యతో సతమతమవుతున్నట్లయితే బేబీ కార్న్ తప్పనిసరిగా తినాలి. బేబీ కార్న్ చర్మానికి చాలా ఉపయోగకరంగా పరిగణించబడుతుంది. నిజానికి, విటమిన్ సి బేబీ కార్న్‌లో పుష్కలంగా లభిస్తుంది. ఇది కాకుండా, బేబీ కార్న్‌లో ఉండే పోషకాలు చర్మ కణాలను పునరుజ్జీవింపజేస్తాయి. మీ చర్మం మృదువుగా కనిపిస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గాలంటే బేబీ కార్న్ తినాలి. నిజానికి, బేబీ కార్న్‌లో ఉండే ఫైబర్ కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడుతుంది.



# గుట్టగా మారిన పొట్టకు ఛూమంత్రం.. సరిగ్గా ఆ సమయంలో తాగారంటే వెన్నలా కరగాల్సిందే..



యాపిల్ సైడర్ వెనిగర్‌లో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. ఇది ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. మీరు దీన్ని నీటిలో కలిపి ప్రతిరోజూ తాగితే, బరువు తగ్గడంతోపాటు అనేక తీవ్రమైన వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా.. ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కొంచెం గోరు వెచ్చని నీటిలో ఆపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగడం వల్ల కలిగే ఐదు ప్రయోజనాలు, ఎప్పుడు తాగితే మంచిది అనే విషయాలను ఇప్పుడు తెలుసుకోండి.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: యాపిల్ వెనిగర్ తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది యాంటీమైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంది. ఇది ప్రమాదకరమైన బ్యాక్టీరియా నుంచి శరీరాన్ని దూరంగా ఉంచుతుంది. రక్తంలో చక్కెర నియంత్రణలో ఉంటుంది: రీసెర్చ్‌గేట్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. యాపిల్ సైడర్ వెనిగర్ రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీ గ్లైసెమిక్ ఎఫెక్ట్, యాంటీ డయాబెటిక్ లక్షణాలు దీనికి కారణం.. జీర్ణక్రియ సమస్యల నుంచి ఉపశమనం: యాపిల్ సైడర్ వెనిగర్ తీసుకోవడం వల్ల జీర్ణక్రియ సులభం అవుతుంది. ఇది అజీర్ణం, గ్యాస్ వంటి కడుపు సమస్యల నుంచి కూడా ఉపశమనం అందిస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది: ఆపిల్ సైడర్ వెనిగర్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడం ద్వారా మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడుతుంది. బరువు తగ్గడంలో కూడా మేలు చేస్తుంది: యాపిల్ వెనిగర్ ఊబకాయాన్ని తగ్గించడంలో ప్రయోజనకరంగా పరిగణిస్తారు. హార్వర్డ్ హెల్త్ ప్రకారం, 2009లో 175 మందిపై జరిపిన ఒక అధ్యయనం ప్రకారం, 3 వారాల పాటు 1-2 టీస్పూన్ల వెనిగర్‌ను తీసుకునే వ్యక్తులు 2-4 పౌండ్ల బరువును తగ్గారని కనుగొన్నారు. ఈ సమయంలో తీసుకోవడం వల్ల వేలు జరుగుతుంది.. 1-2 టీస్పూన్ల యాపిల్ వెనిగర్‌ను నీటిలో కలిపి ఉదయం ఖాళీ కడుపుతో తాగడం చాలా ప్రయోజనకరమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

# మధుమేహ వ్యాధిగ్రస్తులు కుంకుమ పువ్వు తీసుకుంటే.. కేవలం 8 వారాలలో ఈ మార్పు చూడోచ్చు!



ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మసాలా దినుసు ఏదంటే టక్కున గుర్తొచ్చేది కుంకుమపువ్వు. ఈ పువ్వు ఉత్పత్తికి సాగు చేసే విధానం కారణంగా, కుంకుమపువ్వు ధర అత్యధికంగా ఉంటుంది. నిజానికి.. ఇతర మసాలా దినుసుల కంటే కుంకుమపువ్వు వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు చాలా ఎక్కువ. అవేంటో తెలుసుకుందాం.. కొన్నిసార్లు కోపం రావడం, కొన్నిసార్లు ఏడవడం.. ఇలాంటి మానసిక కల్లోలం తరచుగా రావడం అస్సలు మంచిది కాదు. ఈ పరిస్థితిలో కుంకుమపువ్వు సహాయం తీసుకోవచ్చు. కుంకుమపువ్వు మనస్సును ఆరోగ్యంగా ఉంచుతుందని, డిప్రెషన్ లక్షణాలను తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆందోళనను తగ్గించడంలోనూ కుంకుమ పువ్వు సహాయపడుతుంది. కుంకుమపువ్వులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి హానికరమైన ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. కుంకుమపువ్వు తినడం వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి ఆహారంలో కుంకుమపువ్వును తప్పక తీసుకోవాలి. ముఖ్యంగా కుంకుమపువ్వు మహిళల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రీ-మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్ సమస్యకు కుంకుమపువ్వు మేలు చేస్తుంది. అంటే రుతుక్రమం రాకముందే కలిగే మానసిక, శారీరక అనారోగ్యాన్ని కుంకుమపువ్వు దూరం చేస్తుంది. కాలు నొప్పి, మూడ్ స్వింగ్స్ వంటి లక్షణాలను నియంత్రిస్తుంది. రోజూ కుంకుమపువ్వు కలిపిన టీ లేదా పాలు తాగడం వల్ల బరువు కూడా తగ్గవచ్చు. కుంకుమపువ్వు ఆకలిని అణిచివేసి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా ఈ మసాలాలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఊబకాయాన్ని నివారిస్తాయి. జీవక్రియ రుగ్మతలను తొలగిస్తాయి. కుంకుమపువ్వు గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. కుంకుమపువ్వులోని యాంటీఆక్సిడెంట్ కంటెంట్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. గుండె సమస్యలను నివారించడానికి ఆహారంలో కుంకుమపువ్వు తీసుకోవచ్చు. రోజువారీ ఆహారంలో కొద్దిగా కుంకుమపువ్వు తీసుకుంటే మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా మంచిది. కుంకుమపువ్వు కేవలం 8 వారాలలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తుంది. కుంకుమపువ్వు టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది.

# సహజంగా శరీరంలో కొలెస్ట్రాల్ కరిగించే ఆహారాలు ఇవే.. తప్పక తీసుకోండి




నేటి కాలంలో అనేక మంది చిన్న వయసులోనే కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతున్నారు. కొలెస్ట్రాల్ ప్రాథమికంగా ఒక రకమైన లిపిడ్. శరీరానికి అవసరమైన విధులు నిర్వర్తించడానికి ఇది చాలా అవసరం. ఈ కొలెస్ట్రాల్ ఈస్ట్రోజెన్, టెస్టోస్టెరాన్ వంటి హార్మోన్లను తయారు చేయడానికి సహాయపడుతుంది. ఈ కారణాల వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ ఉండటం చాలా ముఖ్యం. అయితే దీని పరిమాణం పెరిగితే మాత్రం ప్రమాదమే. మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్, మంచి కొలెస్ట్రాల్ అనే రెండు రకాల కొలెస్ట్రాల్ ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్ లేదా మొత్తం పెరిగినప్పుడు అనేక సమస్యలు వస్తాయి. ఈ కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి కొన్ని ఆహారాలు తీసుకోవాలి. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.. ఈ రోజుల్లో చాలా మంది ఓట్ మీల్ తింటున్నారు. ఇందులో కొలెస్ట్రాల్‌ను కరిగించి నియంత్రించడంలో సహాయపడే కరిగే ఫైబర్ ఉంటుంది. ఇందులో మోనోశాచురేటెడ్ కొవ్వు కూడా ఉంటుంది. అలాగే కొన్ని రకాల పండ్లు కూడా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెను ఆరోగ్యంగా ఉంచడంతోపాటు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. యాపిల్స్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇదిచెడు కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. కాబట్టి రోజూ యాపిల్స్ తప్పక తినాలి. రెడ్ మీట్, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ వంటి ఆహారాలను పూర్తిగా మానుకోవాలి. అవి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. అలాగే, ప్రాసెస్ చేసిన ఆహారాలు, కేకులు, కుకీలు, పేస్ట్రీలు, జున్ను, నెయ్యి, వెన్న, చీజ్, జామ్ వంటి వాటికి కూడా దూరంగా ఉండాలి. మీగడ పాలు, దానితో చేసిన ఆహారం, నెయ్యి-వెన్న వీలైనంత తక్కువగా తీసుకోవాలి.అలాగే తగినంత నీళ్లు త్రాగాలి.దానితో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం తప్పనిసరి. సరైన ఆహారాల అలవాట్లు సగం జబ్బులను నయం చేస్తుంది.

# స్పోర్ట్స్

# ఇంపాక్ట్ ప్లేయర్‌గా రోహిత్..

ఐపీఎల్‌లో అత్యధిక టైటిళ్లు గెలిచిన జట్లలో ముంబై ఇండియన్స్ ఒకటి. ఐదు సార్లు(2013, 2015, 2017, 2019, 2020) విజేతగా నిలిచింది. 8 ఏళ్ల వ్యవధిలో 5 టైటిళ్లు అందుకున్న ముంబై.. గత ఐదు సీజన్లలో మాత్రం ఒక్కసారి కూడా ఫైనల్ చేరలేకపోయింది. గత సీజన్‌లో ప్లే ఆఫ్స్ చేరినా.. ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. ఈ సారి ఎలాగైనా టైటిల్ గెలవాలనే యోచనలో ఉంది.జట్టు నిండా స్టార్ ఆటగాళ్లున్నా.. మునపటిలా ముంబై సత్తా చాటలేకపోతుంది. కానీ ఇటీవల టీమిండియా టీ20 ప్రపంచకప్ నిలబెట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన బుమ్రా, సూర్యకుమార్, హార్దిక్, తిలక్ ఫుల్‌ఫామ్‌లో ఉండటం జట్టుకు కలిసొచ్చే అంశం. అయితే అంతర్జాతీయ స్థాయిలో సక్సెస్‌ఫుల్ కెప్టెన్లుగా గుర్తింపు పొందిన రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, మిచెల్ సాంట్నర్‌లు ఉన్న జట్టును హార్దిక్ పాండ్యా ఎలా నడిపిస్తాడనేది కీలకం. ముంబైకి ఐదు టైటిళ్లు అందించిన రోహిత్ శర్మ ఈసారి కూడా ఇంపాక్ట్ ప్లేయర్‌గానే బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్.. కేవలం వన్డేల్లో మాత్రమే ఆడుతున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్ కోసం ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టాడు. రోహిత్ శర్మతో కలిసి క్వింటన్ డికాక్ ఓపెనింగ్ చేయనుండగా.. సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, విల్ జాక్స్ మిడిలార్డర్‌లో ఆడనున్నారు. హార్దిక్ పాండ్యా, నమన్ ధీర్‌లు ఫినిషర్ పాత్ర పోషించనున్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా మ్యాచ్‌ను ప్రత్యర్థి నుంచి



లాగేసుకోవడంలో వీరికి అపార అనుభవం ఉంది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ఒక్క డికాక్ మినహా మిగిలిన వాళ్లంతా భారత ఆటగాళ్లే కావడంతో.. విదేశీ ఆటగాళ్ల సేవలను వినియోగించుకునే విషయంలో ఫ్రాంచైజీ మంచి వెసులు బాటు ఉంది. విదేశీ కోటాలో డికాక్, రికెల్టన్, రూథర్‌ఫర్డ్, సాంట్నర్, విల్ జాక్స్, బాష్, ట్రెంట్ బౌల్డ్, ఘజన్‌ఫర్ అందుబాటులో ఉండగా.. డికాక్, జాక్స్, సాంట్నర్, బౌల్ట్ తుది జట్టులో ఉండటం ఖాయం. పరిస్థితులను బట్టి రూథర్‌ఫర్డ్, ఘజన్‌ఫర్‌ను ఆడించవచ్చు. బౌలింగ్ భారాన్ని బుమ్రా మోయనున్నాడు. దీపక్ చాహర్, ట్రెంట్ బౌల్ట్ నుంచి సహకారం అందితే ముంబై ఇండియన్స్‌కు తిరుగుండదు. విల్ జాక్స్, మిచెల్ సాంట్నర్‌తో పాటు మయాంక్ మార్కండే స్పిన్ బాధ్యతలు మోయనున్నారు.

ముంబై ఇండియన్స్ తుది జట్టు(అంచనా) రోహిత్ శర్మ, క్వింటన్ డికాక్(కీపర్), సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, విల్ జాక్స్, హార్దిక్ పాండ్యా, నమన్ ధీర్/షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, మిచెల్ సాంట్నర్, దీపక్ చాహర్/శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, మయాంక్ మార్కండే(ఇంపాక్ట్)



## సీఎస్‌కేకు భారీ ఎదురుదెబ్బ

### ఆస్ట్రేలియా పేసర్ ఎల్లిస్ జట్టుకు దూరం

ఈ మార్చి 28న ఐపీఎల్ 2026 ప్రారంభంకానుంది. అయితే ఐపీఎల్ 19వ సీజన్‌కు ముందు సీఎస్‌కేకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బౌలర్ మొత్తం సీజన్‌కు దూరమయ్యాడు. ఐపీఎల్ 2026లో, రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని చెన్నై సూపర్ కింగ్స్ తమ ఆరో టైటిల్‌ను గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, ఈ లక్ష్యం సీఎస్ కేకు మరింత కష్టతరం కావచ్చు. చెన్నై ఫాస్ట్ బౌలర్ నాథన్ ఎల్లిస్ గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఎల్లిస్ లేకపోవడం చెన్నై సూపర్ కింగ్స్‌కు పెద్ద దెబ్బ. చెన్నై తరపున చివరి ఓవర్లలో ఎల్లిస్ బాగా బౌలింగ్ చేస్తాడు. డెత్ ఓవర్లలో బౌలింగ్ చేసిన అనుభవం కూడా ఉంది. గతంలో పంజాబ్ కింగ్స్ తరపున ఆడాడు. ఐపీఎల్ 2025 వేలంలో సీఎస్‌కే అతన్ని కొనుగోలు చేసింది. ఈ ఆస్ట్రేలియన్ బౌలర్ ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లలో ఆడటం లేదు. అతని స్థానంలో సీఎస్‌కే ఇంకా ఎవరినీ ప్రకటించలేదు. ఇక ఐపీఎల్ 2026కు ముందు సీఎస్‌కే మతిషా పతిరానాను విడుదల చేసింది. ఆ తర్వాత వేలంలో ఎల్లిస్‌ను తమ జట్టులోకి తీసుకున్నారు. సీఎస్‌కే ఫాస్ట్ బౌలింగ్‌కు నాయకత్వం వహించాల్సి ఉన్న ఎల్లిస్, గాయం కారణంగా టోర్నమెంట్ మొత్తానికి దూరమయ్యాడు. 2025లో సీఎస్కే అతడిని రూ.2 కోట్లకు కొనుగోలు చేసింది. అతను గతంలో 2021 నుండి 2025 వరకు పంజాబ్ తరపున ఆడాడు. తన ఐపీఎల్ కెరీర్‌లో 17 మ్యాచ్‌లు ఆడి, 19 వికెట్లు పడగొట్టాడు. ఎల్లిస్ కండరాల గాయంతో బాధపడుతున్నట్లు సమాచారం. కాగా చెన్నై ఫాస్ట్ బౌలింగ్ దళాన్ని పరిశీలిస్తే, వారి విదేశీ బౌలర్లలో మాట్ హెన్రీ, జాక్ ఫౌల్క్స్ ఉన్నారు. ఇంగ్లాండ్ ఆల్-రౌండర్ జేమీ ఓవర్టన్ కూడా చెన్నై జట్టులో భాగమే. భారత పేసర్లలో ఖలీల్ అహ్మద్, అన్షుల్ కంబోజ్, ముఖేష్ చౌదరి, గుర్జప్నీత్ సింగ్ ఉన్నారు. వారి ఫాస్ట్ బౌలింగ్ దళం బలంగా కనిపిస్తున్నప్పటికీ, ఎల్లిస్ నిష్క్రమణ ఒక పెద్ద దెబ్బ.

## ఐపీఎల్‌లో కోహ్లీ-గేల్ బెస్ట్ ఓపెనింగ్ పార్టనర్‌షిప్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 త్వరలో ప్రారంభం కానుంది. టాటా ఐపీఎల్ 2026 2026 మార్చి 28 నుంచి ప్రారంభం కానుంది. దీంతో ఇప్పటి నుంచే టోర్నమెంట్‌పై ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా లీగ్‌లో బెస్ట్ ఓపెనింగ్ జోడీల గురించి ప్రస్తావన వస్తే.. ఎవరెవరి పేర్లు చెప్పాలో తెలిపాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మాజీ కెప్టెన్ ఫాఫ్ డు ప్లెసిస్. ఐపీఎల్ చరిత్రలోనే 8 బెస్ట్ ఓపెనింగ్ పార్టనర్‌షిప్ జోడీలకు ర్యాంకులు ఇచ్చాడు. ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు జరిగిన ఒక కార్యక్రమంలో ఫాఫ్ డు ప్లెసిస్ ఈ ర్యాంకింగ్స్ ప్రకటించాడు. ఇందులో గౌతమ్ గంభీర్ – రాబిన్ ఉతప్ప జోడీకి ఫస్ట్ ర్యాంక్ ఇవ్వడం విశేషం. వీరిద్దరూ కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఆడుతూ 39 ఇన్నింగ్స్‌ల్లో 1,478 పరుగులు చేశారు. ఇక రెండో స్థానంలో ముంబై ఇండియన్స్‌కు చెందిన రోహిత్ శర్మ – ఇషాన్ కిషన్ జోడీని ఎంపిక చేశాడు. వీరిద్దరూ కలిసి 43 ఇన్నింగ్స్‌ల్లో 1,547 పరుగులు సాధించారు. విరాట్ కోహ్లీ , క్రిస్ గేల్ జోడీకి డు ప్లెసిస్ మూడో ర్యాంక్ ఇచ్చాడు. వీరిద్దరూ కేవలం 28 ఇన్నింగ్స్‌ల్లోనే 1,210 పరుగులు చేశారు. వీరి యావరేజ్ 46.53గా ఉండటం విశేషం. అంతకంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే.. వీరిద్దరూ కలిసి ఐపీఎల్‌లో నాలుగు సెంచరీ పార్టనర్‌షిప్‌లు నెలకొల్పారు. ఒకానొక దశలో వీరిని చూసి బౌలర్లు వణికిపోయేవారు. ఆర్సీబీకి డు ప్లెసిస్ కెప్టెన్‌గా చేసినా సరే.. కోహ్లీ– గేల్ జోడీకి అతడు మూడో ర్యాంక్ ఇవ్వడం విశేషం. బెస్ట్ ఐపీఎల్ ఓపెనర్స్ లిస్టులో మురళీ విజయ్ – మైకేల్ హస్సీ (జూఖ) కి డు ప్లెసిస్ 4వ ర్యాంక్ ఇచ్చాడు. 2011లో చెన్నై టైటిల్ గెలవడంలో వీరి పాత్ర చాలా ఉంది. వీరిద్దరూ కలిసి 1,360 పరుగులు చేశారు. తనతో కలిసి కోహ్లీ ఆడిన ఓపెనింగ్ జోడీకి డు ప్లెసిస్ 5వ స్థానం ఇచ్చారు. వీరిద్దరూ 2023లో ఒక్క సీజన్‌లోనే 939 పరుగులు చేసి రికార్డు సృష్టించారు. మొత్తం మీద 1,890 పరుగులు సాధించి ఆల్–టైమ్ రెండో స్థానంలో ఉన్నారు. ఐపీఎల్ చరిత్రలో 2,000 కంటే ఎక్కువ పరుగులు చేసిన ఏకైక ఓపెనింగ్ పార్టనర్‌షిప్ డేవిడ్ వార్నర్ – శిఖర్ ధావన్ మాత్రమే. అయినప్పటికీ డు ప్లెసిస్ వీరికి 8వ స్థానం ఇవ్వడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అలాగే ఫాఫ్ , రుతురాజ్ గైక్వాడ్ జోడీ కేవలం 19 ఇన్నింగ్స్‌ల్లోనే 884 పరుగులు చేసి 46.52 యావరేజ్ సాధించారు. మొత్తానికి డు ప్లెసిస్ నిలకడ కంటే మ్యాచ్‌ను గెలిపించే ప్రభావం చూపే జోడీలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తోంది. గౌతమ్ గంభీర్ – రాబిన్ ఉతప్ప మధ్య ఉన్న అవగాహన వల్లే కేకేఆర్ రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచిందని ఈ సౌతాఫ్రికా బ్యాటర్ విశ్లేషించాడు.

## యశ్ దయాల్‌పై ఆర్‌సీబీ వేటు..?

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మైనర్ బాలికపై అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న తమ లెఫ్టార్మ్ పేసర్ యశ్ దయాల్‌పై వేటు వేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వ్యవహారంపై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ అతన్ని జట్టుకు దూరంగా ఉంచారనే విషయం మాత్రం స్పష్టమవుతోంది. అప్‌కమింగ్ ఐపీఎల్ 2026 సీజన్‌కు ఇంకా వారం రోజుల సమయం మాత్రమే ఉండగా.. యశ్ దయాల్ ఇంకా ఆర్‌సీబీ ప్రాక్టీస్ క్యాంప్‌లో పాల్గొనలేదు. టీమ్ బస్సుపై కూడా యశ్ దయాల్ మినహా జట్టులోని ఆటగాళ్లందరి ఫొటోలు ఉండటం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనపై ఐదేళ్లుగా అత్యాచారం చేస్తున్నాడని ఓ యువతి యశ్ దయాల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసు విషయం వెలుగులోకి వచ్చిన కొద్ది రోజులకే మరో అమ్మాయి కూడా తనను అత్యాచారం చేశాడని పోలీసులను ఆశ్రయించింది. ఆమె వయసు 17 ఏళ్లే కావడంతో పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల నేపథ్యంలోనే యశ్ దయాల్‌పై ఆర్‌సీబీ వేటు వేసినట్లు అర్థమవుతుంది. అతని స్థానంలో ఉమేశ్ యాదవ్‌ను తీసుకోవాలని టీమ్‌మేనేజ్‌మెంట్ ఆలోచిస్తున్నట్లు జాతీయ మీడియా పేర్కొంది. అయితే అతనికి కొన్ని ఫిట్‌నెస్ సమస్యలు ఉన్నాయని, దాంతోనే యశ్ దయాల్‌కు ప్రత్యామ్నాయ ప్లేయర్ ఎవరా? అనేది ఆర్‌సీబీ తేల్చుకోలేకపోతుందంట. అత్యాచారం కేసులో అరెస్టు అయి బెయిల్‌పై బయటకు వచ్చిన యశ్ దయాల్.. గత నెల సీక్రెట్‌గా పెళ్లి చేసుకున్నాడు. ఫిబ్రవరి 4న నోయిడాలో పెళ్లి చేసుకున్నట్టు వార్తలు వచ్చాయి. వధూవరుల కుటుంబ సభ్యులతో పాటు అతి కొద్ది మంది బంధుమిత్రులు మాత్రమే ఈ పెళ్లికి హాజరయ్యారు. యశ్ దయాల్ పెళ్లికి క్రికెటర్లు ఎవ్వరూ హాజరుకాలేదు. యశ్ దయాల్.. తన పెళ్లి గురించి ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ అతని భార్య శ్వేతా పుందిర్ ఇన్‌స్టా రీల్ ద్వారా తమ పెళ్లి విసయాన్ని బయటపెట్టింది. సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్ అయిన శ్వేతా పుందిర్‌కి ఇన్‌స్టాగ్రామ్‌లో సుమారు 6 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. అలాగే ఇంటర్నేషనల్ లెజెండ్స్ లీగ్‌లో బ్రాడ్ కాస్టర్‌గా కూడా ఆమె వ్యవహరించింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆర్‌సీబీ విజేతగా నిలవడంలో యశ్ దయాల్ 13 వికెట్లతో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్ 2023 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున బరిలోకి దిగిన యశ్ దయాల్.. రింకూ సింగ్ ధాటికి వరుసగా ఒకే ఓవర్‌లో 5 సిక్సర్లు సమర్పించుకున్నాడు. ఈ మ్యాచ్ తర్వాత తీవ్ర డిప్రెషన్‌కు గురైన యశ్ దయాల్ కొన్నాళ్లు ఆటకు దూరంగా ఉన్నాడు.ఐపీఎల్ 2024 సీజన్‌లో యశ్ దయాల్‌ను ఆర్‌సీబీ రూ.3.2 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేయగా.. అతను 15 వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. దాంతో ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు రూ.5 కోట్లకు యశ్ దయాల్‌ను రిటైన్ చేసుకుంది. ఆట పరంగా యశ్ దయాల్ తిరుగులేదు. కానీ అనవసర కేసులతో తన కెరీర్‌ను నాశనం చేసుకున్నాడని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.



## ఉప్పల్‌లో అభిషేక్ శర్మ ఊచకోత!

### సీజన్ ప్రారంభానికి ముందే సిక్సర్ల వర్షం

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే సన్‌రైజర్స్ హైదరాబాద్ వైస్ కెప్టెన్, విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా శనివారం జరిగిన ఇంట్రా స్క్వాడ్ ప్రాక్టీస్ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ 42 బంతుల్లో 94 పరుగులు చేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో కలిసిన అభిషేక్ శర్మ.. శనివారం సాయంత్రం నిర్వహించిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్–ఏ తరఫున బరిలోకి దిగాడు. తొలి బంతి నుంచే దూకుడుగా ఆడిన అభిషేక్ శర్మ 42 బంతుల్లో 94 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అభిషేక్ శర్మతో పాటు హెన్రీచ్ క్లాసెన్(31 బంతుల్లో 49), సలిల్ అరోరా (16 బంతుల్లో 47)రాణించారు. కెప్టెన్ ఇషాన్ కిషన్ మాత్రం 15 బంతుల్లో 18 పరుగులు చేసి వెనుదిరిగాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ –ఏ టీమ్ 9 వికెట్లకు 253 పరుగుల భారీ స్కోర్ చేసింది. సన్‌రైజర్స్–బీ బౌలర్లలో జయదేవ్ ఉనాద్కత్ (5/48) ఐదు వికెట్లతో సత్తా చాటగా.. నితీష్ రెడ్డి(3/32) మూడు వికెట్లు తీసాడు. బ్రైడన్ కార్స్‌కు ఒక వికెట్ దక్కింది. సన్‌రైజర్స్ –బీ టీమ్ తరఫున కూడా అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌లు ఓపెనర్లుగా బరిలోకి దిగారు. హర్షల్ పటేల్ బౌలింగ్‌లో ఇషాన్ కిషన్ 10 పరుగులే చేసి నితీష్ కుమార్ రెడ్డికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. రెండోసారి బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ నిరాశపర్చాడు. రెండు భారీ సిక్స్‌లు బాది ప్రఫుల్ హింగే బౌలింగ్‌లో కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. మార్చి 28న డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. మోకాలి గాయంతో ఆరంభ మ్యాచ్‌లకు ప్యాట్ కమిన్స్ దూరమయ్యాడు. దాంతో ఇషాన్ కిషన్‌కు తాత్కలిక కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు.




## సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు భారీ ఎదురుదెబ్బ

### విదేశీ ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ దూరం

ఈ మార్చి 28న ఐపీఎల్ 2026 ప్రారంభం కానుంది. ఈ క్రమంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. విదేశీ ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ ఐపీఎల్ 2026 సీజన్ నుంచి తప్పుకున్నాడు. గాయం కారణంగా జాక్ ఈ ఐపీఎల్ సీజన్ మొత్తం దూరంగా ఉండబోతున్నాడు. ఇప్పటికే వెన్ను నొప్పి కారణంగా పాట్ కమిన్స్ కొన్ని మ్యాచులకు దూరంగా ఉండనున్న సంగతి తెలిసిందే. అయితే.. గాయం కారణంగా జాక్ ఈ సీజన్ మొత్తం దూరం కావాల్సి వచ్చింది. ఈ సీజన్‌లో హైదరాబాద్ శిబిరంలో గాయపడిన రెండవ క్రికెటర్‌గా ఎడ్వర్డ్స్ నిలిచాడు. కెప్టెన్ కమిన్స్ ఇప్పుడిప్పుడే వెన్నునొప్పి నుంచి కోలుకుంటున్నాడు. ఈ సీజన్‌లోని మొదటి కొన్ని మ్యాచ్‌లకు కమిన్స్ దూరంగా ఉండనున్నాడు. దీంతో ఇషాన్ కిషన్ జట్టుకు నాయకత్వం వహించనుండగా, అభిషేక్ శర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇదిలా ఉండగా.. మార్చి 19న ముగ్గురు క్రికెటర్లు ఈ సీజన్ నుంచి వైదొలిగారు. ఈ జాబితాలో చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాడు నాథన్ ఎల్లిస్, రాజస్థాన్ రాయల్స్ నుంచి సామ్ కర్రన్ ఉన్నారు. పంజాబ్ కింగ్స్ కొనుగోలు చేసిన లాకీ ఫెర్గూసన్ సైతం కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో ఈ సీజన్‌కు దురమయ్యాడు. పోటీ నుంచి ఎల్లిస్ నిష్క్రమణను సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ ఇప్పటికే ధృవీకరించారు. అతని స్థానంలో మరొకరి కోసం ఫ్రాంచైజీ ప్రస్తుతం అన్వేషిస్తోందని పేర్కొన్నారు. ఒట్నీల్ బార్ట్‌మన్ పాకిస్థాన్ సూపర్ లీగ్ ఒప్పందం నుంచి వైదొలగడానికి సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అతడిని తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ ప్రస్తుతం ఒక విదేశీ ఆల్ రౌండర్ కోసం అన్వేషిస్తున్నాయి. హైదరాబాద్ ఓ విదేశీ పేసర్‌ను తీసుకుంటుందనే వార్తలు వస్తున్నాయి.



# విశ్వజ



## ఫేస్ ప్యాక్ లు, హెయిర్ ఆయిల్స్ ఏమీ అక్కర్లేదు..జస్ట్ ఇది తింటే దట్టమైన జుట్టు, మెరిసే చర్మం

ఆరోగ్యవంతమైన జుట్టు, అందమైన చర్మం ప్రతీ ఒక్కరి కల. ఈ కలను నిజం చేయడానికి కొందరు అయితే చేయని ప్రయత్నం ఉండదు. రకరకాల క్రీమ్స్, ఆయిల్స్, షాంపూలు, సీరమ్స్,మార్కెట్లో ఏది కొత్తగా వచ్చినా వెంటనే కొనేసి ప్రయత్నించేస్తుంటారు. కొన్నిసార్లు ఫలితం ఉంటుంది, మరికొన్నిసార్లు నిరాశే మిగులుతుంది. అయితే మీ అందాన్ని రెట్టింపు చేసే అద్భుతమైన పరిష్కారం మీ వంటగదిలోనే దాగి ఉందని మీకు తెలుసా? ఎలాంటి దుష్ప్రభావాలు, రసాయనాల బెడద లేని ఒక సహజసిద్ధమైన ఫుడ్ మీ చర్మాన్ని, జుట్టును లోపలి నుండి పోషించి, ఆరోగ్యంగా మారుస్తుంది. పోషకాహార నిపుణురాలు సిమ్రాన్ చోప్రా తన ఇన్ స్టాగ్రామ్ అకౌంట్ లో షేర్ చేసిన ఓ వీడియోలో..జుట్టు, చర్మ ఆరోగ్యానికి సామయపడే ఆరోగ్యకరమైన స్నాక్ గురించి తెలియజేశారు. అదే ఫైనాఫిల్ రైతా. పెరుగు, పైనాపిల్ కలయికతో చేసే పైనాపిల్ రైతా.. మన చర్మ, కేశ సౌందర్యానికి అవసరమైన పోషకాలను అందించి, వాటిని ఆరోగ్యంగా, కాంతివంతంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది కేవలం ఆరోగ్యకరమైనదే కాదు, తినడానికి కూడా ఎంతో రుచిగా ఉంటుంది. పైనాపిల్ రైతా స్కిన్, హెయిర్ కి ఎలా మేలు చేస్తుంది? ఫైనాఫిల్ ఇలా పైనాపిల్‌లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఈ విటమిన్ సి మన శరీరంలో 'కొల్లాజెన్' అనే ప్రొటీన్ ఉత్పత్తికి అత్యంత అవసరం. కొల్లాజెన్ అంటే మన చర్మానికి ఒక ఆధారం లాంటిది. ఇది చర్మాన్ని బిగుతుగా, మృదువుగా ఉంచుతుంది, ముడతలు రాకుండా కాపాడుతుంది. వయసు పెరిగే కొద్దీ తగ్గే కొల్లాజెన్ ఉత్పత్తిని పైనాపిల్ ప్రేరేపిస్తుంది. అంతేకాకుండా కొల్లాజెన్ జుట్టు కుదుళ్లను బలపరిచి, జుట్టు రాలడాన్ని తగ్గించి ఒత్తుగా పెరిగేలా చేస్తుంది. జుట్టుకు మెరుపునిస్తుంది. పైనాపిల్ లో ఉండే బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఒక శక్తివంతమైన యాంటీ ఇన్ ఫ్లమేటరీ (వాపును తగ్గించే) ఏజెంట్ గా పనిచేస్తుంది. ఇది చర్మంపై మంట, ఎరుపుదనం, మొటిమల వల్ల కలిగే వాపును తగ్గిస్తుంది. చనిపోయిన చర్మ కణాలను తొలగించి చర్మాన్ని శుభ్రంగా, మచ్చలు లేకుండా, కాంతివంతంగా మార్చడంలో సహాయపడుతుంది. పెరుగు అలా ఇంట్లో తయారుచేసిన పులియని పెరుగు ఒక అద్భుతమైన ప్రోబయోటిక్. మన జీర్ణవ్యవస్థకు మేలు చేసే మంచి బ్యాక్టీరియా ఇందులో ఉంటుంది. చాలా చర్మ, జుట్టు సమస్యలకు మూలం మన కడుపులోని అసమతుల్యతే. జీర్ణవ్యవస్థ సరిగ్గా లేకపోతే పోషకాలు సరిగా అందవు, వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇది మొటిమలు, చర్మం నిర్జీవంగా మారడం, జుట్టు రాలడం వంటి సమస్యలకు దారితీస్తుంది. పెరుగులోని ప్రోబయోటిక్స్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచి ఈ సమస్యల నుండి మనల్ని కాపాడతాయి. కడుపు చల్లగా ఉంటే చర్మం కూడా ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉంటుంది. పెరుగులో ప్రోటీన్, విటమిన్ బి కాంప్లెక్స్ సమృద్ధిగా ఉంటాయి. ప్రోటీన్ చర్మ కణాల మరమ్మత్తుకు, కొత్త కణాల ఉత్పత్తికి అవసరం. ఇది జుట్టు కుదుళ్లను బలపరిచి, జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. విటమిన్లు చర్మానికి తేమను అందించి, ఆరోగ్యంగా ఉంచుతాయి. జుట్టుకు మెరుపునిచ్చి, చిట్లడాన్ని తగ్గిస్తాయి.

## బొప్పాయి గింజలతో ఇన్ని లాభాలా..?



బొప్పాయి పండు తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. శరీరానికి శక్తిని కూడా ఇస్తుంది. అయితే, బొప్పాయి పండు విత్తనాలను మనం చెత్తగా భావించి పడేస్తాము. కానీ, ఈ విత్తనాల ద్వారా ఎన్నో లాభాలు ఉన్నాయి. ఈ నల్లటి బొప్పాయి గింజలు బరువు తగ్గడంలో ఎంతో సహాయపడతాయి. పోషకాలతో సమృద్ధిగా ఉన్న ఈ విత్తనాలు అనేక తీవ్రమైన వ్యాధులతో పోరాడే శక్తిని కలిగి ఉంటాయి. కాగా, బొప్పాయి గింజలు ఎలాంటి సమస్యలలో పని చేస్తాయో మనం ఇప్పుడు తెలుసుకుందాం. తరచుగా అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు ఉంటే బొప్పాయి గింజలు ఒక వరంలా పనిచేస్తాయి. ఇందులో 'పపైన్' అనే ఎంజైమ్ ఉంటుంది. కావున ఈ పండు విత్తనాలు ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడంలో, ఆహారాన్ని బాగా జీర్ణం చేయడంలో ఎంతో సహాయపడుతుంది. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. అంతేకాకుండా కడుపు సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది. నేటి కాలంలో మనం తీసుకునే ఆహారం, జీవనశైలి కాలేయంపై చెడు ప్రభావాన్ని చూపుతాయి. అయితే బొప్పాయి గింజలు కాలేయాన్ని క్లీన్ చేసి ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతో సహాయపడతాయి. ఈ పండు గింజలు కాలేయాన్ని దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్ నుండి కాపాడుతాయి. అంతేకాకుండా కాలేయ సిర్రోసిస్ వంటి తీవ్రమైన సమస్యలలో కూడా ఈ పండి విత్తనాలు సహాయపడతాయి. మన మూత్రపిండాలు మన శరీరం నుండి వ్యర్థ పదార్థాలను తొలగించడానికి పనిచేస్తాయి. బొప్పాయి గింజలు మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా సహాయపడతాయి. ఈ బొప్పాయి పండు గింజలు మూత్రపిండాలను క్లీన్ చేయడంలో, దాని పనితీరును మెరుగుపరచడంలో ఎంతో సహాయపడతాయి.

### బొప్పాయి గింజలను ఆహారంలో ఎలా చేర్చుకోవాలి?

బొప్పాయి గింజలు కొద్దిగా చేదుగా ఉంటాయి. కావున వాటిని ఎండబెట్టి పొడిగా చేసి సలాడ్లు లేదా గంజిలో కలిపి తీసుకోవచ్చు. ప్రారంభం దశలో ఈ పొడిని తక్కువ పరిమాణంలో తీసుకోవడం మంచిది. తర్వాత నెమ్మదిగా పెంచుతూ పోతే సరిపోతుంది.

## పిగ్మెంటేషన్‌కు చెక్!



యువతులను ఎక్కువగా వేధించే సమస్య.. పిగ్మెంటేషన్. బుగ్గలు, నుదురుపై ఏర్పడే ఈ నల్లటి మచ్చలు.. అమ్మాయిల ముఖ వర్చస్సును దెబ్బతీస్తాయి. వీటిని పోగొట్టుకునేందుకు రకరకాల క్రీములు వాడుతుంటారు. అయితే, ఇంట్లో దొరికే పదార్థాలతోనే.. ఈ సమస్యకు చెక్ పెట్టొచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. ఒక గిన్నెలో రెండు టేబుల్‌స్పూన్ల ఓట్‌మీల్, ఒక టేబుల్‌స్పూన్ పెరుగు, అర టేబుల్‌స్పూన్ టమాటా రసం వేసి.. బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని నల్లని మచ్చలపై రాసి.. 15-20 నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. టమాటాలో ఉండే సహజసిద్ధమైన బ్లీచింగ్ గుణాలు.. చర్మాన్ని శుభ్రపరుస్తాయి. ఓట్‌మీల్.. ఎక్స్‌ఫోలియేటింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తుంది. ఇక పెరుగు.. ముఖాన్ని మృదువుగా చేస్తుంది. కలబంద గుజ్జు, తేనె.. ఒక్కో టేబుల్‌స్పూన్ తీసుకోవాలి. ఇందులో రెండు టేబుల్‌స్పూన్ల బొప్పడి గుజ్జు వేసి.. ప్యాక్‌లాగా చేసుకోవాలి. దీన్ని పిగ్మెంటేషన్ ఉన్న చోట రాసి అరగంటపాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత కడిగేసుకోవాలి. కలబందలోని సుగుణాలు.. చర్మంలో కొలాజెన్ స్థాయులను పెంచుతాయి. ముఖాన్ని మెరిపిస్తాయి. ఇక ముఖంపై మచ్చలను తొలగించడంలో తేనె సమర్థంగా పనిచేస్తుంది. బొప్పడిలో ఉండే పపైన్ అనే ఎంజైమ్.. చర్మంపైన నల్లని మచ్చలు, మొటిమలను తగ్గిస్తుంది. గుప్పెడు పుదీనా ఆకులను మెత్తటి పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని పిగ్మెంటేషన్ ఉన్న ప్రాంతాల్లో అప్లయి చేసి.. 10-15 నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. చర్మానికి రక్త ప్రసరణను మెరుగుపరచడంలో పుదీనా సాయపడుతుంది. సోయాపాలు, నిమ్మరసం, టమాటా గుజ్జు ఒక టేబుల్‌స్పూన్ చొప్పున తీసుకొని.. మెత్తటి పేస్ట్‌గా చేసుకోవాలి. నల్లని మచ్చలమీద ఈ మిశ్రమాన్ని అప్లయి చేసి.. పది నిమిషాలపాటు సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. ఆ తర్వాత 10-15 నిమిషాలు బాగా ఆరనిచ్చి.. చల్లటి నీళ్లతో కడిగేసుకుంటే సరి. టమాటాలో ఉండే లైకోపీన్ వంటి యాంటి ఆక్సిడెంట్లు.. చర్మాన్ని యూవీ కిరణాల నుంచి రక్షిస్తాయి. చర్మ ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి.ఆరెంజ్ తొక్కలను ఎండబెట్టి.. పొడిగా చేసుకోవాలి. అందులో కొద్దిగా పచ్చిపాలు కలిపి మెత్తని పేస్ట్‌గా తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పిగ్మెంటేషన్ ఉన్నచోట అప్లయి చేసుకొని.. ఇరవై నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఆరెంజ్‌లో ఉండే విటమిన్ సి, యాంటి ఆక్సిడెంట్లు.. చర్మాన్ని కాంతిమంతంగా మారుస్తాయి.

# మార్కెట్

## టాటా హారియర్ ఈవీ వచ్చేసిందోచ్

### ప్రారంభ ధర రూ.21.49 లక్షలు
### సింగిల్ చార్జింగ్‌తో 627 కిలోమీటర్లు

న్యూఢిల్లీ : దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ సరికొత్త ఈవీ మాడల్‌ను మార్కెట్‌కు పరిచయం చేసింది. ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా సంస్థ నూతన హారియర్ ఈవీను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది మొదట్లో న్యూఢిల్లీలో జరిగిన ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించిన ఈ మాడల్ ఆరు నెలల తర్వాత ప్రవేశపెట్టింది. ఈ కారు ప్రారంభ ధర రూ.21.49 లక్షలు. 75 కిలోవాట్ల బ్యాటరీ, 65 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 627 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 6.3 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 200 కిలోమీటర్లకు పైగా వేగంతో దూసుకుపోనున్నది. పనోరమిక్ సన్‌రూఫ్, 14.5 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, డ్యూయల్-జోన్ ట్లైమెట్ కంట్రోల్ సిస్టమ్, 360 డిగ్రీల కెమెరా, 12.25 ఇంచుల పూర్తిస్థాయిలో కలర్ టచ్‌స్క్రీన్, లెవల్ 2 అడాస్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నా యి. ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ బుకింగ్‌ను ఇప్పటికే ప్రారంభించింది. బ్యాటరీ ప్యాక్‌పై జీవితకాలం వ్యారెంటీ కల్పిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం నెలకు 25 వేల యూనిట్లు అమ్ముడవుతున్న ప్రీమియం ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో ఈ వాహనంతో మరింత పెరిగే అవకాశం ఉన్నదని టాటా మోటర్స్ ప్యాసింజర్ వాహన ఎండీ శైలేష్ చంద్ర తెలిపారు.



## స్టీల్, అల్యూమినియంపై 50 శాతం సుంకాలు..



### ఉత్తర్వులపై సంతకాలు చేసిన ట్రంప్

రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరతీసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే స్టీల్, అల్యూమినియంపై దిగుమతి సుంకాన్ని 25 శాతం నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు ఇటీవలే ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులపై ట్రంప్ తాజాగా సంతకాలు చేశారు. టారిఫ్‌లు అమెరికా కాలమానం ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున 12:01 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. యూకేతో వాణిజ్య ఒప్పందం అమలులో ఉన్న నేపథ్యంలో వారికి మాత్రం టారిఫ్‌లు 25 శాతంగానే ఉండనున్నాయి. కాగా, స్టీల్, అల్యూమినియంపై దిగుమతి సుంకాన్ని 25 శాతం నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు ట్రంప్ గత వారం ప్రకటించిన విషయం తెలిసిందే. స్వదేశీ స్టీల్ పరిశ్రమను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తమ ప్రభుత్వం నిర్ణయం వల్ల స్థానిక స్టీల్ పరిశ్రమకు ఊతం వస్తుందని, జాతీయ సరఫరా పెరుగుతుందని, దీంతో చైనాపై ఆధారపడే సందర్భాలు తగ్గుతాయని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా స్టీల్ పరిశ్రమ అభివృద్ధి కోసం 14 బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు చెప్పారు. జపాన్‌కు చెందిన నిప్పాన్ స్టీల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే ఆ డీల్‌కు చెందిన తుది నిర్ణయం ఇంకా తీసుకోవాల్సి ఉందన్నారు. స్టీల్ పరిశ్రమలో ఇక నుంచి ఉద్యోగులు తీసివేత ఉండదని, ఔట్ సోర్సింగ్ కూడా ఉండదన్నారు. ప్రతి స్టీల్ పరిశ్రమ కార్మికుడికి 5 వేల డాలర్ల బోనస్ అదనంగా వస్తుందని పెన్సిల్వేనియాలోని పిట్స్‌బర్గ్‌లో జరిగిన ర్యాలీలో ట్రంప్ చెప్పుకొచ్చారు.

## విద్యా రుణాలపై వడ్డీరేటు తగ్గించిన పీఎన్‌బీ

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ).. విద్యాలక్ష్మి స్కీం కింద విద్యా రుణాలు తీసుకునేవారికి వడ్డీరేటును 20 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు మంగళవారం ప్రకటించింది. విద్యా రుణాలు తీసుకునేవారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో బ్యాంక్ ఈ ప్రత్యేక స్కీంను తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా 860కి పైగా ఉన్నత ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు రుణాలు ఇవ్వనున్నట్లు బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. 7.5 శాతం వార్షిక వడ్డీతో విద్యా రుణాలు మంజూరు చేస్తున్నది.



# ఆంధ్రప్రదేశ్

## తిరుమలలో ఆహార పరీక్షా కేంద్రం

### ఫుడ్ ల్యాబ్‌ను ప్రారంభించిన చంద్రబాబు

తిరుమల,మార్చి21 : తిరుమలలోని పిండి మర ప్రాంతంలో నూతనంగా నిర్మించిన 'వాటర్ అండ్ ఫుడ్ అనాలసిస్ ల్యాబ్' ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో టీటీడీ ఈ ల్యాబ్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది. సుమారు రూ.25 కోట్ల ఖర్చుతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దీనిని తీర్చిదిద్దారు. సుమారు 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, రెండు అంతస్తుల్లో ఈ ల్యాబ్‌ను నిర్మించారు. ల్యాబ్‌లో సుమారు 50 రకాల అత్యాధునిక యంత్రాలను అమర్చారు, ఇవి ఆహార పదార్థాల్లోని అతి సూక్ష్మమైన లోపాలు కూడా గుర్తించగలవు. భక్తులకు అందించే అన్నప్రసాదాలు , లడ్డూ ప్రసాదాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, టీటీడీ చైర్మన్, ఈవోతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భక్తుల భద్రత, సౌకర్యాల పర్యవేక్షణ కోసం తిరుమలలో ఏర్పాటు చేసిన 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్' ప్రాధాన్యతను సీఎం వివరించారు. పారిశుద్ధ్యం నుంచి భద్రత వరకు ప్రతి అంశాన్ని ఈ వ్యవస్థ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటమే తమ లక్ష్యం అని స్పష్టం చేశారు.

## హర్మూజ్ జలసంధిని తెరవండి

### ఇరాన్‌కు 22 దేశాలు విజ్ఞప్తి

న్యూఢిల్లీ,మార్చి21 : హర్మూజ్ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు 22 దేశాలు విజ్ఞప్తి చేశాయి. దాడులు కూడా ఆపాలని కోరాయి. చమురు క్షేత్రాలు, వాణిజ్య నౌకలపై దాడులను ఖండించాయి. ఇరాన్ చర్యల వల్ల అన్ని దేశాలపై దుష్ప్రభావం పడుతోందని పేర్కొన్నాయి. ఈమేరకు యూఏఈ, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, డెన్మార్క్, బహ్రెయిన్ తదితర దేశాలు సంయుక్త ప్రకటన చేశాయి. గల్ఫ్‌లోని నిరాయుధ వాణిజ్య నౌకలు, చమురు, గ్యాస్ కేంద్రాలు సహా పౌర మౌలిక సదుపాయాలపై ఇటీవల ఇరాన్ జరిపిన దాడులు, హర్మూజ్ జలసంధిని మూసివేయడాన్ని ఖండిస్తున్నాం. సముద్ర చట్టాలకు సంబంధించి ఐరాస ఒప్పందంతో పాటు స్వేచ్ఛాయుత నౌకాయానం అనేది అంతర్జాతీయ చట్టంలో ఓ ప్రాథమిక సూత్రం. ఇరాన్ చర్యలు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల ప్రజలపై, ముఖ్యంగా అత్యంత బలహీన వర్గాలపై ప్రభావం పడుతోందని యూఏఈ విదేశాంగ శాఖ ఓ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఇందులో 22 దేశాలు సంతకాలు చేశాయి.

## ఇజ్రాయిల్ యుద్ధవిమానం కూల్చివేత

### ప్రకటించుకున్న ఇరాన్

టెహ్రాన్,మార్చి21 : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు అడ్డుకట్ట పడటం లేదు. తమ భూభాగంపై దాడికి దిగిన ఇజ్రాయెల్ యుద్ధ విమానాన్ని కూల్చేసినట్టు ఇరాన్ మిలిటరీ శనివారంనాడు ప్రకటించింది. దీనికి ఒకరోజు ముందే అమెరికా ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానాన్ని ఢీ కొట్టామని ఇరాన్ ప్రకటించుకుంది. ఇజ్రాయెల్ యుద్ధవిమానంపై దాడి జరిగినట్టు ఇజ్రాయెల్ కూడా గుర్తించిందని 'టెహ్రాన్ టైమ్స్' తెలిపింది. తమ యుద్ధవిమానాన్ని టా÷-గగ్గ÷ట్ చేస్తూ ఉపరితలం నుంచి గగనతలంపైకి క్షిపణిని ప్రయోగించారని ఇజ్రాయల్ మిలిటరీ పేర్కొంది. ఏ తరహా యుద్ధ విమానం అనేది మాత్రం వెల్లడించలేదు. కాగా, ఇరాన్ గగనతలంపై ఇజ్రాయెల్ విమానంపై క్షిపణి ప్రయోగం జరిగిందని, అయితే విమాన సిబ్బంది ప్రామాణిక విధానాలను అనుసరించడం ద్వారా ముప్పును తప్పించారని, ఎలాంటి నష్టం లేకుండా మిషన్‌ను పూర్తి చేశారని 'ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' పేర్కొంది. ఇరాన్ క్షిపణి అతి సమీపానికి రావడంతో పైలట్ వృత్తిపరమైన నైపుణ్యంతో అత్యంత వేగంగా స్పందించి దాడిని తప్పించినట్టు ఆ కథనం పేర్కొంది. విమానానికి నష్టం జరిగినట్టు ఎలాంటి సమాచారం లేదు. కాగా, ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై ఇటీవల దాడులు జరిపిన అమెరికా-ఇజ్రాయెల్ దళాలు శనివారంనాడు మరోసారి విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో ఎలాంటి రేడియోధార్మిక పదార్థాలు లీక్ అవ్వలేదని, పరిసర ప్రాంత నివాసితులకు ప్రమాదం వాటిల్లలేదని వార్తా సంస్థలు తెలిపాయి. ఈ దాడిని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయెల్ నేరపూరిత చర్యల్లో భాగంగానే ఈదాడి జరిపిందని, అణుభద్రతా నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలకు తూట్లు పొడిచిందని నిప్పులు చెరిగింది.

## మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి కన్నుమూత

అనంతపురం,మార్చి21 : అనంత జిల్లా కళ్యాణదుర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే ఉన్న హనుమంతరాయ చౌదరి కన్నుమూశారు.. ఆయన వయస్సు 81 సంవత్సరాలు.. శనివారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మార్క్ ఫెడ్ చైర్మన్ గా ఆయన ఆరేళ్ల పాటు పనిచేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పదేళ్ల పాటు పనిచేశారు. కళ్యాణదుర్గం మండలం గరుడాపురం పంచాయతీ వార్డు మెంబర్ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు ఎదిగారు. నెల రోజులుగా గుండే, శ్వాసకోశ సంబంధిత సమస్యతో ఇబ్బందులు పడుతూ.. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇవాళ తెల్లవారుజామున తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హనుమంతరాయ చౌదరి స్వగ్రామం కళ్యాణదుర్గం మండలం ఎర్రంపల్లిలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు ప్రకటించారు ..

## హిప్పో దాడిలో పశువైద్యురాలు మృతి

### ఘటనపై విచారం వ్యక్తం చేసిన మంత్రి

### ప్రభుత్వం తరఫున 30లక్షల పరిహారం ప్రకటన

బెంగళూరు,మార్చి21 : కర్ణాటకలో పెను విషాద ఘటన ఒకటి చోటుచేసుకుంది. హిప్పోపోటమస్ దాడిలో పశు వైద్యురాలు ప్రాణాలు కోల్పోయింది. గర్భంతో ఉన్న హిప్పోను చెక్ చేయడానికి వెళ్లిన సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బెంగళూరుకు చెందిన 27 ఏళ్ల సమీక్షా రెడ్డి త్యావరకొప్ప టైగర్, లయన్ సఫారీలో కాంట్రాక్ట్ బేసిస్ కింద పశువైద్యురాలిగా సేవలు అందిస్తోంది. గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో ఆమె జూలోని సన్ కాపర్ పక్షికి చికిత్స చేయడానికి వెళ్లింది. పక్షికి చికిత్స పూర్తయిన తర్వాత గర్భంతో ఉన్న హిప్పో టెంపరేచర్ చేయడానికి ఎన్‌క్లోజర్‌లోకి వెళ్లింది. ఈ నేపథ్యంలోనే ఆ హిప్పో ఆమెపై దాడి చేసింది. తలతో బలంగా సమీక్షారెడ్డిని కొట్టింది. దీంతో ఆమె ఊపిరితిత్తులు, లివర్ తీవ్రంగా దెబ్బతిన్నాయి.

# నక్కపల్లి వద్ద మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ

### 23న శంకుస్థాపన చేయనున్న సిఎం చంద్రబాబు

### కేంద్రమంత్రులు కుమారస్వామి, రామ్మోహన్ నాయుడు రాక

### రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టు నిర్మాణం



విశాఖపట్టణం,మార్చి21 : అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఏర్పాటు కానున్న ఉక్కు కర్మాగారం కోసం సోమవారం సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కుమారస్వామిలు శంకుస్థాపన చేయనున్నారు.ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రులతో కలిసి ఈనెల 23వ తేదీన భూమిపూజ చేయనున్నారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. ఇది రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద పారిశ్రామిక పెట్టుబడులలో ఒకటి. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నక్కపల్లి, పాయకరావుపేట, చుట్టుపక్కల ప్రాంతాల యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఉక్కు కర్మాగారం వస్తే దానిపై ఆధారపడే వందలాది చిన్న తరహా పరిశ్రమలు చుట్టుపక్కల ఏర్పడతాయి. తద్వారా పరోక్ష ఉపాధి భారీగా పెరుగుతుంది. ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ సంస్థలు ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ సంస్థలు అత్యంత ఆధునికమైన, పర్యావరణహితమైన సాంకేతికతను ఇక్కడ ఉపయోగించనున్నాయి. గత 21 నెలలుగా ఏపీ ప్రభుత్వం చేపట్టిన పారిశ్రామిక విధానాలు, సులభతర వాణిజ్యం, వేగవంతమైన అనుమతుల వల్లే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కింది. విశాఖపట్నం పోర్టుకు సమీపంలో ఉండటంతో ముడిసరుకు రవాణా , ఎగుమతులకు ఈ ప్రాంతం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ప్రాజెక్టు ఒక ఫ్యాక్టరీ మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్‌ను 'భారతదేశ ఉక్కు రాజధాని'గా మార్చే దిశగా వేసిన బలమైన అడుగని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇలా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో గొప్ప ముందడుగు పడింది. ఏపీ పారిశ్రామిక ప్రస్థానంలో ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ ఇండియా ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలవబోతుంది. గత 21 నెలల కూటమి ప్రభుత్వ కృషితో ఈ భారీ ప్రాజెక్టు సాకారం కాబోతోంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఏర్పాటు కానున్న ఈ ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్ర రూపురేఖలను మార్చేయనుంది.

## జగన్ హయాంలో ఆర్థికంగా రాష్ట్రం దివాళా

### అరసవిల్లి అభివృద్ధి పనులకు రామ్మోహన్ శ్రీకారం

శ్రీకాకుళం,మార్చి21 : జగన్ హయాంలో ఏపీ ఆర్థికంగా చాలా నష్టపోయిందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో జరిగిన పొరపాట్లను తమ ప్రభుత్వంలో సరిచేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై రామ్మోహన్ నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.4 కోట్లతో ఇంద్రపుష్కరిణి పున:నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. అరసవల్లి ఆలయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. అరసవల్లి ఆలయంలో రూ.4 కోట్లతో మాస్టర్ ప్లాన్‌లో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టామని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. రథసప్తమి వేడుకలు రాష్ట్ర పండుగగా నిర్వహించామని చెప్పుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రసాదం స్కీమ్‌లో అరసవల్లి నిధులు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని తెలిపారు. రూ.4 కోట్లతో పుష్కరిణి అభివృద్ధికి చర్యలు చేపట్టామని అన్నారు. భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టామని వివరించారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్గిల్ పార్క్ అత్యున్నత ప్రమాణాలతో రూపుదిద్దుకుందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## ఆధ్యాత్మిక కేంద్రాలుగా టిటిడి ఆలయాలు

### తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లకుండా కఠిన చర్యలు

### కాలుష్య రహితంగా తిరుమల క్షేత్రం అభివృద్ధి

### అధజకారులకు సిఎం చంద్రబాబు సూచనలు

తిరుమల,మార్చి21 : తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని ఆలయాలను అత్యంత అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు టిటిడి బోర్డు సభ్యులకు సూచించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు అత్యాధునిక సీసీ కెమెరాలు, ఫేస్ రికగ్నిషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తిరుమలలో ఇప్పటికే ఈ వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. తిరుమలలో భవిష్యత్తులోనూ కాలుష్యానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.తిరుమలలో పర్యటించిన సీఎం.. శనివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బోర్డు సభ్యులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నారు. ముందస్తుగానే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి శ్రీవారి దర్శనం పూర్తి చేసుకొని తిరుగుప్రయాణం అయ్యే వరకు వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. మరిన్ని ఆలయాల నిర్మాణం ద్వారా భక్తి భావాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం పేర్కొన్నారు. అన్నదానం, ప్రాణదాన టస్టు సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, ప్రాణదానం ట్రస్టు సేవలను విస్తరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఎం సూచించారు. శ్రీవారి సేవలో పాల్గొనే సేవకులకు వారి నైపుణ్యానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి, వారి సేవలను తితిదే పరిధిలోని అన్ని ఆలయాల్లో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తితిదేలో అమలు చేస్తున్న విధానాలు దేశంలోని ఇతర ఆలయాలకు మార్గదర్శకాలుగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా క్యూలైన్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలన్నారు.

## ఇరాన్ ముడి చమురుపై ఆంక్షలు ఎత్తివేత

న్యూఢిల్లీ,మార్చి21 : ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో అమెరికా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. రష్యా ముడి చమురుపై అమెరికా ఇప్పటికే సడలింపులు ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురుపై కూడా ఆంక్షలు ఎత్తేస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆ చమురును భారత్ సహా ఇతర ఆసియా దేశాల రిఫైనరీలు కొనుగోలు చేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు అంతర్జాతీయ వార్తా సంస్థ ఓ కథనంలో పేర్కొంది .ఇరాన్‌కు చెందిన 170 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు, యుద్ధం ప్రారంభమయ్యే నాటికి సముద్రంలో ఉంది. యుద్ధం మొదలు కావడంతో అది సముద్రంలోనే నిలిచిపోయింది. ఈ చమురును సరఫరాలోకి తీసుకొచ్చే క్రమంలో అమెరికా ఉపశమన చర్యలు ప్రారంభించింది. మార్చి 20 లేదా అంతకు ముందు నౌకల్లోకి లోడ్ చేసి, ఏప్రిల్ 19 నాటికి డిశ్చార్జ్ కావాల్సిన ముడి చమురుకు 30 రోజుల సడలింపు ఇస్తున్నట్టు అమెరికా ఆర్థిక శాఖ మంత్రి బెసెంట్ ఓ ప్రకటన చేశారు. ఆ ముడి చమురుకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలు, చెల్లింపుల విషయంలో అమెరికా నుంచి స్పష్టత కోసం ఆసియా దేశాలకు చెందిన పలు రిఫైనరీలు వేచి చూస్తున్నట్టు సమాచారం .రష్యాకు చెందిన 130 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును కొనుగోలు చేసేందుకు కూడా అమెరికా సడలింపులు ఇచ్చిన సంగతి తెలిసింది. రష్యా ముడిచమురుతో పాటు తాజాగా ఇరాన్ ముడి చమురు కూడా మార్కెట్‌లోకి వస్తే ఇంధన సంక్షోభం నుంచి కాస్త ఉపశమనం లభిస్తుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. కాగా, తమ వద్ద ముడి చమురు నిల్వలు లేవని ఇరాన్ ప్రకటించడం గమనార్హం.

## మొయినాబాద్ ఫామ్‌హౌజ్ సీజ్

### అసైన్డ్ భూమిలో రోహిత్ రెడ్డి ఫామ్‌హౌజ్

### రెవెన్యూ విచారణలో బాగోతం బట్టబయలు

హైదరాబాద్,మార్చి21 : మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్ హౌస్ వ్యవహారం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. అజీజ్ నగర్‌లోని సర్వే నెంబర్ 177/33 పరిధిలో ఉన్న సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫామ్ హౌస్ పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో కట్టినట్లు రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో నిర్ధారణ అయ్యింది. మొయినాబాద్ పోలీసులు ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డ్రగ్స్ పార్టీ నిర్వహించిన సమయంలో ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి హాజరైన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ ఫామ్‌హౌస్‌ను అసైన్డ్ భూమిలో నిర్మించినట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. 2006లో ఈ భూమి రోహిత్ రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ, భూభారతి రికార్డుల ప్రకారం అది జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అసలు ప్రభుత్వానికి చెందిన అసైన్డ్ భూమిపై రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందనే అంశంపై ప్రస్తుతం రెవెన్యూ , పోలీస్ యంత్రాంగం లోతుగా ఆరా తీస్తోంది. ఈ అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసిన రెవెన్యూ శాఖ, ఫామ్ హౌస్‌ను సీజ్ చేయాల్సిందిగా ఇప్పటికే అధికారులకు నివేదిక అందించింది. పోలీసుల విచారణలో భాగంగా ప్రస్తుతం ఈ ఫామ్ హౌస్ వారి కస్టడీలోనే ఉంది. అక్కడికి పార్టీ కోసం వచ్చిన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదు లగ్జరీ కార్లను సీజ్ చేసి, ఆ సమాచారాన్ని కోర్టుకు నివేదించారు. పార్టీకి హాజరైన వారు తమ వాహనాలను అక్కడే వదిలేసి వెళ్లడంతో పోలీసులు వాటిని సీజ్ చేసి విచారణను వేగవంతం చేశారు. త్వరలోనే ఈ ఫామ్ హౌస్ సీజ్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.

## కాకినాడ పోర్టులో చౌకబియ్యం పట్టివేత

### విదేశాలకు తరలిస్తుండగా అధికారుల దాడి

కాకినాడ,మార్చి21 : విదేశాలకు ఎగుమతి చేసేందుకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కాకినాడ యాంకరేజ్ పోర్టులో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి.. మొత్తం 5 లారీల్లోని 140 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ బియ్యం విలువ రూ.65 లక్షలు ఉంటుందని అంచనా. అయితే ఎవరు వీటిని సరఫరా చేస్తున్నది తెలియాల్సి ఉంది. గతంలో పేర్నినాని తరలించిన బియ్యం వ్యవహారం సద్దు మనగక ముందే మరోమారు పెద్ద ఎత్తున బియ్యం పట్టుబడడం విశేషం.

## కోతుల దాడిలో వృద్ధురాలు మృతి

కాకినాడ,మార్చి21 : కోతుల మూక దాడిలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో చోటు చేసుకుంది. గ్రామ శివారులో జీడిమామిడి తోటను ఆనుకుని ఉన్న ఇంట్లో దానబోయిన చిన్నబుల్లి (68) నివాసం ఉంటున్నారు. గేదెకు నీరు పెట్టేందుకు వెళ్లగా అక్కడ ఉన్న కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. 20కి పైగా కోతులు ఒక్కసారిగా మీదపడి దాడి చేయడంతో తప్పించుకునే వీలు లేకుండా పోయింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆమె.. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. చిన్నబుల్లి తనకు ఉన్న 3 ఎకరాల తోటలో తన కుమార్తె కుటుంబంతో కలిసి అక్కడే నివాసం ఉంటోంది. ఈ ప్రాంతంలో కోతుల దాడిలో గాయపడిన ఘటనలు చాలా జరిగాయని.. అయితే ప్రాణాలు కోల్పోవడం ఇదే మొదటిసారని గ్రామస్థులు వాపోయారు.

## జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

### 15 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు

ఆదిలాబాద్,మార్చి21 : జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుడిహత్నూర్ సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఓవర్‌టేక్ చేయబోయే క్రమంలో ముందున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనతో బస్సు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ముఖ్యంగా క్యాబిన్ భాగం పూర్తిగా దెబ్బతింది. బస్సు ఆదిలాబాద్ నుండి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం 15 మంది ప్రయాణికులు గాయపడినట్లు సమాచారం. ఘటన జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని బయటకు తీసి చికిత్స కోసం ఆదిలాబాద్ లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి ఓవర్‌టేకింగ్ కారణమని ప్రాథమికంగా పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## అసోంలో ఇక హిమంతకు ఉద్వాసనే

### కాంగ్రెస్ కూటమి గెలుస్తుందన్న గొగోయ్

గువాహటి,మార్చి21 : అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లలో పోటీ చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ తెలిపారు. ఐదు పార్టీలతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నట్టు చెప్పారు. బీజేపీ వ్యతిరేక ఓట్లలో చీలిక ఉండకపోవచ్చని, తద్వారా హిమంత బిశ్వ శర్మ సారథ్యంలోని ప్రభుత్వం అధికారం కోల్పోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అస్సాంలో మొత్తం 126 అసెంబ్లీ స్థానాలు ఉండగా, కాంగ్రెస్ ఇంతవరకూ 94 మంది అభ్యర్థులను ప్రకటించింది.'అస్సాంలోని ఆరు విపక్ష పార్టీలైన కాంగ్రెస్, అస్సాం జాతీయ పరిషత్, రైజోర్ దళ్, సీపీఎం, సీపీఐ (ఎంఎల్), ఆల్ పార్టీ హిల్ లీడర్స్ కాన్ఫరెన్స్ కలిసి పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ 100 మంది అభ్యర్థులను బరిలోకి దింపుతోంది. బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలే అవకాశం ఉండదనుకుంటున్నాం. హిమంత బిశ్వా శర్మ సారథ్యంలోని ప్రభుత్వం అధికారం కోల్పోతుందని ఆశాభావంతో ఉన్నాం' అని గొగోయ్ చెప్పారు.



# శంబాల దర్శకుడితో సందీప్ కిషన్ మూవీ

యువ కథానాయకుడు సందీప్ కిషన్ తన కెరీర్‌లో మరో మైలురాయి లాంటి ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. ఇటీవలే 'శంబాల' చిత్రంతో సూపర్ హిట్ అందుకుని ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన దర్శకుడు యుగంధర్ ముని ఇప్పుడు అదే స్థాయి భారీ కాన్సెప్ట్‌తో సందీప్ కిషన్‌ను వెండితెరపై ఆవిష్కరించబోతున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 3గా రూపొందుతున్న ఈ చిత్రం ఒక హై-వోల్టేజ్ ఫాంటసీ అడ్వెంచర్‌గా ప్రేక్షకులను అలరించనుంది. కొన్ని యుద్ధాలు ముగియవు.. కొంతమంది రాజులు మరణించరు అనే పవర్‌ఫుల్ మరియు ఇంట్రెస్టింగ్ ట్యాగ్‌లైన్‌తో విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, ఇది ఒక గొప్ప చారిత్రక లేదా పురాణ సంబంధిత నేపథ్యం ఉన్న ఎపిక్ సాగా అని స్పష్టమవుతోంది. రాజశేఖర్ అన్నభిమోజు మరియు మహిధర్ రెడ్డి సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో, భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సందీప్ కిషన్ కెరీర్‌లో 33వ చిత్రంగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్, ఆయన మునుపటి సినిమాల కంటే భిన్నమైన మేకోవర్‌లో ఉండబోతోందని సమాచారం. విజువల్ వండర్‌గా తీర్చిదిద్దనున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నద్ధమవుతోంది. వైవిధ్యమైన కథలను ఎంచుకోవడంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సందీప్ కిషన్, ఈ ఎపిక్ సాగాతో పాన్ ఇండియా స్థాయిలో తన మార్కెట్‌ను విస్తరించుకోనున్నారు.



# ఎఎ23పై భారీ అంచాలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ లీడ్ రోల్‌లో, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందనున్న భారీ ప్రాజెక్ట్ 'ఎఎ23'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అధికారిక ప్రకటన వచ్చినప్పటి నుంచే ఈ సినిమా ఇండియన్ సినీవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ప్రాజెక్ట్‌కు మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనుండగా, సంక్రాంతి సందర్భంగా విడుదల చేసిన స్పెషల్ వీడియోతో సినిమాపై హైప్ మరింత పెరిగింది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. బన్నీ వాస్‌తో పాటు నట్టి, శాండీ, స్వాతి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇక ఈ సినిమా క్యాస్టింగ్ విషయంలో ప్రస్తుతం పలు ఆసక్తికర వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే బాలీవుడ్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ పేరు ÷నైల్ అయిందని ప్రచారం జరుగుతుండగా, తాజాగా మరో స్టార్ హీరోయిన్ పేరు తెరపైకి వచ్చింది. బాలీవుడ్ నటి అనుష్క శర్మ కూడా ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్రలో కనిపించే అవకాశాలు ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ఈ వార్తలు పుకార్లుగానే ఉన్నప్పటికీ, అభిమానుల్లో మాత్రం ఆసక్తి పెరుగుతోంది. ఒకవేళ ఈ కాంబినేషన్ నిజమైతే, ఇది పాన్ ఇండియా స్థాయిలో మరింత క్రేజ్ తెచ్చే ప్రాజెక్ట్ అవుతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.




# పాతకాలపు ఆలోచనలు పక్కన పెట్టండి

కథకు ప్రాధాన్యతనిచ్చి, ఆ కథలో తన పాత్ర పరిధి ఎంత ఉన్నా.. నటించే జెన్యూన్ హీరోలు నేటికాలంలో లేరని నటి తాప్సీ అన్నారు. ఇటీవలే బాలీవుడ్‌లో హీరోల ఆధిపత్య ధోరణి, అభద్రతాభావంపై తాప్సీ హాట్ హాట్ కామెంట్లు చేశారు. ఇంకా మాట్లాడుతూ 'సినిమాలో తన పాత్ర కంటే హీరోయిన్ పాత్ర ఎక్కువగా ఉందంటే, చిన్నహీరోలు కూడా నటించడానికి వెనకడగు వేస్తున్నారు. కథ ఎంత గొప్పదైనా సరే.. హీరోయిన్ డామినేషన్‌ని మాత్రం వాళ్లు సహించలేరు. ఈ అభద్రతాభావం చాలామంది హీరోలకు ఉంది. తెరపై హీరోయిన్ హైలైట్ అయితే.. తన ఇమేజ్ దెబ్బతింటుందని వారి భావన. ఇలా అయితే.. మంచి కథలు ఎలా వస్తాయి?' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది తాప్సీ పన్ను. 'కేవలం తమ పాత్రలకు మాత్రమే ప్రాధాన్యత ఉండాలి, హీరోయిన్లు పాటలకు మాత్రమే పరిమితం కావాలనే పాతకాలపు ఆలోచనల నుంచి పరిశ్రమ బయటకు రావాలని, నిజాయితీగా కథను ప్రేమిం చే నటులు ఉంటే వైవిధ్యమైన సినిమాలు వస్తాయని తాప్సీ అభిప్రాయపడింది.

# నితిన్ మళ్లీ గాడిలో పడేనా?

టాలీవుడ్ హీరో నితిన్ ఒకప్పుడు వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న ఆయన, గత కొన్నేళ్లుగా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయారు. 'చెక్', 'రంగ్ దే', 'మ్యాస్ట్రో', 'మాచర్ల నియోజకవర్గం', 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' వంటి చిత్రాలు ప్రేక్షకులను నిరాశపరచగా, గతేడాది విడుదలైన 'తమ్ముడు', 'రాబిన్‌హుడ్' సినిమాలు కూడా డిజాస్టర్లుగా మారి ఆయన మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఈ పరిస్థితుల్లో రూట్ మార్చిన నితిన్, కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటూ సక్సెస్ ట్రాక్‌లోకి తిరిగి రావడానికి ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన టాలెంటెడ్ డైరెక్టర్ విఐ ఆనంద్ దర్శకత్వంలో ఒక భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో నటిస్తున్నారు.







# నాలుగు గంటల సినిమా.. దమ్ముండాల్సిందే

## దురంధర్ -2 మూవీ అద్భుతం అన్న రాజమౌళి

రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో దర్శకుడు ఆదిత్య ధార్ తెరకెక్కించిన 'ధురంధర్ 2: ద రివెంజ్' చిత్రంపై టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రశంసల వర్షం కురిపించారు. తాజాగా ఈ సినిమా చూసిన జక్కన్న ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. నాలుగు గంటల సినిమా తీయాలంటే దమ్ముండాలని పేర్కొన్నారు. ఈ చిత్రం మొదటి భాగం కంటే స్కేల్ మరియు ఎమోషన్ పరంగా అద్భుతంగా ఉందని, తనకు 'ధురంధర్ 1' అంటే చాలా ఇష్టమని కానీ సీక్వెల్ దానిని మించిపోయిందని ఆయన సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ముఖ్యంగా 4 గంటల సుదీర్ఘ నిడివి ఉన్నప్పటికీ, ప్రేక్షకులను సీటు నుంచి కదలకుండా చేయడంలో దర్శకుడు ఆదిత్య ధార్ విజయం సాధించారని, ఇది ఒక గొప్ప సాహసమని రాజమౌళి కొనియాడారు. రణవీర్ సింగ్ నటనను ప్రస్తావిస్తూ, షెడ్ లో చెల్లెలితో వచ్చే సన్నివేశం ఒక 'మాస్టర్‌క్లాస్ ఇన్ యాక్టింగ్' అని, హమ్జా మరియు జస్కీరత్ పాత్రల్లో ఆయన మెస్మరైజ్ చేశారని అభినందించారు. అలాగే ఆర్. మాధవన్ దేశం నిస్సహాయతను తన నటనతో అద్భుతంగా పండించారని రాజమౌళి ప్రశంసించారు.సినిమాలోని రైటింగ్, మ్యూజిక్, వరల్డ్ డిజైన్ వంటి సాంకేతిక అంశాలు కూడా అద్భుతంగా కుదిరాయని ఆయన వెల్లడించారు. మరోవైపు ఈ భారీ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ వద్ద కూడా సునామీ సృష్టిస్తోంది, కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.350 కోట్లకు పైగా వసూళ్లు సాధించి రికార్డులు తిరగరాస్తోంది.






# పెళ్లిపీటలు ఎక్కిన పునర్నవి

తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన నటి పునర్నవి భూపాలం తాజాగా వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. 'ఉయ్యాల జంపాల' సినిమాతో తెలుగు తెరపై అడుగుపెట్టిన ఈ భామ, తన అమాయకత్వం, సహజమైన నటనతో మొదటి చిత్రంతోనే మంచి గుర్తింపు సంపాదించింది. పల్లెటూరి అమ్మాయిగా కనిపించిన ఆమె పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుని, ఆమెను ఇండస్ట్రీకి పరిచయం చేసింది. ఆ తర్వాత పలు తెలుగు చిత్రాల్లో నటించినప్పటికీ, ఆశించిన స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో కొంతకాలం సినిమాలకు దూరమైంది. ఈ సమయంలోనే బుల్లితెరపై 'బిగ్ బాస్ తెలుగు'లో పాల్గొని మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఈ కార్యక్రమం ద్వారా ఆమెకు మంచి గుర్తింపు లభించడంతో పాటు అభిమాన వర్గం కూడా పెరిగింది. నిజానికి సినిమాల కంటే ఈ కార్యక్రమం ద్వారానే ఆమెకు ఎక్కువ ప్రాచుర్యం లభించింది. అయితే, వచ్చిన అవకాశాలను పక్కనపెట్టి విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు నిర్ణయించుకుంది పునర్నవి. లండన్‌లో చదువులు కొనసాగిస్తూ, పూర్తిగా తన విద్యపై దృష్టి పెట్టింది. అయినప్పటికీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండి అభిమానులతో తన అనుభవాలను పంచుకుంటూ ఉండేది. ఇటీవల డిసెంబర్ నెలలో తాను ప్రేమించిన వ్యక్తితో నిశ్చితార్థం జరిగినట్లు ప్రకటించి అందరికీ సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఈ వార్తతో ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. మార్చి 20న ఆమె తన ప్రియుడు హేమంత్ వర్మను వివాహం చేసుకుంది. హేమంత్ వర్మ ప్రముఖ ఫోటోగ్రాఫర్‌గా గుర్తింపు పొందిన వ్యక్తి. వీరిద్దరూ చాలా కాలంగా ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వివాహ వేడుకను చాలా సింపుల్‌గా, కుటుంబ సభ్యులు మరియు సన్నిహితుల మధ్య నిర్వహించారు. ప్రైవేట్‌గా జరిగిన ఈ వేడుకకు కొద్దిమంది మాత్రమే హాజరయ్యారు. ప్రస్తుతం ఈ జంటకు సోషల్ మీడియాలో అభిమానులు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056